అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 2-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 152 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 16 పేజీలు + (టాబ్లాయిడ్ 12 పేజీలు) | వెల : 6.50



దశ దిశలా.. తెలంగాణ వికాస హేల

బతుకు అంటేనే దుర్భరం అన్న రోజుల నుంచి సంక్షేమం అంటే ఇదే అన్న స్థితికి చేరింది తెలంగాణ.
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం రూపకల్పనలో వినూత్నమైనది, అమలులో విప్లవాత్మకమైనది. ప్రతీది పేదల అభ్యున్నతికి తీసుకొచ్చిందే.
పథకాల రూపకల్పనలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తన మార్కు చూపించారు.





2 కోట్ల ఎకరాల మాగాణ.. నా తెలంగాణ

నాడు బీడు భూములు.. నేడు పచ్చని భూములు, నాడు కరెంటు కోతలు.. నేడు నిరంతర వెలుగులు, నాడు క్షామం.. నేడు క్షేమం. ఇదీ తెలంగాణ సాధించిన విజయం, తెలంగాణ రైతన్న గడించిన ఘనవిజయం. రెండు కోట్ల ఎకరాల మాగాణం అని గర్వంగా చెప్పుకొనే గెలుపు. రూ.లక్ష కోట్ల సంపద సృష్టించాం అని పండుగ చేసుకొనేంత సంబురం.

'రైతుబంధు'

ఉమ్మడి రాష్ట్రంలో కరువు, పేదరికంతో అల్లాడిన తెలంగాణ రైతన్న.. సాగుకు పెట్టుబడి కూడా పెట్టలేని దుస్థితికి చేరాడు. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, అధిక వడ్డీల బారిన పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ పరిస్థితిని తరిమికొట్టేందుకు సీఎం కేసీఆర్ రైతుబంధుకు శ్రీకారం చుట్టారు. ప్రతి రైతుకు ఎంత భూమి ఉంటే అంత భూమికి ఏటా ఎకరాకు రూ.10 వేలు చొప్పున 65 లక్షల మందికి పెట్టుబడి సాయం అందిస్తున్నారు. 2018 వానకాలం సీజన్ నుంచి ఇప్పటి వరకు 10 సీజన్లలో ఏకంగా రూ.65,192 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఇంత భారీ మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం దేశంలో తెలంగాణ మాత్రమే.



ఉచిత విద్యుత్తు

2016 ఏప్రిల్ 1 నుంచి 9 గంటల ఉచిత విద్యుత్తును, 2018 జనవరి 1 నుంచి 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్తును తెలంగాణ సర్కారు అందిస్తున్నది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే.

లక్ష కోట్లు పెరిగిన వ్యవసాయ సంపద

2014-15లో పంటలు, పశు సంపద, చేపల నుంచి వచ్చిన ఆదాయం రూ.73,658 కోట్లు మాత్రమే. ఇందులో పంటల వల్ల వచ్చిన ఆదాయం రూ.41,706 కోట్లు. అదే 2020-21లో వ్యవసాయం, అనుబంధ రంగాల నుంచి వచ్చిన మొత్తం ఆదాయం రూ.1.80 లక్షల కోట్లు. ఇందులో పంటల నుంచి వచ్చిన ఆదాయం రూ. 80 వేల కోట్లు. అంటే ఏడేండ్ల కాలంలో లక్ష కోట్ల ఆదాయం పెరిగింది.

బీమాతో ధీమా

రైతు ఏ కారణం చేత మరణించినా ఆ కుటుంబానికి ఆర్థిక అండ కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకోసం రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ఆ రైతుకుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నారు. దీనికి బీమా పాలసీ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తున్నది. ఇలా నాలుగేండ్లలో 1,00,782 రైతు కుటుంబాలకు రూ.5,039 కోట్లు పరిహారంగా చెల్లించింది.

గత ఏడేండ్లలో 43.26 లక్షల మందిని రైతులకు రూ.857.27 కోట్లతో 38.34 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల పంటల విత్తనాలు రాయితీపై సరఫరా

మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు

రైతులు పండిస్తున్న ప్రతి గింజకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే. ధాన్యం మాత్రమే కాకుండా, ఇతర పంటలను కూడా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నది. కందులు, మక్కలు, జొన్నలు, శనగలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను కొంటున్నది. 2014 నుంచి ఇప్పటి వరకు రూ.10,805 కోట్ల విలువైన 41.09 లక్షల టన్నుల ఉత్పత్తులను ప్రభుత్వం కొన్నది.



సంక్షేమ జయ కేతనం.. నా తెలంగాణ


రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై చేస్తున్న ప్రతి పైసాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రతిఫలం దక్కుతున్నది. ఆసరా పింఛన్లతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా దక్కడంతోపాటు, కుటుంబంలోనూ ఆదరణ పెరిగింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడింది. మాతా శిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గింది. గొర్ల పంపిణీ పథకం ద్వారా రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి గతంతో పోల్చితే 22 శాతం పెరిగింది. చేపల ఉత్పత్తిలోనూ దూసుకుపోతున్నది. గురుకుల విద్యాలయాల స్థాపన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల విద్యాభివృద్ధిలో నవశకం మొదలైంది. డ్రాపౌట్స్ తగ్గి, ఉన్నత చదువులు చదివే బాలికల సంఖ్య పెరిగింది. మైనారిటీ బాలికల విద్యలో దేశంలోనే తెలంగాణ నంబర్ 1గా నిలవటం గర్వకారణం. ఒక్కటని కాదు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకం ఆశించిన స్థాయికి మించి సత్ఫలితాలను ఇస్తున్నది. సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ రోల్ మాడల్‌గా నిలుస్తున్నది.



ఆధ్యాత్మిక వైభవం.. నా తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఓ ప్రణాళికాబద్ధంగా ఆలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దేశంలోనే అత్యంత పురాతన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన ప్రభుత్వం, ఇదే క్రమంలో రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను సైతం క్రమంగా అభివృద్ధి చేస్తున్నది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) పథకం కింద జిల్లాల్లో ఆలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది.






దళితబంధు దర్జా.. నా తెలంగాణ

దళితుల సముద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దళితబంధుకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నది. సొంత వ్యాపారాలు, తెలిసిన, నచ్చిన ఉపాధి మార్గాన్ని ఎంచుకుని జీవించడానికి దళితకుటుంబాలకు ఎలాంటి షరతులు, బ్యాంకు లింకేజీ లేకుండా ఏక మొత్తంగా రూ.10 లక్షల నగదును అందిస్తున్నది. పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 38,323 దళిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. రూ.4,400 కోట్ల నిధులను వెచ్చించింది. ఈ పథకానికి 2023-24 బడ్జెట్‌లోనూ భారీగా నిధులను కేటాయించింది. హుజూరాబాద్‌లో పూర్తిస్థాయిలో అమలు చేయగా, మిగిలిన 118 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున దళితబంధు పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయాలని నిర్ణయించింది. అందుకోసం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించింది.

దళితబంధు అమలుకు గుర్తించిన అర్హులు 38,323 మంది

నగదు పొందిన లబ్ధిదారులు 38,323 మంది (100%)

గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్లు 38,323 (100%)



ధరిత్రికి హరిత హారం.. నా తెలంగాణ

రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో తెలంగాణలో గ్రీన్‌కవర్ 18 శాతం నుంచి 31.6 శాతానికి పెరిగింది.

2015లో తెలంగాణలో గ్రీన్‌కవర్ 19.854 చదరపు కిలోమీటర్లు ఉండగా, 2021 నాటికి అది 21.214 చదరపు కిలోమీటర్లకు పెరిగింది.

పచ్చదనం పెంపులో హైదరాబాద్‌కు గ్రీన్‌సిటీ అవార్డు దక్కింది. లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనమిక్ రికవరీ అండ్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ అవార్డునూ హైదరాబాద్ దక్కించుకున్నది.

తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ మానసపుత్రికగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంతో రాష్ట్రమంతా పచ్చదనం పరుచుకుంటున్నది. హరితహారం ద్వారా ఇప్పటి వరకు 268.13 కోట్ల మొక్కలను నాటారు. 19 వేల ఆవాసాలు, గ్రామపంచాయతీల్లో పార్కులను ఏర్పాటు చేశారు. పల్లెలు, పట్టణాల్లో ప్రకృతి వనాలు, పార్కులు ఏర్పాటుతో ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది. యాదాద్రి మాడల్ ప్లాంటేషన్ హరితహారంలో ఒక అద్భుతం. పట్టణాల స్థానికసంస్థల బడ్జెట్‌లో కనీసం10 శాతం కచ్చితంగా హరితహారం, మొక్కల పెంపకం, సంరక్షణ, నర్సరీలు తదితర వాటి కోసం ఖర్చు చేయాలని నిర్ణయించారు. హరితహారం కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవటానికి హరితనిధిని ఏర్పాటు చేశారు.



చదువుల తల్లి.. నా తెలంగాణ

తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించాలని చూస్తున్నారు. సర్కారు బడుల్లో తెలుగు మీడియంలోనే బోధించడంతో ఇలాంటి వారికి ప్రైవేట్ చదువులే దిక్కవుతున్నాయి. దీంతో ఫీజు భారం మోయక తప్పని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని 26 వేల సర్కారు బడుల్లో 1-8 తరగతులకు ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రారంభించారు. రాబోయే విద్యాసంవత్సరం నుంచి 9వ తరగతి వరకు విస్తరించనున్నారు.

సర్కారు బడుల స్వరూపాన్ని సమగ్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు - మన బడి, మన బస్తీ - మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. మూడు విడుతల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, 2022-23లో మొదటి విడతలో 1,240 బడులు సిద్ధమయ్యాయి. అందులో పూర్తయినవి పూర్తయినట్టు ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం 3 విడతల్లో 3,41,265 డ్యూయల్ డెస్క్‌బల్లలు, 1,39,585 గ్రీన్ చాక్‌పీస్ బోర్డులను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

డిజిటల్ క్లాసులకు 2014కు ముందు సైట్ బడ్జెట్ రూ.300 కోట్లే కాగా, ప్రస్తుతం రూ.451 కోట్లకు చేరింది.

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా 35 గురుకుల పాఠశాలలు నడుస్తున్నాయి. 2020-21లో రూ.160 కోట్లు, తాజాగా 172 కోట్లు ఇచ్చారు.

జారీచేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ



దశ దిశలా.. తెలంగాణ వికాస హేల



నిండు కుండ.. నా తెలంగాణ

రూ.38,405.2 కోట్లు
2004-14 వరకు పదేండ్లలో తెలంగాణ ప్రాజెక్టులపై ఉమ్మడి సర్కారు పెట్టిన ఖర్చు

రూ.1.69 లక్షల కోట్లు
2014-23 వరకు 9 ఏండ్లలో ప్రాజెక్టులపై తెలంగాణ సర్కారు వెచ్చించిన మొత్తం

75 ఏండ్లలో దేశవ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం 7.7%

9 ఏండ్లలో తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణ శాతం 117%

9 ఏండ్లలో పెరిగిన సగటు భూగర్భ జల మట్టం 4.14 మీటర్లు

ఏడేండ్లలో తెలంగాణ సర్కారు పూర్తి చేసిన పెండింగ్ ప్రాజెక్టులు: కల్వకుర్తి, రాజీవ్ భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, మిడ్‌మానేర్, సింగూరు కెనాల్స్, ఎల్లంపల్లి, కిన్నెరసాని, పాలెంవాగు, కుమ్రంభీం, మత్తడివాగు, నీల్వాయి, జగన్నాథపూర్

తెలంగాణ ఏర్పాటు తరువాత మొదలుపెట్టి పూర్తిచేసిన ప్రాజెక్టులు: కాళేశ్వరం, చనాకా కొరాట బరాజ్, సమ్మక్కసారక్క బరాజ్, భక్తరామదాసు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం



పవర్ హౌస్.. నా తెలంగాణ

- రాష్ట్రం ఏర్పడినప్పుడు మన విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 7,778 మెగావాట్లు మాత్రమే. గత 9 ఏండ్లలో దీన్ని రెట్టింపు కంటే ఎక్కువగా సాధించాం. ప్రస్తుతం 18,567 మెగావాట్లకు స్థాపిత సామర్థ్యం చేరుకున్నది.
- రాష్ట్రం ఏర్పడినప్పుడు 128 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం (6.6.2014 నాడు) ఉండగా, 14.3.2023 నాడు ఏకంగా 297.89 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. ఇది కూడా ఒక రికార్డు.

వ్యవసాయానికి 24 గంటల పూర్తి ఉచిత విద్యుత్తు

వ్యవసాయంతోపాటు రాష్ట్రంలోని ప్రతి రంగానికి 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్తును అందించేందుకు వీలుగా రూ.39,321 కోట్లతో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను బలోపేతం చేశారు. 2018 జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్తును పూర్తి ఉచితంగా కొనసాగిస్తున్నారు. ఇది దేశంలోనే రికార్డు. అందుకే అనేక రాష్ట్రాల నుంచి అధికారులు, రైతులు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వచ్చి ఇక్కడ రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్తును అధ్యయనం చేస్తున్నాయి.



భువన భవన విజయం.. నా తెలంగాణ

తెలంగాణలో రోడ్లు, భవనాల శాఖ అద్వితీయమైన విజయాలను నమోదు చేసింది. తొమ్మిదేండ్లలోనే 102లక్షల చదరపు అడుగుల మేర భవనాలు, 8,578 కిలోమీటర్లమేర రోడ్లు, 382 వంతెనలను నిర్మించి తనకు మరే రాష్ట్రమూ సాటిరాదని నిరూపించింది. నూతన సచివాలయం, 125 అడుగుల పొడవైన అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక చిహ్నం వంటి కట్టడాలను నిర్మించింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు కేవలం 30.43 లక్షల చదరపు అడుగుల ప్రభుత్వ భవనాలు ఉండగా, తెలంగాణ ఏర్పాటైన తర్వాత తొమ్మిదేండ్లలో 300 రెట్లు అధికంగా.. అంటే 102.02 లక్షల చదరపు అడుగుల మేర కొత్త నిర్మాణాలు పూర్తి చేసింది.

బీఆర్ అంబేద్కర్ సచివాలయం

రూ.617 కోట్లతో ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. 28 ఎకరాల్లో 7,79,982 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7 అంతస్థుల్లో 265 అడుగుల ఎత్తుతో దీనిని నిర్మించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఆయా శాఖల ముఖ్య అధికారులు, ఆయా శాఖల కార్యాలయాలను విశాలంగా నిర్మించారు. అన్ని శాఖలూ ఒకే సముదాయంలో ఉండటం దీని ప్రత్యేకత. ఇంత ఎత్తయిన సచివాలయం ఏ రాష్ట్రంలోనూ లేదు. 26 నెలల రికార్డు సమయంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేశారు.



పరిశ్రమల ప్రాభవం

- దేశం నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు జరుగుతున్న ఎగుమతుల్లో తెలంగాణ హవా కొనసాగుతున్నది. దేశం నుంచి జరుగుతున్న 75 శాతం ఎగుమతులు ఐదు రాష్ట్రాలనుంచే జరుగుతుండగా, అందులో తెలంగాణ కూడా ఒకటి.
- రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సామాజిక, ఆర్థిక నివేదిక-2022 ప్రకారం, 2021-22లో తెలంగాణ నుంచి రూ.2,65,510 కోట్ల విలువైన సరుకు, సేవలు అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి అయ్యాయి.
- 2014-23 మధ్య పరిశ్రమల కోసం టీఎస్ఐఐసీ ద్వారా 28,500 ఎకరాల కేటాయింపు.
- టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో పారిశ్రామికవాడల ఏర్పాటు.
- వీటి ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ. 2.62 లక్షల కోట్లు, 17.62 లక్షలమందికి ఉద్యోగాలు.



ఆరోగ్యం.. ఆనందం

ఉమ్మడి రాష్ట్రంలో కునారిల్లిన వైద్యారోగ్య రంగం స్వరాష్ట్రంలో తొమ్మిదేండ్లలోనే దేశానికి ఆదర్శంగా ఎదిగింది. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో అమలు చేస్తున్న విప్లవాత్మక పథకాలు, వినూత్న కార్యక్రమాలు ప్రజావైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయి. ఫలితంగా ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని పాడుకున్న రోజుల నుంచి.. నేను పోత బిడ్డో సర్కారు దవాఖానకు అని సంబురంగా వెళ్లే రోజులు వచ్చాయి.

న్యూట్రిషన్ కిట్ : గర్భిణుల్లో పోషకాహార లోపం, రక్తహీనత లేకుండా కాపాడేందుకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ పథకాన్ని ప్రారంభించింది.

కేసీఆర్ కిట్.. మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక కేసీఆర్ కిట్లు, అమ్మ ఒడి వాహనాలు వంటి పథకాలను ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు 13.91 లక్షల మంది లబ్ధి పొందగా, ప్రభుత్వం రూ.1,420 కోట్లు ఖర్చు చేసింది.

కంటివెలుగు: అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా కోటిన్నర మందికి పరీక్షలు నిర్వహించి 80 లక్షల మందికి కండ్లద్దాలు పంపిణీ చేశారు.



ఐటీలో మేటీ.. నా తెలంగాణ

ఐటీ ఎగుమతులు 26%, ఉద్యోగాలు 24% వృద్ధి

ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి

దేశంలో స్టార్టప్ క్యాపిటల్‌గా నిలిచిన తెలంగాణ

భారీగా పెరిగిన పెట్టుబడులు రెట్టింపైన కొలువులు

ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరించిన సాఫ్ట్‌వేర్

కొత్తగా గ్రిడ్ పాలసీ: హైదరాబాద్ గ్రోత్ డిస్పర్షన్ (గ్రిడ్)పాలసీలో భాగంగా ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 11 పారిశ్రామిక వాడలను ఐటీ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు ఆదేశాలను జారీ చేసింది.

ప్రస్తుతం ఐటీ ఎగుమతులు 26 శాతం ఉండగా, ఐటీ ఉద్యోగావకాశాలు 24 శాతం వృద్ధి చెందాయి. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో స్థానం పొందిన 20కి పైగా బహుళ జాతి కంపెనీలు(ఎంఎన్‌సీ) హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి.

స్టార్టప్ క్యాపిటల్ : టీహబ్ తో వేల స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయి. హైదరాబాద్ కేంద్రంగా స్టార్టప్‌లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ, విశ్వవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు రచించుకుంటున్నాయి. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ట్రై గ్లోబల్ సమ్మిట్-100 ఎమర్జింగ్ స్టార్టప్‌ల జాబితాలో టీ-హబ్‌లోని 13 స్టార్టప్‌లకు చోటు లభించింది.



విశ్వ నగర దృశ్యం..

హైదరాబాద్‌ను దేశంలో అగ్రభాగాన నిలిపింది తెలంగాణ ప్రభుత్వం. తొమ్మిదేండ్లలోనే బెస్ట్ సిటీగా మార్చి ప్రపంచ దేశాలను హైదరాబాద్ వైపు తిప్పింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు జీహెచ్ఎంసీ విశేష కృషి చేస్తున్నది.

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతిరోజు ఆరు వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. వీటిని 4,500 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి నుంచి, కమర్షియల్ ప్రాంతాల నుంచి సేకరిస్తున్నారు. వీటిని నగరంలోని 17 ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలిస్తున్నారు.

రవాణా వ్యవస్థను సిగ్నల్ రహితం గా మార్చింది. తొలి విడతలో రూ.5,937 కోట్లతో 48 చోట్ల ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులతో తొమ్మిదేండ్లలోనే 35 చోట్ల (రూ.3,248.53 కోట్లు) ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మరో 13 చోట్ల రూ.3,515.33 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయి.

జారీచేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ

సంపాదకీయం

మరో మలుపులో ఉక్రెయిన్ సంక్షోభం

పశ్చిమ దేశాల కుట్రలో పావుగా మారిన ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య గురువారం నాటికి 463వ రోజులో ప్రవేశించింది. జెలెన్స్కీ సేనల వద్ద పాత అస్త్రాలు ఇంకేమాత్రం లేవు. ఊఇప్పుడు అమెరికా, నాటో కూటమి దేశాలు అందించిన ఆధునిక

> నెలల తరబడి బఖ్ముత్ అనే పట్టణాన్ని స్వాధీనం చేసుకొనేందుకు ప్రైవేటు రష్యా సాయుధ దళాలు జరిపిన దాడులతో మే 21న ఆ పట్టణం స్వాధీనమైంది. తరువాత పుతిన్ సేనలకు దాన్ని అప్పగించారు. తొలుత ఉక్రెయిన్ నేత జెలెన్స్కీ బుకాయించినప్పటికీ తొమ్మిది రోజుల తరువాత ఉక్రెయిన్ మిలిటరీ అంగీకరించింది. పశ్చిమ దేశాలు పుతిన్ సేనలను ఎదుర్కొనే ఎత్తుగడలను మార్చినట్లు కనిపిస్తోంది. దానికి అనుగుణంగానే మాస్కో కూడా వ్యవహరిస్తోంది. ఏ క్షణమైనా పరిస్థితి మరింతగా దిగజారే సూచనలు కనిపిస్తున్నాయి.

అస్త్రాలు, వాటిని ఉపయోగించేందుకు అవసరమైన శిక్షణ తీసుకుంటున్నారు. ఉక్రెయిన్ మిలిటరీ, దానితో పాటు దాడులకు సిద్ధం అవుతున్న కిరాయి మూకలు ఎదురుదాడులకు అనువైన తరుణం కోసం ఎదురు చూస్తున్నట్లు వార్తలు. దానికి ముందుగా గత కొద్ది రోజులుగా మాస్కో నగరం మీద, సరిహద్దులోని రష్యా ప్రాంతాల మీద ఉక్రెయిన్ జరుపుతున్న డ్రోన్ దాడులను చూస్తే రెండు దేశాల మధ్య ప్రారంభమైన పోరు కొత్త మలుపు తిరుగుతోందనటానికి సూచికగా పరిగణిస్తున్నారు. తమ భూ భాగాన్ని రక్షించుకొనేందుకు ఆత్మ రక్షణ దాడులు జరుపుతున్నట్లు చెబుతున్న ఉక్రెయిన్ ఇప్పుడు పశ్చిమ దేశాల కుట్రలో భాగంగా ఏకంగా రష్యా మీదకు కాలుదువ్వుతోంది. నిజానికి అక్కడ జరుగుతున్నది పశ్చిమ దేశాల పరోక్ష యుద్ధం అన్నది తెలిసిందే. దాని కొనసాగింపుగా నేరుగా మంగళవారం మాస్కో నగరం, బుధవారంనాడు రష్యాలోని కొన్ని ప్రాంతాల్లోని, నివాసాలు, ఒక చమురు శుద్ధి కర్మాగారం మీద డ్రోన్ల దాడి జరిపారు. కొన్ని భవనాలు దెబ్బతినటం, ఒకరి మృతి, కొందరు గాయపడటం తప్ప పెద్దగా నష్టమేమీ జరగనప్పటికీ సంక్షోభాన్ని మరో మలుపు తిప్పేందుకు చూస్తున్నారన్నది స్పష్టం. పుతిన్ సేనలు ఉఉకెయిన్ మీద క్షిపణి దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయి.



తాజా దాడులు ఉగ్రవాద చర్య అనీ దీని వెనుక అమెరికా హస్తం ఉందని రష్యా విమర్శించింది. ఈ దాడులతో తమకు ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం లేదని, వాటిని చూస్తూ తాము సంతోషిస్తున్నామని ఉక్రెయిన్ ప్రకటించటాన్ని బట్టి ఉగ్రదాడులన్నది స్పష్టం. మాస్కో నగరం, ఇతర ప్రాంతాల మీద జరిగిన డ్రోన్ దాడుల గురించి తమకు స్పష్టత లేదని, ఏదో జరిగిందన్న సమాచారం తప్ప నిర్దిష్టంగా ఏమీ చెప్పలేమని, సమాచారాన్ని సేకరిస్తున్నామని అమెరికా భద్రతా మండలి ప్రతినిధి కిర్బీ చెప్పటం తప్పించుకొనే మాట తప్ప మరొకటి కాదు. పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా గానీ రష్యా భూ భాగాల మీద దాడులను తమ ప్రభుత్వం సమర్థించదని అన్నాడు. అమెరికా ఏమి చెప్పుకున్నప్పటికీ దాని మోసకారితనం దాస్తే దాగేది కాదు. మే మూడవ తేదీన క్రెమ్లిన్ మీద జరిపిన డ్రోన్ దాడిలో ఉక్రెయిన్ ప్రత్యేక దళాలు లేదా మిలిటరీ గూఢచారుల హస్తం ఉందని అమెరికా అధికార వర్గాలు చెప్పినట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసింది. అదే విధంగా క్రిమియా వంతెన పేల్చివేత తమ పనేనని తొమ్మిది నెలల తరువాత ఉక్రెయిన్ మే 27న అంగీకరించింది. ఇవేవీ అమెరికా లేదా నాటో హస్తం లేకుండా జరిగేవి కాదు.

అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆధునిక అస్త్రాలను కూడా అడ్డుకోగల సత్తా ఉన్న రష్యా ఏకంగా తన రాజధాని మీదకు వదిలిన డ్రోన్లను ఎలా అడ్డుకోలేకపోయిందన్న ప్రశ్న తలెత్తింది. తమ రక్షణ వ్యవస్థలు మామూలుగానే పని చేశాయని, ఇంకా మెరుగుపరుచుకోవాల్సి ఉందని అధ్యక్షుడు పుతిన్ చెప్పాడు. ఖండాంతర క్షిపణుల వంటి భారీ దాడులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉన్నాయని, తక్కువ ఎత్తులో ఎగురుతూ వచ్చే డ్రోన్లకు సంబంధించి ఉన్న లోపాన్ని సరిచేస్తున్నట్లు అధికారులు వివరించారు. బెల్‌గోరోడ్ ప్రాంతం మీద డ్రోన్ల దాడి జరిపింది తామేనని ఫ్రీడమ్ ఫర్ రష్యా లెజియన్ అనే సంస్థ చెప్పుకుంది. వీరు ఉక్రెయిన్ మీద జరుపుతున్న దాడులను ప్రతిఘటిస్తున్న అక్కడి రష్యన్ తెగవారని చెబుతున్నారు. రష్యా మీద రష్యన్లే తిరగబడుతున్నారన్న పశ్చిమ దేశాల ప్రచారదాడిలో భాగంగా ఇలాంటి ప్రకటనలు కూడా వెలువడవచ్చు. నెలల తరబడి బఖ్ముత్ అనే పట్టణాన్ని స్వాధీనం చేసుకొనేందుకు ప్రైవేటు రష్యా సాయుధ దళాలు జరిపిన దాడులతో మే 21న ఆ పట్టణం స్వాధీనమైంది. తరువాత పుతిన్ సేనలకు దాన్ని అప్పగించారు. తొలుత ఉక్రెయిన్ నేత జెలెన్స్కీ బుకాయించినప్పటికీ తొమ్మిది రోజుల తరువాత ఉక్రెయిన్ మిలిటరీ అంగీకరించింది. పశ్చిమ దేశాలు పుతిన్ సేనలను ఎదుర్కొనే ఎత్తుగడలను మార్చినట్లు కనిపిస్తోంది. దానికి అనుగుణంగానే మాస్కో కూడా వ్యవహరిస్తోంది. ఏ క్షణమైనా పరిస్థితి మరింతగా దిగజారే సూచనలు కనిపిస్తున్నాయి. దానికి పశ్చిమ దేశాలదే బాధ్యత అవుతుంది.

కట్టు కథలు నమ్మడంలో భారతీయులే - ఫస్ట్..!



డాక్టర్ దేవరాజు మహారాజు

ఈ విద్వేషానికి, విధ్వంసాలకు, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మారణ హోమాలకూ కారణం కేవలం అతడొక్కడే! అతడూ, అతని ముఠా అతడి అనుచరులూ కారణం!! అతడి పేరు - దేవుడు. అతని ముఠా పేరు - మతం. అతడి అనుచరులే మత బోధకులూ, భక్తులు!!

ఐదువేల ఏండ్ల క్రితం కృష్ణుడు ఉండేవాడు అని పిట్ట కథలు చెప్పేవారు కాస్త చారిత్రక ఆధారాలేమిటో తెలుసుకుంటే బావుండును. పదకొండో శతాబ్దం వరకు భారతీయ పురాణాలలో ఎక్కడా కృష్ణ శబ్దమే లేదు. వాసుదేవ అనే శబ్దం జాతక కథలలో మాత్రమే ఉంది. ఇరానియన్ యాత్రికుడు అల్-బరూనీ రాసుకున్న యాత్రా విశేషాలలో కూడా వసుదేవ పేరు ఉందే గాని, కృష్ణ శబ్దం లేదు - 'జాతక కథలు' బౌద్ధ సాహిత్యానికి సంబంధించినవి.

తల్లి దండ్రులు లేక తనయుడెట్లు బుట్టు
కన్య మేరి క్రీస్తును కన్నదెట్లు
స్త్రీ పురుష కలయికే శిశు జన్మమే కదా
కల్పితాలు - కట్టు కథలే సుమీ!
సృష్టి కర్తనంటు యెహోవా సుండగా
శిలువ వేసి చంపె క్రీస్తు నెట్లు
రక్షకుండు తనను రక్షించుకోలేదు
లోక రక్షకుడంటె నమ్మడ మెట్లు
సూర్యాస్తమయం అవనిలోనే లేదు
అబద్దాల నెట్లు పలికె ఆది గ్రంథం
సృష్టి కర్త స్పృహ లేకపోయెనా

బైబిల్ కథలన్నీ కట్టు కథలే - అంటూ ఓ ఆధునిక కవి ఎన్నో ప్రశ్నలు గుప్పించాడు. జవాబుల్లేని ప్రశ్నలు అన్ని మతాల మత గ్రంథాల్లోనూ ఉన్నాయి. భక్తులు తమ ఆదాయంలోని దశమ భాగం చర్చ్‌కి ఇవ్వడం మానేస్తే మొట్టమొదట క్రైస్తవాన్ని వదిలేసేవాడు పాస్టరే! అలాగే అల్లా సర్వశక్తి సంపన్నుడు అని చెప్పడానికి ఓ కట్టు కథ చెపుతారు.

"ఓ నా ప్రభూ! నువ్వు మృతులను ఎలా సజీవులుగా చేస్తావో చూపు" అన్నాడు ఇబ్రహీం.

"ఏం? నీకు నమ్మకం లేదా?" - అన్నాడు అల్లాహ్.


"ఉంది. కానీ, నా మనసు తృప్తి పడడానికి అడుగుతున్నాను" - ఇబ్రహీం.

"అయితే, నాలుగు పక్షులను తీస్కో. వాటిని మచ్చిక చేసుకో. తర్వాత వాటిని కోసి వాటి విడి భాగాల్ని కొండమీద పెట్టు. ఆ తర్వాత వాటిని రమ్మని పిలువు. అంతే - అవి ఎగురుకుంటూ వస్తాయి" - అన్నాడు అల్లాహ్. "అందువల్ల అల్లాహ్ శక్తిమంతుడు అని తెలుసుకో" అని కూడా చెప్పాడు అల్లాహ్. ఇబ్రహీం మాట్లాడలేదు. వివేకవంతుడైన ఆధునికుడైతే అక్కడ మరో ప్రశ్న అడిగేవాడు. 'చనిపోయినవే బతికి వచ్చాయని రుజువేమిటీ? ఆ వచ్చేవి కొత్త పక్షులు కావచ్చు కదా?' - అని! తమ జాతి పక్షి చనిపోతే వెంటనే ఇతర పక్షులు అక్కడికి అరుచుకుంటూ వస్తాయి. ఉదాహరణకు మీరు ఒక పామును కొట్టి చంపండి. దాని జీవద్రవాలు ఉత్ప్రేరకాలుగా పనిచేసి, కాసేపటికి ఆ చోటికి మరో పాము వస్తుంది. ఇది జంతు ప్రవృత్తిలో ఒక భాగం. ఎవరి శక్తియుక్తులూ అక్కర లేదు. అన్ని మత గ్రంథాలలో అభూత కల్పనలు కోకొల్లలు. అవన్నీ నిజమే అని ఇంకా ఈ ఆధునిక కాలంలో కూడా గుడ్డిగా నమ్ముతున్న వారి సంఖ్యే అధికం. ఇతర దేశాల వారి కన్నా కట్టు కథలు నమ్మడంలో భారతీయులదే మొదటి స్థానం. ఉదాహరణకు...

హిందూ మత గ్రంథాల్లోని కుమారస్వామి జననం గూర్చి చూద్దాం! అక్కడ ఒక సన్నివేశం ఏమిటంటే... అగ్ని దేవుడు శివుణ్ణి చూడడానికి వచ్చాడు. అదెప్పుడూ? శివ పార్వతులు కామక్రీడలో ఉన్నప్పుడు - చెప్పాపెట్టకుండా అలా అకస్మాత్తుగా వచ్చినందుకు శివుడికి కోపం వచ్చింది. అగ్నిపై తన వీర్యాన్ని చల్లుతాడు. ఆ వీర్యం మంటకు అగ్ని తాళలేకపోతాడు. బ్రహ్మను తలుచుకుంటాడు. బ్రహ్మ శరవణ సరసికి వెళ్ళమని సలహా ఇస్తాడు. అగ్ని అక్కడికి పరుగుతీస్తాడు. తీరా అక్కడేం జరుగుతోంది? సప్త రుషుల భార్యలు జలకాలాడుతున్నారు. ఇక నేం అగ్ని తన మంటలు మరిచిపోయి కామోద్రిక్తుడవుతాడు. అనూహ్యంగా అక్కడికి వచ్చిన అగ్నిని చూసి, అరుంధతి తక్షణమే బట్టలు చుట్టుకుంటుంది. మిగిలిన ఆరుగురు ఆ పని చేయరు. పైగా, అగ్నితో కలిసి తృప్తి పొందుతారు. ఆ సమయంలో అగ్ని ఒంటిపై ఉన్న శివుని వీర్యం - ఆ ఆరుగురు రుషి భార్యల గర్భాల్లోకి ప్రవేశిస్తుంది. స్పృహలోకి వచ్చిన ఆ ఆరుగురు మహిళలు భయంతో తమ తమ గర్భ పిండాలను శరవణ సరసిలో తామరాకులపై వదులుతారు. ఎవరి ఇళ్ళకు వారు తిరుగు ముఖం కడతారు. వారి భర్తలు మహారుషులు కదా? తమ భార్యలు ఏ పనిచేసి వస్తున్నారో మంత్రశక్తి వల్ల పసిగడతారు. కోపోద్రిక్తులై వారిని తిరస్కరిస్తారు. ఎంతైనా రుషి పత్నులు శివుని వీర్యాన్ని మోసారు కదా అని బ్రహ్మ కరుణించి, మళ్ళీ మధ్యలో కల్పించుకుని వారికి వరం ఇస్తాడు. జ్యోతిర్లోకంలో వారిని కృత్తికలుగా ప్రకాశించమని దీవిస్తాడు. అప్పుడు శరవణ సరసిలో ఆరుగురు రుషుల భార్యలు తామరాకుల మీద వదిలేసిన పిండాలు అతుక్కుని ఒక్కటై, షణ్ముఖ రూపాన్ని దాలుస్తాయి. ఆ షణ్ముఖ (ఆరు ముఖాల) రూపమే కుమారస్వామి అవుతాడు.

ఈ చిన్న కథలోని విషయాల గూర్చి ఆలోచిస్తే మనకు ఏమనిపిస్తుంది? హిందూ పురాణాల నిండా అక్రమ లైంగిక సంబంధాలు బాహాటంగా కనిపిస్తాయని తెలుస్తుంది. ప్రపంచంలో ఎక్కడా ఏ ప్రార్థనా స్థలాలలో కనిపించని స్త్రీ పురుష లైంగిక భంగిమల శిల్పాలు హిందూ దేవాలయాల్లోనే కనిపిస్తాయి. పురాణాలన్నీ వందల ఏండ్ల క్రితం రాయబడ్డవి. శిల్పాలు కూడా ఆ కాలంలోనే చెక్కబడ్డాయి. అప్పటి సమాజ స్థితి గతులను బట్టి అవి ఉనికిలోకి వచ్చాయి. మనం ఈ అత్యాధునిక యుగంలో ఉండి వాటిని తప్పు పట్టాల్సిన పనిలేదు. కానీ, అవి గొప్పవని, అవే మన సంస్కృతీ సంప్రదాయాలని వాటిని పాటిస్తూ ఉండాలని చెప్పే అవివేకులకు కొన్ని విషయాలు స్పష్టం చేయక తప్పదు - ఈ కుమారస్వామి జననంలో ఎక్కడైనా, ఏ మాత్రమైనా వాస్తవం ఉందా? అన్నింటికి అన్నీ అభూత కల్పనలే కదా? అగ్నే మండుతూ ఉండేది. అలాంటి అగ్నిని శివుడి వీర్యం మండించిందట. అంటే అది ఇంకా ఎంత వేడిగా ఉండాలి? ఒళ్ళు కాలి గగ్గోలు పెడుతూ శరవణ సరసి పారిపోయిన అగ్ని అక్కడ ఆరుగురు మునిపత్నులను ఎలా మోహించాడు. ఒకేసారి ఆరుగురిని ఎలా సంతృప్తి పరిచాడు? సరే ఆ విషయం అలా ఉండనిద్దాం... మునిపత్నుల గర్భాల్లో అగ్ని దేవుని వీర్యం ఉండాలి గానీ, అతడి ఒంటిమీద పడిన శివుని వీర్యం ఎలా ప్రవేశించిందీ? పోనీ అది కూడా అలా ఉండనిద్దాం... ఉన్న ఫళాన ఆరుగురి గర్భాల్లో ఆరు పిండాలు ఎలా ఏర్పడ్డాయీ? సరే... గర్భాల్ని బయటికి తీసి తామరాకుల మీద వేయగలిగే సామర్థ్యం వారికి ఎలా వచ్చింది? సరే... అది అలా ఉండనిద్దాం. వేరు వేరు ఆకుల మీద ఉన్న పిండాలు ఏ శక్తి వల్ల దగ్గరయ్యాయి? దగ్గరై ఒక్కటయ్యాయి? ఒక్కటై ఎలా షణ్ముఖుడు ఏర్పడ్డాడూ? ఎక్కడికక్కడ ఇంత మంత్రశక్తా? ఇన్ని మహిమలా? ఇన్నిన్ని అభూత కల్పనలా? కాక్ అండ్ బుల్ స్టోరీస్ కంటే అధ్వాన్నంగా, అసందర్భ ప్రేలాపనల్లా, వదరుబోతు మాటల్లా సాగే వీటిని... భక్తి శ్రద్ధలతో విని తరించాలా? కనీస

> ఆధునికత పెరుగుతున్న కొద్దీ, చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న మహిళలు చేతి గాజుల్ని, కాలి మెట్టెల్ని వదిలేస్తున్నారు. దానివల్ల హిందూ సంప్రదాయం దెబ్బతింటుందని, పురుషుల ఆధిపత్యం తగ్గిపోతుందని మనువాదుల భయం. అందుకే నాడి గురించి, శక్తి గురించి బూటకపు విజ్ఞానం ప్రచారం చేస్తున్నారు. ఈ మత పిచ్చి గాళ్ళకు అంత తెలివి ఉంటే... కాలి రెండో వేలి నుండి స్త్రీ గర్భాశయానికి వెళ్ళే "నాడి" ఏదో స్పష్టంగా చెప్పాలి. వైద్య శాస్త్రం చదువుకున్న వారికి 'హ్యూమన్ అనాటమీ' క్షుణ్ణంగా తెలిసి ఉంటుంది. వారికి ఎవరికీ తెలియని ఒక 'నాడి' ఈ మనువాదులకు ఎలా తెలిసిందీ? ఇతర మతాల మహిళలు ఎవరూ మట్టెలు పెట్టుకోరు. మరి వారంతా బాగున్నారు కదా? హాయిగా కాపురాలు చేసుకుంటూ, పిల్లల్ని కని పోషించుకుంటున్నారు.



ఇంగితం లేని ఈ కట్టు కథలు గొప్ప పురాణాలా? గొప్ప సంప్రదాయ రచనలా? ఆ దేవ దేవుడే స్వయంగా మానవులకు అందించిన మహత్తర జ్ఞాన సాగరాలా? వివేచన పెరిగిన ఆధునికులు వీటిని ఆమోదించాలా? మెదడు లేని జడ పదార్థాలు ఆమోదించాల్సిందే? 'కల్పిత గాథలు' అని చెప్పండి చాలు. ఆమోదించడానికి ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండదు. వందల సంవత్సరాలుగా కోట్ల మంది జీవితాల్ని అన్యాయంగా దుర్భరం చేసిన వైదిక మత ప్రభోదకులు అందుకు ఒప్పుకోరు కదా?

నిత్య జీవితంలో మనం చూస్తున్న మరొక విషయం గమనించండి. మూఢ విశ్వాసానికి సైన్సును జోడించి అబద్ధపు ప్రచారాలు చేస్తున్న వారిని చూస్తే జాలీ, కోపం రెండూ కలుగుతాయి. అయితే అలాంటి విషయాల గూర్చి సరైన వివరణలు ఇచ్చి జనాన్ని ఆలోచింపజేయాలి. హిందువుల్లో వివాహిత స్త్రీలు కాళ్ళకు 'మట్టెలు' పెట్టుకుంటారు. వివాహ సమయంలో పెళ్ళికొడుకు మొదటిసారి పెళ్ళికూతురి కాలి రెండో వేలికి తొడుగుతాడు. ఇప్పుడు దాని వెనక గొప్ప ఆరోగ్య సూత్రముందని మనువాదులు ప్రచారం చేస్తున్నారు. మట్టెలు ధరించే కాలి రెండో వేలు నుండి ఒక నాడి వారి గర్భాశయానికి వెళుతుందని, దాని వల్ల రుతుక్రమం సరిగా ఉంటుందని, గర్భాశయానికి రక్తప్రసరణ బాగా జరుగుతుందని ఢంకా బజాయించి చెపుతున్నారు. వెండి మంచి వాహకం గనుక, భూమి నుండి శక్తిని గ్రహించి దాన్ని శరీరానికి అందిస్తుందని కూడా చెపుతున్నారు. సారాంశం ఏమిటంటే, గతంలో స్త్రీలను బానిసలుగా చూశారు. కాళ్ళకు, నడుముకు, మెడకు అన్ని శరీర భాగాలకు గొలుసులు వేసి, ఒక బానిసలాగా అదుపులో ఉంచుకున్నారు. కాలక్రమంలో వాడే లోహాలు మారాయి. ఇనుము, వెండి, బంగారమైంది. ఒకప్పటి బానిసత్వపు గొలుసులే ఆభరణాలయ్యాయి. హిందూ స్త్రీలు ఆభరణాలు తగిలించుకునే పద్ధతి ఎలా మొదలయ్యిందో నేటి మహిళలకు తెలియదు. డబ్బున్నవాళ్ళయితే ఆభరణాల్ని ఆడంబరంగా కూడా ప్రదర్శించుకుంటారు. స్త్రీలను హద్దులో అదుపులో ఉంచుకోవడానికి ఇవన్నీ ఉండాల్సిందేనన్నది మనువాదుల కుట్ర. అందుకోసం లేని సైన్సును తెచ్చి - తమ ఖాళీ మెదళ్ళను ప్రదర్శించుకుంటున్నారు.

ఆధునికత పెరుగుతున్న కొద్దీ, చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న మహిళలు చేతి గాజుల్ని, కాలి మెట్టెల్ని వదిలేస్తున్నారు. దానివల్ల హిందూ సంప్రదాయం దెబ్బతింటుందని, పురుషుల ఆధిపత్యం తగ్గిపోతుందని మనువాదుల భయం. అందుకే నాడి గురించి, శక్తి గురించి బూటకపు విజ్ఞానం ప్రచారం చేస్తున్నారు. ఈ మత పిచ్చి గాళ్ళకు అంత తెలివి ఉంటే... కాలి రెండో వేలి నుండి స్త్రీ గర్భాశయానికి వెళ్ళే "నాడి" ఏదో స్పష్టంగా చెప్పాలి. వైద్య శాస్త్రం చదువుకున్న వారికి 'హ్యూమన్ అనాటమీ' క్షుణ్ణంగా తెలిసి ఉంటుంది. వారికి ఎవరికీ తెలియని ఒక 'నాడి' ఈ మనువాదులకు ఎలా తెలిసిందీ? ఇతర మతాల మహిళలు ఎవరూ మట్టెలు పెట్టుకోరు. మరి వారంతా బాగున్నారు కదా? హాయిగా కాపురాలు చేసుకుంటూ, పిల్లల్ని కని పోషించుకుంటున్నారు. ఆ మహిళలకు లేని మహాద్భుతమైన ఆరోగ్యం, సుఖ సంతోషాలు ఈ హిందూ మహిళలకు యేం లభిస్తోందనీ? తాళి బొట్టు, గాజులు, మట్టెలు వదిలేసి, పైటలు తగిలేసి స్వేచ్ఛగా తిరుగుతున్న స్త్రీ వాదుల జీవితాలు సజావుగానే ఉన్నాయి. ఏదేమైనా అబద్ధపు సైన్సు చెప్పి భయపెట్టడం దండగ. కాలంతో పాటు మార్పులు సహజం. ఫ్యూడల్ వ్యవస్థ ఇంకా కొనసాగాలని కొందరు తాపత్రయ పడుతుంటారు. వారి కోరిక నెరవేరదు. మనువాదుల అబద్ధాల సైన్సును విశ్లేషించుకునే తెలివితేటలు ఇప్పుడు సామాన్య పౌరులకు కూడా ఉన్నాయి!

కేంద్రంలో బీజేపీ, ఆరెస్సెస్ అధికారం చేపట్టాక, దేశం గడ్డుకాలం ఎదుర్కొంటోంది. మత ప్రాదికన సామాజిక శత్రుత్వాలు పెరిగిపోయిన దేశాల్లో భారత్‌దే ఇప్పుడు అగ్రస్థానం. సిరియా 7.4, అఫ్ఘనిస్తాన్ 8 అయితే భారత్ 9.4గా ఉంది. తక్కువ స్కోరు ఉంటే ఆ దేశంలో సుహృద్భావ వాతావరణం ఉన్నట్టు. స్కోరు పెరిగిన కొద్దీ సామాజిక శత్రుత్వాలు పెరిగినట్టు లెక్క. 10లో భారత్ - 9.4 స్థానంలో ఉంది. ఈజిప్టు 7.4, పాకిస్థాన్ - సోమాలయా 7.6, మాలి 7.9, ఇజ్రయిల్ 8, నైజీరియా 8.5ల కంటే భారతదేశంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్న విషయం స్పష్టంగా తెలిసిపోయింది. భారత పౌరులు ఈ విషయం గ్రహించి, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది.

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



గ్రీష్మ తాపాక్షరం

తూర్పుకు బయలుదేరిన దేహపు
నుదురుపై వాలిన వెచ్చని గాలి
స్వేద బిందువులై రాలటంతో
ఎండా కాలపు స్పర్శలు మొదలయ్యాయి

నా కాయంపై ఆచ్ఛాదనలన్నీ
నాకు బరువై పోతున్నాయి
దిగంబరం కాలేక కప్పుకున్న వస్త్రపు పోగుల్ని
వొలిచి పక్కన పెట్టాలనే ఆతృత
ఏ నూలుపోగూ లేని వొంటిని
స్వాగతిస్తోంది మనసు

చీకట్లను చీల్చుకుంటూ...
ఉదయ భానుడు సప్తశ్వరథ మారుడై వేగంగా
వస్తున్నట్టు ఆకాశపు దార్లు
వెలుతురు బాకుల్ని విసురుతున్నాయి

వేకువ కువకువ సంగీతం
వెచ్చగా పచ్చని పైర్లను వాటేసుకుంటూ
సూర్యరశ్మి రూపాంతరమై
నిలువెల్లా నిటారుగా పొడుస్తోంది

ఇనుమును కరిగిస్తున్న భగ భగల కొలిమిలా
భగ్గున మండుతోంది ఎండ
ఎవరికీ ఎవరూ పట్టనట్టు
మనుషులంతా రోడ్లపై అడుగుల వేగం పెంచారు
వాహనాలూ మెదళ్ళలాగే వేడెక్కుతున్నాయి

రుతువులన్నీ ఒకేలా వుండవు
అని చెప్పేందుకే గ్రీష్మం కోపతాపాలతో
చిర్రు బుర్రు లాడుతున్నట్టుంది


తడి ఆరిపోయిన నాలుకలు
ఎడారి ఇసుక మేటలను స్మరిస్తూ..
అడుగడుగునా చలివేంద్రాలుంటే
బాగుండేదని ఘోషిస్తున్నట్టు పొడిపొడి నిట్టూర్పులు

లోపలి బయటి మంటల గురించి
ఎంత చెప్పుకున్నా..
ఎండాకాలం వర్ణనాతీతం
అది శ్రమ జీవుల కలికాలపు దుఃఖం

సుఖాల సంగతి ఏమో గానీ...
చెమట చుక్కలతో తడిసి
తీరని హక్కులతో వెరసి
ఒళ్లంతా ఉప్పు చారల్ని కప్పుకున్న
అభాగ్యుల మీద
ఈ క్షణమే ఇప్పుడే వున్నపళంగా
కాసింత మంచు వర్షం కురిస్తే
ఆనంద తాండవం చేయాలని వుంది
అంతే ఇది చాలు ఈ క్షణం..!

- డా. కటుకోర్ద్వుల రమేష్
సెల్:9949083327

మణిపూర్ లోయల్లో చిందుతున్న నెత్తుటికి కారకులెవరు?



ఎస్. విజయ్ కుమార్
9573715656

ఆ రోజు మే 3వ తేదీ. అది మణిపూర్‌లోని ఇంఫాల్ పట్టణంలోని న్యూ లాంబులేన్ వద్ద సాయంత్రం కావస్తుంది. చెట్లు మెల్లగా గాలికి కదులుతున్నాయి. పెద్ద ర్యాలీ అటువైపు వస్తుంది. గాలిలో ఒక్కసారే వేగంగా కదిలిన ఛాయ, తెల్లని బొలెరోలో నుంచి సడెన్‌గా బుల్లెట్ దూసుకొచ్చి ర్యాలీలో ఉన్న ఓ మనిషి తొడలోకి చొచ్చుకు పోయింది. ఓ పెద్ద జర్క్. బుల్లెట్ దెబ్బతో వాతావరణం వేడెక్కింది. అక్కడి శరీరాల్లో రక్తం వేగంగా ప్రవహించడం మొదలెట్టింది. కళ్ళు ఎర్రబడ్డాయి. చేతులు బిగుసుకున్నాయి. నినాదాలు ఊపందుకున్నాయి. వెనక బడిన తమ కొండల్లోకి మేయితీలకు గిరిజనులుగా గుర్తించమని నాలుగు వారాల్లో కేంద్రానికి రిపోర్ట్ పంపమని ఆర్డర్ పాస్ చేసిన దాన్ని నిరసిస్తూ ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ మణిపూర్ (ATSUM) పిలుపునిచ్చిన 'గిరిజన సంఘీభావ యాత్ర' సందర్భంగా అనేక కొండ జిల్లాల్లో నిరసన ర్యాలీ శాంతియుతంగా ముగియగా, చురచంద్ పూర్, మోయిరాంగ్, మోట్‌బంగ్ మరియు మోరేలో కాల్పులు, విధ్వంసం, ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత ఘర్షణలు చెలరేగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో మెయితీ కమ్యూనిటీ ఎక్కువగా నివసించే ఇంఫాల్, బిష్ణుపూర్ లోయ, కుకీ, నాగ తెగలు ఎక్కువగా నివసించే చుర్ చాంద్‌పూర్, కుంగ్పోక్పి జిల్లాలతో సహా అనేక ప్రాంతాల్లో అనేక గృహాలు ధ్వంస మయ్యాయి. 70మంది పైగా ప్రాణాలు పోగా, 9వేల ఇండ్లు ధ్వంసమయ్యాయి, 20వేల మంది నిరాశ్రయు లయ్యారు. ఇతర ప్రాంతాల్లో క్యాంప్‌లలోకి పంపబడ్డారు. మణిపూర్ చల్లని లోయల్లో, కొండల్లో రేగిన చిచ్చుకు కారకులెవ్వరు?

మణిపూర్ చుట్టూ కొండలతో తొంబై శాతం చుట్టబడి పదిశాతం లోయలతో ఉంటుంది. కుకీ, నాగ, జోమి లాంటి ప్రధాన తెగలలో పాటు 34రకాల తెగలు కొండ ప్రాంత జిల్లాల్లో నివసిస్తారు. లోయల్లో మెయిటీ తెగ వాళ్లు ఎక్కువగా ఉంటారు. మెయిటీ జాతి 53శాతం పది శాతం లోయ ప్రాంతంలో ఉంటుండగా, 40శాతం జనాభా ఉన్న కుకీ, నాగ, జోమి తెగలు తొంబై శాతం కొండ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ డెమోగ్రఫీ సహజం గానే కొంత తేడాని చూపిస్తుంది. కానీ ఇన్నేండ్లుగా జియోగ్రఫీ, డెమోగ్రఫీలో అంతరాలు ఉన్న కలిసే ఉన్న మేయితి, కుకీ, నాగ తెగలు ఇప్పుడు భగ్గుమని బరస్ట్ అవడానికి కారణం పాలకులు అంటించిన అగ్గే. 41శాతం హిందువులు, 41శాతం క్రిస్టియన్లు, 8శాతం మంది ముస్లింలు. మెయితీలు హిందువులు, ముస్లింలుగా ఉన్నారు. సనాతన మేయితీలు 8.5శాతం మంది ఉంటారు. మేయితీలు, సనాతన మహస్, ముస్లింలు వీళ్ళందరినీ మేయితీలే అంటారు. అధికారంలో వాళ్ళే ఎక్కువ, ముఖ్యమంత్రులు వాళ్ళే, ఎమ్మెల్యేలంతా వారే. రాజకీయ ప్రాబల్యం వారిదే. సామాజికంగా, సాంస్కృతికంగా వాళ్ళదే ఆధిక్యం. అయినా నేడు వారు ఎస్‌టి హోదా కోరుతున్నారు. మెయితీల డిమాండ్‌కి అనుకూలంగా హైకోర్టు స్పందించి పైగా వెంటనే కేంద్రానికి సిఫార్సు చేయమని ఏప్రిల్ 19న చెప్పింది. దీనితో కుకీ ఇతర తెగలు భగ్గుమని లేచాయి. హైకోర్టు తప్పుడు పద్ధతుల్లో వ్యవహరించిందని సుప్రీం కోర్టు చెప్పింది. ఎస్‌టి హోదాకు కొన్ని పద్ధతులుంటాయి. షెడ్యూల్ ప్రాంతం, వెనకబాటు ఉండాలి. వారి ఆచార సంప్రదాయాలు ఇవన్నీ పరిగణలోకి తీసుకుని రాష్ట్రపతికి గవర్నర్ సిఫార్సు చేయాలి. 342ప్రకారం నోటిఫై చేసి ఎస్‌టి హోదాను ఇచ్చే అవకాశం ఉంటది. ఇవేవీ అక్కడ జరగలేదు.

మొదటి బీసీ కమిషన్‌లో ఎస్‌టిలుగా చేర్చుకోవడానికి అవకాశం ఉండగా తాము ఉన్నత జాతీయులమని మెయితీలు ఎస్‌టీ గుర్తింపును



తిరస్కరించారు. గతంలో కాదన్నా గుర్తింపే ఇప్పుడు కావాలని కొన్ని వర్గాలు అడగటంలో ఏంటి అంతరార్థం? రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సక్రమంగా డీల్ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, అధికార బీజేపీ పార్టీ సభ్యులే పక్షపాత ధోరణితో మెయితీలను ఎగేసే యత్నం చేశారు. ఇది ఒక కుకీలకు అగ్గిలో ఆయిల్ పోసినట్లయింది. మరో వైపు ఆదివాసీల దీర్ఘకాలిక డిమాండ్లు ఉండనే ఉన్నాయి. ప్రభుత్వాలు అటవీ చట్టాల పేరుతో వారిని సొంత భూముల నుండీ తరమాలని చూస్తునే ఉన్నాయి. 2006 చట్టం వారికీ సాంత్వన కలిగిస్తది అనుకుంటే అది అమలే సరిగా జరగలేదు. 2017నుండి అధికారంలో బీజేపీ ప్రభుత్వం కుకీ తెగలను తీవ్రవాదులుగా చూస్తున్నది. కుకీలు, నాగలు క్రిస్టియన్‌లు కూడా. పైగా మేయితీలలో హిందువులు కాబట్టి వీరు లోయలో అధికులు, 60అసెంబ్లీ స్థానాలలో వీరి రాజకీయ ప్రాబల్యం ఉంటుంది. అందుకే వీరి మెప్పుకోసం ఎస్‌టీ డిమాండ్‌కి బీజేపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి డైరెక్ట్ సపోర్ట్ చేయడం ప్రారంబించింది. అంతే కాదు మేయితీల్లో చొరబడి హిందూ క్రైస్తవుల భేదాన్ని వాడుకొని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంది. ఇది కొండ ప్రాంత నాగ, కుకీలలో మరింత అపనమ్మకాన్ని పెంచింది. బీజేపీ తన రాజకీయ ప్రయోజనం కోసం ఏ రాష్ట్రంలో అయినా శత్రువులను ఎంపిక చేసుకుంటది. ముస్లింలు ప్రధాన శత్రువుగా చూపిస్తుంది. కానీ మణిపూర్‌లో మైనారిటీలు క్రిస్టియన్‌లు కాబట్టి కుకీ లను శత్రువులుగా చూపే ప్రయత్నం చేస్తుంది. అందుకే ప్రజల్లో విషబీజాలు నాటి పబ్బం గడుపుకునే ఈ వికృత బుద్ధి వల్లనే నేడు మణిపూర్ తగలబడుతోంది.

కొన్నేండ్ల క్రితం వరకు కుకీ, నాగ తెగలు తమ అస్తిత్వం, ప్రత్యేక లాండ్ కోసం ఉద్యమించాయి. దేశానికి స్వాతంత్ర్యం వరకు సొంత రాజ్యాలుగా కొనసాగిన మణిపూర్, 1949లో బలవంతంగా కలిపారనే అభిప్రాయం అక్కడి వాసుల్లో బలంగా ఉండేది. అంతకు ముందు 1865 అటవీ చట్టం రానంత వరకూ, 1872లో బ్రిటిష్ ఆక్రమణ కానంత వరకూ తమ కొండల్లో, లోయల్లో స్వేచ్ఛగా జీవించే వారు. వారి అటవీ చట్టాలు ముఖ్యంగా 1927 చట్టం వారిని సొంత భూమి నుండీ దూరం

> ప్రభుత్వాల అసమర్థత వల్ల దేశంలో రాష్ట్రాల్లో కొత్త ఉద్యోగాల కల్పన లేదు. దాదాపు ఎనభై శాతం అక్షరాస్యత కలిగిన మణిపూర్‌లో ఉద్యోగాల ఊసే లేదు. ఇదీ కూడా అసమ్మతికి అంతర్లీన ఆజ్యమే. వీటిని దారి మళ్లింపు కుట్రలో భాగమే రిజర్వేషన్లకై ఎగదోసే దొంగ తెలివి. ఇందులో బీజేపీ ఆరితేరినదే కదా! ఈ ట్రాప్‌లో మేయితీ లు పడ్డారు. ఇవన్నీ అంతర్భాగంగా ఉండగా "మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టు" ఎస్‌టీ హోదా ఇవ్వమని, నాలుగు వారాల్లో కేంద్రానికి నివేదిక ఇయ్యమని, హైకోర్టు చెప్పడంతో నిప్పు రాజుకుంది. నిప్పుని రాజేసింది, ఎగదోసింది కాషాయులేనన్నది తెలియని సత్యం.

చేసే కుట్ర సాగింది. స్వాతంత్ర్య అనంతరం ఇదే తంతు ఈ దేశంలో కలిపినంక కూడా కొనసాగింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక కొండ జిల్లాలోని అనేక ప్రాంతాలు రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లుగా, రక్షిత అడవులుగా ప్రకటించబడ్డాయి వందలాది మంది కుకీ గిరిజనులు వారి సాంప్రదాయ నివాస ప్రాంతం నుండి తొలగించబడ్డారు. బాధితులకు పునరావాసం కల్పించడంలో వైఫల్యం చెందారు. మార్చిలో, కాంగ్‌పోక్పి జిల్లాలోని థామస్ గ్రౌండ్‌లో హింసాత్మక ఘర్షణ జరిగింది. తర్వాత రాష్ట్ర మంత్రివర్గం రెండు కుకీ ఆధారిత తీవ్రవాద సంస్థలతో త్రైపాక్షిక సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (SoO) చర్చలను ఏకపక్షంగా ఉపసంహరించు కుంది. కొంత మంది వ్యాపారులు చేస్తున్న మాదక ద్రవ్యాలు, గసగసాల సాగుని గిరిజనుల మీదికి నెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. అంతేకాక ఇంఫాల్‌లోని గిరిజన కాలనీ ప్రాంతం లోని మూడు చర్చిలు ప్రభుత్వ భూమిలో "అక్రమ నిర్మాణాలు" అని ఏప్రిల్ 11న కూల్చివేసింది. ఇది కూడా గిరిజనుల్లో కోపానికి దారితీసింది.

అలాగే ఎప్పటినుంచో మయన్మార్ నుండి అక్రమ వలసలు జరుగుతున్నాయని అందుకే విద్యార్థి సంఘాలు రాష్ట్రంలో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటి జన్స్ (ఎన్‌ఆర్‌సీ) అమలు కోసం నిరసనలు చేస్తున్నాయి. అది పక్కకు పెట్టి కేంద్ర ప్రభుత్వం రెండు బిల్లులు 1.పౌరసత్వ సవరణ బిల్లు-2016, 2.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ బిల్లు-2019. పౌర సత్వం చట్టం ద్వారా 2014కి ముందు పొరుగున ఉన్న బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ నుండి ఇండియాలోకి ప్రవేశించిన ముస్లిం కాని మతాల వారికి పౌరసత్వం ఇవ్వడం. అంటే మరో మాటలో చెప్పాలంటే పక్కన పక్కన బంగ్లాదేశ్ నుండి, (బర్మానుండి బంగ్లా దేశ్ గుండా కూడా) వచ్చిన అన్ని వలసలని లీగలైజ్ చేయడం, తద్వారా అక్కడ ఒత్తిడి పెరిగి గొడవలు పెరగడం. ఇక రెండవ కారణం బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడం ద్వారా తేనేతుట్టెను కదిపినట్లే అయ్యింది. రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలూ వస్తాయనే ఆశ కలుగుతుంది. వాస్తవంగా అన్నీ మూసేస్తుంటే అమ్ముతుంటే కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయి? ప్రభుత్వాల అసమర్థత వల్ల దేశంలో రాష్ట్రాల్లో కొత్త ఉద్యోగాల కల్పన లేదు. దాదాపు ఎనభై శాతం అక్షరాస్యత కలిగిన మణిపూర్‌లో ఉద్యోగాల ఊసే లేదు. ఇదీ కూడా అసమ్మతికి అంతర్లీన ఆజ్యమే. వీటిని దారి మళ్లింపు కుట్రలో భాగమే రిజర్వేషన్లకై ఎగదోసే దొంగ తెలివి. ఇది బీజేపీ ఆరితేరినదే కదా! ఈ ట్రాప్‌లో మేయితీ లు పడ్డారు. ఇవన్నీ అంతర్భాగంగా ఉండగా "మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టు" ఎస్‌టీ హోదా ఇవ్వమని నాలుగు వారాల్లో కేంద్రానికి నివేదిక ఇయ్యమని హైకోర్టు చెప్పడంతో నిప్పు రాజుకుంది. నిప్పుని రాజేసింది, ఎగదోసింది కాషాయులేనన్నది తెలియని సత్యం. కొండలు తవ్వేందుకు, అక్రమ మైనింగ్ చేసేందుకు డైరెక్ట్‌గా రాలేక ఇండైరెక్ట్‌గా మెయితీ రిజర్వేషన్ సాకుతో కులం, మతం ఆయుధంతో కాషాయం ముందుకు వస్తుంది. పావులు గా మేయితీలని వాడుకుంటుంది. ఆ ఆయుధాలకు బలయ్యేది అంతిమంగా మణిపూరి వాసులే.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 2-6-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 152 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 16 పేజీలు + (టాబ్లాయిడ్12 పేజీలు) వెల : 6.50

గుండె జబ్బు పిల్లల కోసం నిధుల సేకరణ

- ఆటోక్రాస్ ఛాంపియన్ షిప్ నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడుతున్న పిల్లలకు సహాయం చేయడానికి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు కోసం నిధులను సేకరించడానికి, నగరంలో ఆటోక్రాస్ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ తొలిసారిగా ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ ఛాంపియన్‌షిప్‌ను తలపెట్టింది. ఆటోక్రాస్ అనేది ముందుగా నిర్ణయించిన ఒక గమ్యస్థానానికి చేరుకోవడానికి ఒక రకమైన రేసు. పాల్గొనేవారు ముందుగా నిర్ణయించిన అడ్డంకులను దాటి వీలైనంత వేగంగా దాన్ని పూర్తి చేయాలి. ఇది సమయానికి ఎదురొడ్డి పోటీపడే పోటీ, ఈ ఫార్మాట్‌తో డ్రైవర్ నైపుణ్యం, కారు నియంత్రణకు నిజమైన పరీక్ష ఉంటుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కోర్స్‌లోని కస్టమ్-బిల్ట్ రేస్ ట్రాక్‌లో ఇది జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా సిద్దిపేట పట్టణంలోని సత్యసాయి ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్సల కోసం ఆపరేషన్ థియేటర్ సదుపాయం ఏర్పాటుకు నిధులు సేకరించనున్నారు. జూన్ 2 నుంచి నాలుగు వరకు జరిగే ఈవెంట్ వివరాలను మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అనుపమ్ రాజ్, విష్ణు వివరించారు. మరిన్ని వివరాల కోసం 91 70931 92469 నెంబర్లో సంప్రదించవచ్చు.

నెలవారీ ప్రయాణికుల ఆదాయంలో రూ.500 కోట్ల మార్కును దాటిన దక్షిణ మధ్య రైల్వే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నెలవారీ ప్రయాణికుల విభాగంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్ల మార్కును దక్షిణ మధ్య రైల్వే దాటింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. సరుకు రవాణా విభాగంలో మే నెలలో 12,517 మిలియన్ టన్నుల అత్యధికంగా నమోదు చేసింది. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈ అత్యుత్తమ విజయానికి ఆపరేటింగ్, కమర్షియల్ టీంలను అభినందించారు.

రెండు కొత్త సూపర్ ఫాస్ట్ లైన్ల సర్వేకు రైల్వేబోర్డు అంగీకారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలిపింది. ఈ మేరకు రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది.ఆరు నెలల్లో సర్వే పూర్తిచేయాలని రైల్వేబోర్డు నిర్ణయించింది. విశాఖపట్నం-విజయవాడ-శంషాబాద్, విశాఖపట్నం-విజయవాడ-కర్నూలు మార్గంలో ఈ సర్వే చేపట్టనున్నారు. టెక్నికల్ ఫీజిబిలిటీని ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. ఈ మార్గాల్లో గంటకు గరిష్టంగా 220 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా సర్వే రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వే చేపట్టాలని రైల్వే బోర్డును పలుమార్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరిన సంగతి తెలిసిందే.

వీధి వ్యాపారులకు రుణాల జారీలో తెలంగాణ టాప్

- కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం వీధి వ్యాపారులకు రుణాలు అందించడం లో పెద్ద రాష్ట్రాల కేటగిరిలో అగ్రభాగాన నిలిచింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హిర్దీప్ సింగ్ గారి పూరి చేతుల మీదిగా తెలంగాణ ప్రభుత్వం తరుపున మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, మెప్మా ప్రాజెక్టు మేనేజర్ చైతన్య గారు అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులను కేంద్ర మంత్రి అభినందించారు. వీధి వ్యాపారు లకు రుణాలు ఇచ్చే పిఎంస్వాన్ నిధి ప్రారంభించి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందించారు. వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలపై స్టాంప్ డ్యూటీని మినహాయించిన దేశంలోనే మొదటి రాష్ట్రం తెలంగాణ.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, టి.జ్యోతి

- మహిళా రెజ్లర్స్‌కు మద్దతుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, టి.జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెజ్లర్లు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిరసన తెలిపారు. హైదరాబాద్ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో డిజి.నర్సింహారావు, జ్యోతి మాట్లాడారు. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. ఎంపీని కాపాడుకునే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం.. దేశానికి ఖ్యాతి తెచ్చిన మహిళా రెజ్లర్లతో అవమానకర రీతిలో వ్యవహరిస్తున్నదన్నారు.

వారి ఆందోళనను అణచి వేసేందుకు పూనుకుంటుందని, కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలిని నిరసించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపు నిచ్చారు. కె.నాగలక్ష్మి మాట్లాడుతూ .. 40 రోజులు గా ఢిల్లీ వీధుల్లో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందన్నారు. సాటి క్రీడాకారులందరూ సంఘీభావం తెలిపి మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎం.వెంకటేష్, కేఎన్ రాజన్న, జి.నరేష్, ఎన్.మారన్న, సి.మల్లేష్ ఆర్.వెంకటేష్, జి.కిరణ్, అశోక్, ఎం.అజయ్ బాబు, ఆర్.వాణి, జె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి నారాయణగూడ ఫ్లైఓవర్ వద్దన కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను పార్లమెంటు సభ్యత్వం నుంచి అనర్హుడిగా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు ఏఐటీయూసీ జాతీయ నాయకులు బి.వి.విజయలక్ష్మి, వి.యస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి నష్టం

- 11న కొత్తగూడెంలో ప్రజాగర్జన సభ
- పార్లమెంటు ఎన్నికల నాటికి లౌకిక పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. క్రమశిక్షణ, జనాభా నియంత్రణ, చదువులో పురోగతి, ఇతర అభ్యుదయ చర్యలుండడంతో తక్కువ సీట్లు పెరుగుతాయని వివరించారు. ఉత్తరాదిలో ఎక్కువ జనాభా కారణంగా ఎక్కువ లోక్‌సభ స్థానాలు పెరుగుతాయన్నారు. ఈ వివక్షతో అసంతృప్తి పెరిగి దక్షిణ భారతదేశం డిమాండ్ వచ్చే ప్రమాదముందన్నారు. సహేతుకమైన రీతిలో లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గురువారంహైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనివార్య పరిస్థితుల్లో 'సిపిఐ ప్రజాగర్జన' సభ తేదీని మార్చామని అన్నారు. ఈనెల నాలుగో తేదీకి బదులుగా 11న కొత్తగూడెంలో లక్ష మందితో సభను నిర్వహిస్తామని చెప్పారు. సింగరేణి యాజమాన్యం వైఖరితోనే తేదీని మార్చాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ పెద్దలు చెప్పినా మార్చాలంటూ ఒత్తిడి తెచ్చారని, ఇది అప్రజాస్వామికమని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా పార్లమెంటు ఎన్నికల నాటికి లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని కోరారు. జాతీయ స్థాయిలో నితీష్‌కుమార్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఉద్యమాలు చేస్తున్న వారితో సీఎం కేసీఆర్ మాట్లాడాలని సూచించారు. వారిని పిలిచి బాధలు విని వాటిని పరిష్కరించాలని కోరారు. పోడు పట్టాలిస్తామనడం మంచిదేనని, అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించి నట్టుగా 11 లక్షల ఎకరాలకు ఇస్తా మని చెప్పి ఇప్పుడు నాలుగు లక్షల పరిమితం చేయడం సరైంది కాద న్నారు. ఆర్టీసీ, సింగరేణిలో కార్మిక సంఘ ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం తెలంగాణ అవతరణ దినోత్స వాలను తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. రాజదండం ద్వారా దేశంలో రాచరిక, భూస్వామ్య వ్యవస్థను ప్రవేశ పెడతారా?అని ప్రధాని మోడీని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, టి శ్రీనివాసరావు, కలవేన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుకుల విద్యార్థులకు చెస్ టోర్నమెంట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గురుకుల విద్యార్థులకు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు చెస్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ గురుకులాల విద్యాసంస్థల కార్యదర్శి రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. వర్ధమాన చెస్ క్రీడాకారులకు తగిన వేదికను అందించడానికి, వారి రేటింగ్ మెరుగుపరచుకోవడానికి మరియు ఉత్తమ రేటింగ్ పొందిన ఆటగాళ్లతో ఆడే అవకాశాన్ని కల్పించడానికి ఈ టోర్నమెంట్‌ని నిర్వహిస్తున్నారు.ఈ టోర్నీ 3 రోజుల పాటు జరగనుంది. రోజూ 3 రౌండ్లు ఈ టోర్నమెంట్ 693 క్రీడాకారులు పాల్గొంటారు. ప్రైజ్ మనీగా మొత్తం రూ. 4,99,999 నగదు 113 నగదు పురస్కారాలు విజేతల కు 105 ట్రోఫీలు పంపిణీ చేయనున్నారు. ఈ టోర్నీలో మొత్తం 693 మంది పైబడిన క్రీడాకారులు పాల్గొననున్నారు.

రాష్ట్రం అప్పుల పాలు : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా సీఎం కేసీఆర్ మార్చారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. గురువారం గన్‌పార్క్ వద్ద అమర వీరుల స్థూపానికి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎంకు 10 ప్రశ్నలను సంధించారు. దశాబ్ది ఉత్సవాలు చేసే ముందు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్లుగా రాష్ట్ర ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు.రూ.4.5లక్షల కోట్ల అప్పులు చేసి ప్రతి ఒక్కరి నెత్తిపైనా లక్షన్నర అప్పు చేశారని తెలిపారు.

ఆవిర్భవిస్తున్న బహుళ ధ్రువ ప్రపంచం!

నెల్లూరు నరసింహారావు



అమెరికా ఆధిపత్యంలోని ఏకధ్రువ ప్రపంచాన్ని మార్చి మరింత సమతౌల్యంగల ప్రపంచం కోసం సోవియట్ పతనానంతరమే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఒకవైపు ఐక్యరాజ్య సమితి మౌలిక పాత్రను నిర్వహించేలా చేయటం, మరోవైపు ప్రధాన ప్రాబల్య రాజ్యాల సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయటంపై ఈ బహుళ ధ్రువ ప్రపంచ ఆవిర్భావం ఆధారపడింది. ఈ బహుళ ధ్రువత్వ భావన భారతదేశం, చైనాలను వంటి పెద్ద దేశాలను బాగా ఆకర్షించింది.

బహుళ ధ్రువ ప్రపంచ సాధ్యతను పశ్చిమ దేశాల నిష్ణాతులు కూడా కొట్టి పారేయలేదు. ఇది మెల్ల మెల్లగా భావి ప్రపంచ క్రమం(వరల్డ్ ఆర్డర్) ద్రుశ్యంగా ఆవిర్భవిస్తోంది. ఈ లోపు ప్రపంచ వాస్తవికత వేగంగా మారుతోంది. అంతర్జాతీయ సంబంధాలలోని వివిధ రంగాలలో వివిధ స్థాయిల్లో పరిస్థితులు మారుతున్నాయి. మనం చూస్తున్నది అసమ ప్రగతి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో సంభవిస్తున్న మార్పుల వేగంలో వున్న తేడాలవల్ల ఘర్షణలు, ప్రతిఘటనలు తలెత్తుతున్నాయి. కొంతవరకైనా ఈ పరిణామాన్ని అర్థం చేసుకోగలగాలంటే దీన్ని నియంత్రించే కారకాలను, దీని గతిశీలతను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంటుంది.

అంతర్జాతీ సంబంధాల అధ్యయనంలో ధ్రువత్వ భావన 1970వ దశకం చివరి నుంచి ఉంది. ఈ రంగంలో నయా వాస్తవిక వాదాన్ని ప్రవేశపెట్టిన అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త, కెన్నెత్ వాల్ట్జ్ సైద్ధాంతిక రచనలలో ధ్రువత్వ భావన ప్రాచుర్యం పొందింది. ఇదే భావన స్ట్రక్చరల్, సిస్టెమిక్ సిద్ధాంతంగా సోవియట్ యూనియన్ లో, ఆ తరువాత రష్యాలో అభివృద్ధి చెందింది. అంతర్జాతీయ యవనికపైన ప్రభుత్వాల చర్యలు పూర్తిగా తమతమ ప్రయోజనాలకు అనుగుణంగా కాకుండా వర్తమాన ప్రపంచ క్రమ నిర్మాణాన్నిబట్టి ఉంటాయని నయావాస్తవిక వాదులు వాదిస్తారు. అలా జాతీయ ప్రయోజనాల, వ్యూహాల స్వరూపాన్ని ఈ ప్రపంచ క్రమం నిర్ణయిస్తుంది. ప్రాబల్య రాజ్యాల మధ్య పలుకుబడి పంపకంగా ఈ ప్రపంచ క్రమాన్ని నిర్వచించవచ్చు. ఈ నిర్వచనం ఆధారంగా అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణాలను వర్గీకరించవచ్చు.

ఏక ధ్రువ ప్రపంచంలో ఒకే ఒక దేశం ప్రాబల్య రాజ్యంగా ఉంటుంది. ఇందుకు ఉదాహరణగా సోవియట్ యూనియన్ పతనం తరువాత 1990లో అమెరికా ఆధిపత్యం చెలాయించటాన్ని చూపవచ్చు. ద్విధ్రువ ప్రపంచంలో పోటీపడుతున్న రెండు బలమైన దేశాల వెనుక సాపేక్షంగా బలహీన దేశాలు ఉండటం జరుగుతుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, సోవియట్ యూనియన్లు ఈ స్థితిని ప్రతిబింబించాయి. మనం చేరుకోనున్న బహుళ ధ్రువ ప్రపంచంలో ప్రాబల్యం వివిధ ప్రధాన దేశాలలోను, కూటములోను నిక్షిప్తమై ఉంటుంది. బహుళత్వ నిర్మాణం అత్యంత వ్యూహాత్మక వైవిధ్యాన్ని అనుమతిస్తుం ది.


వర్తమాన ప్రపంచ క్రమంలో దేశాలకు సైనిక సామర్థ్యం ఒక్కటే ఆయుధం కాదు. ప్రపంచం సైనికంగా కొంతవరకు బహుళ ధ్రువంగా ఉన్న ప్పటికీ ఇతర రంగాలలో సామర్థ్యాలు భిన్నంగా ఉన్నాయి. గ్లోబల్ ఫైనాన్స్ లో చెల్లింపుల సాధనం గానూ, రిజర్వ్ కరెన్సీగాను అమెరికన్ డాలర్, అమెరి కన్ బ్యాంకులు ఆధిపత్య పాత్రను పోషిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా రష్యాపై విధించిన ఆర్థిక ఆంక్షలవల్ల సెటిల్ మెంట్ల సాధనాలు మారిపోతు న్నాయి. రష్యాపైన విధించిన ఆంక్షలు ప్రపంచ దేశాలను ముఖ్యంగా పశ్చిమ దేశాల పలుకుబడిలోలేని దేశాలను ఆలోచింపజేస్తున్నాయి. ఈ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను అమెరికా డాలర్‌కు దూరం జరుపుతున్నాయి. దీనిలో చైనా ప్రధాన పాత్రను పోషిస్తోంది.

అలాగే ప్రపంచ సాంకేతిక సామర్థ్యంపై పశ్చిమ దేశాల ఆధిపత్యం దాదాపు యధాతథంగా ఉంది. ఈ రంగంలో చైనా గణనీయమైన విజయాలు సాధించినప్పటికీ పశ్చిమ దేశాల లైసెన్సులు, సాంకేతికత, ముఖ్య విడిభాగాలు, ఉత్పత్తులు గ్లోబల్ సరఫరా చైన్లలో ఇంకా అంతర్భాగంగా ఉన్నాయి.

పోటీ విపరీతం గా వున్న రంగాలలో డిజిటల్ స్పేస్ కూడా ముఖ్య మైనదే. గ్లోబల్ డిజిటల్ సర్వీస్ నెట్ వర్క్స్ మీద పశ్చిమ దేశాల పట్టు ఇంకా చాలా బలంగా ఉంది. ఈ విషయంలో చైనా చాలా ముందే మేల్కొని తన స్వంత డిజిటల్ ఇకో సిస్టమ్ ను అభివృద్ధి చేసు కుంది. ప్రస్తుతం చైనా, రష్యాలు మూడవ ప్రపంచ దేశాలకు "డిజిటల్ సార్వభౌమత్వాన్ని" అందించే సాంకేతికతను సరఫరా చేస్తున్నాయి.

ఇలా వివిధ అవాంతరాల మధ్య వర్తమాన ప్రపంచ క్రమం ఏక ధ్రువత్వం నుంచి బహుళ ధ్రువత్వంవైపు పయనిస్తోంది.

ఉక్రెయిన్ యుద్ధాన్ని నాటో-రష్యా యుద్ధంగా మార్చే కుట్ర



మంగళవారం నాడు మాస్కోపైన రెండవ సారి ఉక్రెయిన్ డ్రోన్ తో దాడి చేసింది. ఉక్రెయిన్ ప్రయోగించిన ఎనిమిది డ్రోన్లలో ఒకటి జనావాసాలపైన పడింది. గతవారంలో జరిగిన జి-7 దేశాల సమావేశంలో అమెరికా ఎఫ్-16 రకం యుద్ధ విమానాలను ఉక్రెయిన్ కు సరఫరా చెయ్యటానికి సంసిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. రష్యా భూభాగంలోకి యుద్ధాన్ని చొప్పించాలని సామ్రాజ్యవాద దేశాలు నిర్ణయించాయని దీనినిబట్టి అర్థం అవుతోంది.

ఈ దాడులతో యుద్ధం తీవ్రతను పెంచి నాటో దళాలను ప్రత్యక్షంగా ప్రవేశపెట్టాలనే ఆలోచనతో అమెరికా, దాని మిత్రదేశాలు ఉన్నాయి. అమెరికా ఆమోదంలేకుండా రష్యా రాజధానిపైన ఉక్రెయిన్ దాడి చేయటం అనూహ్యం. రష్యాపైన దాడులు చేయమని అమెరికాతోపాటు దాని మిత్రదేశాలు గతంలోనే ప్రోత్సహించాయని లండన్ టైమ్స్ డిసెంబరులోనే రిపోర్ట్ చేసింది.

బాఖ్ ముత్ పతనం తరువాత ఉక్రెయిన్ డీలాపడి రష్యాపై తాను చేయదలచిన ప్రతిదాడిని మొదలుపెట్టటంలో ఉక్రెయిన్ విఫలమైంది. ఈ ఓటమిని అమెరికా ఎలా జీర్ణించుకుంటుందనే ప్రశ్న ఆసక్తికరంగా మారింది. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా, నాటో దళాల జోక్యంలేకుండా రష్యా ఆధీనంలోవున్న ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవటం దుర్లభమని అమెరికా జాయింట్ ఛీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ మార్క్ మిల్లే జనవరిలో చెప్పాడు. రష్యాతో ప్రత్యక్షంగా తలపడాలంటే నాటో తయారు కావలసిన అవసరం ఉంటుందని చెక్ సైనిక దళాల అధిపతి కరేల్ రేకా అన్నాడు.

రష్యాను ఓడించటంలో అణుయుద్ధ ప్రమాదంవున్నా ప్రయత్నించక తప్పదని అమెరికా మీడియా సమర్థిస్తోంది. ఎంతగా రెచ్చగొట్టినా పుతిన్ రెచ్చిపోకపోవటంతో అమెరికా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తోంది. ఇటువంటి చర్య మానవాళి వినాశనానికి దారితీస్తుందనే హెచ్చరికలను అమెరికా పెడచెవిన పెడుతోంది. అమెరికా, నాటో దేశాలు రష్యాపైన ఉక్రెయిన్ ను ఎగదోస్తున్నాయి. ఇలా ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధానికి తీవ్ర పర్యవసానాలు ఉంటాయి. ఈ యుద్ధం ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం అంచున నిలబెడుతోంది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- సీఎం కేసీఆర్‌కు సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు, ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం ప్రకటనల కోసం రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్‌ను వర్తింపచేయాలని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీని వేయాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 20 శాతం ప్రకటించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు : రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'తెలంగాణ యువత, విద్యార్థుల త్యాగాల ఫలితం. అమ్మ సోనియమ్మ కరుణతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యం అయింది' అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షల ను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సోనియమ్మకే దక్కిందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరపాలని, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 2-6-2023 | సంపుటి : 9 | సంచిక : 152 | 16 పేజీలు + (టాబ్లాయిడ్ 12 పేజీలు) | వెల : 6.50

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



'కూలిబంధు' ప్రవేశపెట్టాలి

- మధ్యతరగతి వరకే రైతుబంధు అమలు చేయాలి
- సామాజిక, ఆర్థిక అసమానతలను పోగొట్టాలి
- వృత్తులను ఆధునీకరించే ప్రణాళిక రూపొందించాలి
- అన్ని జిల్లాల్లోని ప్రాజెక్టులపై దృష్టిసారించాలి
- నిరుద్యోగుల్లో అసంతృప్తిపై కేంద్రీకరించాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక ధోరణులను విడనాడాలి
- హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ
- తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

అన్ని రంగాల్లో...తెలంగాణ

అభివృద్ధి కావాలి

తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామి కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆకాంక్షించారు. రైతుబంధు తరహాలో వ్యవసాయ కార్మికులు, సెంటు భూమి లేని వారికి 'కూలిబంధు'ను ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధును వందల ఎకరాలున్న భూస్వాములకు ఇవ్వకుండా పరిమితి విధించాలని కోరారు. మధ్యతరగతి రైతుల వరకే రైతుబంధును అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అసమానతలను పోగొట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వృత్తులను ఆధునీకరించే ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. కాళేశ్వరంతోపాటు అన్ని జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రీకరించాలని, నిధులు కేటాయించి వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక ధోరణులను విడనాడాలని, రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు, పౌరసమాజంతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అయితే హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు తమ్మినేని ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రగతిపై ఏమంటారు?

ఈ తొమ్మిదేండ్లలో కొన్ని అంశాల్లో తెలంగాణ మంచి అభివృద్ధి సాధించింది. కొన్ని సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే ముందున్నది. అందుకు మనం సంతోషపడాలి. తలసరి ఆదాయం, జీఎస్‌డీపీలో ముందున్నందుకు గర్వపడాలి. తెలంగాణలో హైదరాబాద్ ఉండడం, పారిశ్రామిక సంస్థలుండడంతో ఆదాయం ఎక్కువగా ఉంటున్నది. మనకున్న ఈ వనరులతో మరింత అభివృద్ధి సాధించే అవకాశమున్నది. గత ప్రభుత్వాలతో పోల్చితే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అభినందించాలి. అభివృద్ధి అనేది ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి. కుటుంబాల స్థాయిలో అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవాలి. ఆర్థికం, ఆరోగ్యం, విద్యాస్థాయి, సామాజిక, సాంఘిక హోదా మెరుగుపడినప్పుడే ఆ కుటుంబాలు నిజంగా అభివృద్ధి చెందినట్టు అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. విద్యావైద్యంలో వెనుకబాటును అధిగమించాలి. సాంస్కృతిక జీవనంలోనూ అభివృద్ధి కావాల్సి ఉన్నది. రాష్ట్రంలో నేటికీ మూఢ విశ్వాసాలు, ఫ్యూడల్ సంస్కృతి కొనసాగుతున్నది.

తెలంగాణలో సామాజిక తరగతుల స్థితిగతులపై ఏమంటారు?

కొన్ని పథకాల్లో ఉన్న అహేతుకతను సరిచేయాలి. భూములున్న వారికి రైతుబంధు అమలవుతున్నది. పెట్టుబడి సాయం అందించడం పట్ల మాకు అభ్యంతరం లేదు. దానికి పరిమితిని విధించాలి. వందలకొద్దీ ఎకరాలున్న భూస్వాములకు రూ.లక్షలు ఇవ్వడం సరైంది కాదు. మధ్యతరగతి రైతుల వరకు పరిమితం చేయాలి. ఆ వనరులు ఇతరులకు ఉపయోగించడానికి వీలవుతుంది. భూమి ఉన్న వారికి రైతుబంధు ఉన్నది. మరి భూమి లేకుండా రెక్కల కష్టం మీద ఆధారపడే వ్యవసాయ కార్మికులకు సాయమేదీ?. రెండెకరాలున్న రైతు చనిపోతే రూ.ఐదు లక్షల రైతు బీమా వస్తున్నది. సెంటు భూమి లేని వారు చనిపోతే ఏమీ రావడం లేదు. ఇది అన్యాయం. అందుకే రైతుబంధు తరహాలో 'కూలిబంధు' ప్రవేశపెట్టాలి. దళితబంధు తరహాలో బీసీ బంధు పెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఆర్థిక సాయానికి ఆర్థిక స్థితిగతులు ప్రాతిపదికగా ఉండాలి. సామాజిక వెనుకబాటు తనానికి సామాజిక ప్రాతిపదిక ఉండాలి. ఎస్సీలు అంటరానితనం, ఊరికి దూరంగా ఉండడం, వెలివేత వంటి వివక్షను ఎదుర్కొంటున్నారు. దీన్ని నివారించాలి. సామాజిక అసమానతలను, ఆర్థిక అసమానతలను తొలగించే పనిచేయాలి. తెలంగాణ ఏర్పాటు కావడంలో నీటి వనరులకు సంబంధించి ఆంధ్రాకు ఎక్కువ ప్రాజెక్టులు వెళ్లాయన్న చర్చ జరిగింది. ఇప్పుడు తెలంగాణలోనూ కొన్ని జిల్లాలకే నీళ్లు వెళ్లే ప్రాజెక్టులు చేపట్టడం, నిధులు కేటాయించడం సరైంది కాదు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు కొన్ని జిల్లాలకే వెళ్తాయి. ప్రభుత్వం దానిపై కేంద్రీకరించింది. ఉమ్మడి ఖమ్మంకు సీతారామ ప్రాజెక్టు, ఉమ్మడి వరంగల్‌కు దేవాదుల ప్రాజెక్టు, ఉమ్మడి నల్లగొండకు డిండి ప్రాజెక్టు, ఎలిమినేటి మాధవరెడ్డి కెనాల్, ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు కల్వకుర్తి ఎత్తిపోతల, ఉమ్మడి రంగారెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. అది జరిగితే తెలంగాణ అభివృద్ధి మరింత సాకారమవుతుంది.

మతోన్మాదం వలలో ప్రజలు పడొద్దు

రాష్ట్రంలో నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతున్నది. దానిపై ఏమంటారు?

నిరుద్యోగ యువతకు ఆశించిన మేరకు ఉద్యోగాలు కల్పించలేదు. దీంతో నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతున్నది. దీన్ని ప్రభుత్వం పరిష్కరించాలి. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించడం లేదు. దీన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ బీసీలకు రూ.లక్ష సాయం అందిస్తున్నారు. బీసీ వృత్తుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి. కల్లు గీత కార్మికుల నీరాను అభివృద్ధి చేయాలి. గొర్రెలకు రుణాలు ఇవ్వడం వరకే పరిమితం కాకుండా మాంసాన్ని ఎగుమతి చేసే సౌకర్యాలను కల్పించాలి. వృత్తులను ఆధునీకరించడం కోసం ప్రణాళిక రూపొందించాలి. చేపల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. ట్యాంకులు, షెడ్డుల్లో రీసైక్లింగ్ ఆక్వా కల్చర్‌ను ...9లో

స్పీడు పెంచిన సారు

అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సీఎం కార్యాచరణ...

- క్రమబద్ధీకరణలు..పలువురికి పదవులు
- పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలంటూ ఆదేశాలు
- ఎలక్షన్లే టార్గెట్‌గా 21 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు

వివరాలు 10లో..

ప్రతి రోజూ సచివాలయానికి

సమీక్షల మీద సమీక్షలు



అన్ని రంగాల్లో తెలంగాణది తనదైన ముద్ర



బీజేపీ, కాంగ్రెస్ సీఎం అభ్యర్థులెవరు?

- ఒఆర్ఆర్‌పై ఆధారాలుంటే బయటపెట్టాలి : మంత్రి కేటీఆర్ 8లో..

నేటి నుంచి మూడు వారాలపాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

సచివాలయంలో పతాకావిష్కరణ చేయనున్న సీఎం



9లో..

ఆర్టీసీ కార్మికులకు తీపికబురు

4.9 శాతం డీఏను ప్రకటించిన యాజమాన్యం

- జూన్ వేతనంతో కలిపి డీఏ అందజేత
- ప్రకటించిన ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్‌డీ సజ్జనార్

వివరాలు 9లో..

టెన్త్ పుస్తకం నుంచి ప్రజాస్వామ్యం మాయం

ఆవర్తన పట్టిక, ఇంధన వనరుల చాప్టర్లు కూడా...



వివరాలు 9లో..

సచివాలయ అలంకరణను పరిశీలించిన సీఎస్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న డాక్టర్ .బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, రకరకాల పూలతో పూర్తిగా ఉత్సవ వాతావరణం కలిగేలా అలంకరించారు.

ఇప్పటికే, తెల్లటి ధవళ కాంతితో వెలిగి పోతున్న సచివాలయ భవనం ఈ సరికొత్త అలంకరణలతో మరింత ఆకర్షణీయంగా మారింది. కాగా, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను నేడు సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పరిశీలించారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 9 నుంచి గొర్రెల పంపిణీ ప్రారంభం : మంత్రి తలసాని

ఈనెల 9 నుంచి గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని నకిరేకల్ నియోజకవర్గంలో ప్రారంభించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. గొర్రెల పంపిణీ, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్, దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమీక్షించారు. గొర్రెల అభివృద్ధి పథకం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాల బ్రోచర్లను స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధార్ సిన్హాతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. 8వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. గొర్రెల యూనిట్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

గీతం అధ్యాపకులు..ఐవీ సుబ్బారెడ్డికి.. 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' అవార్డు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్, ఫిజిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఐ.వీ.సుబ్బారెడ్డికి 'ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ (జీవితకాల సాఫల్య) అవార్డు వచ్చింది. బెంగళూరులోని సామాజిక, ఆర్థికాభివృద్ధి జాతీయ విద్యా సంస్థ ఇటీవల ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ఇచ్చి సత్కరించినట్టు గీతం వర్గాలు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. దేశాభివృద్ధి, బోధన, పరిశోధన, పత్ర సమర్పణలో డాక్టర్ ఐవీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇచ్చినట్టు తెలిపారు. అడ్వాన్స్ సెంటర్ ఫర్ అట్మాస్పియరిక్ సైన్స్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ నుంచి సీనియర్ రీసెర్చ్ ఫెలోతో పాటు సీఎస్ఐఆర్ నుంచి యంగ్ అండ్ డైనమిక్ రీసెర్చ్ స్కాలర్‌గా డాక్టర్ రెడ్డి ఇంతకు మునుపు గుర్తింపు పొందినట్టు తెలిపారు. జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ సుబ్బారెడ్డిని స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేష్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.విశ్వం, తదితరులు ఆయన్ను అభినందించారు.

ఏపీ అక్రమాలను నిరోధించాలి

- సమస్యలు పరిష్కరించండి
- కేఆర్ఎంబీకి సర్కారు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని సాగునీటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వం కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి లేఖ రాసింది. ఈమేరకు గురువారం రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ప్రత్యేకంగా లేఖ రాశారు. ప్రధానంగా మూడు అంశాలను అందులో ప్రస్తావించారు. కేఆర్ఎంబీలో చేసిన నిర్ణయాలు, తీర్మానాలకు విరుద్ధంగా సాగునీటి వ్యవహారాలు జరుగుతున్నాయని బోర్డు దృష్టికి తెచ్చారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ప్రభుత్వం చెబుతున్నట్టుగా 50:50 నిష్పత్తిలో కృష్ణాజలాలను పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ చైర్మెన్‌ను కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ప్రాజెక్టులను నిర్మిస్తున్నదని చెప్పారు. పలుమార్లు ఆ ప్రభుత్వానికి, కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని లేఖలో పేర్కొన్నారు. కేఆర్ఎంబీ దృష్టికి కూడా అనేకమార్లు తెచ్చామని వివరించారు. ఇకపోతే 2022-23 నీటి సంవత్సరంలో ఏపీ అదనంగా నీటి వినియోగం చేపట్టిందని అన్నారు. ఈ చర్య తెలంగాణ ప్రయోజ నాలకు తీవ్ర నష్టం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ మూడు అంశాలపై కేఆర్ఎంబీ దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- భార్య, భర్త, కుమారుడు మృతి
- మరో కుమారుడికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-కొణిజర్ల

రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. ఈ ఘటనలో భార్య, భర్తతో పాటు కుమారుడు మృతిచెందారు. మరో కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వైరా మండలం విప్పలమడక గ్రామానికి చెందిన పారుపల్లి రాజేష్ (38), సుజాత (34) దంపతులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. కాగా, ఆ కుటుంబమంతా తమ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కొణిజర్ల వద్ద వారి కారు ముందు వెళ్తున్న లారీ ముందు మరో వాహనం మరమ్మతులకు గురై ఆగి ఉండటంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో రాజేష్ కూడా తన కారు వేగం తగ్గించి లారీ వెనక ఆపాడు. అది గమనించని రాజేష్ కారు వెనుక వస్తున్న మరో లారీ డ్రైవర్ వేగంగా వచ్చి కారును ఢీ కొట్టడంతో రెండు లారీల మధ్య కారు నుజ్జు నుజ్జు అయింది. నలుగురూ కారులో ఇరుక్కున్నారు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే రాజేష్, సుజాతలతో పాటు కుమారుడు అశ్విత్ (8) మరణించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ రెహమాన్, సీఐ, ఎస్ఐ, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని కారులో ఇరుక్కున్న మృతదేహాలను ప్రొక్లె యిన్ సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ముగ్గురి మృతదేహాలను చూసి వైరా ఎమ్మెల్యే రాములునాయక్ కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అన్ని రంగాల్లో తెలంగాణది తనదైన ముద్ర

బీజేపీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థులెవరు?

- ఒఆర్ఆర్‌పై ఆధారాలుంటే బయటపెట్టాలి : మీడియాతో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లలో అన్ని రంగాల్లో తెలంగాణ తనదైన ముద్ర వేయగలిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. దమ్ముంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ముఖ్యమంత్రి అభ్యర్థులెవరో ప్రకటించాలని సవాల్ చేశారు. ఓఆర్ఆర్‌పై ఆధారాలుంటే బయపెట్టాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలన్న స్ఫూర్తికి అనుగుణంగా తెలంగాణ గత పదేండ్లుగా పని చేస్తూ సమగ్ర, సమతుల్య, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధిని సాధించిందని తెలిపారు. వైద్య రంగంలో నూతన వైద్యశాలలో మెడికల్ కాలేజీలతో సమగ్రమైన మార్పు, నూతన పాఠశాలలో, గురుకులాల ఏర్పాటు, మన ఉరు మన బడి వంటి కార్యక్రమాల ద్వారా విద్యారంగంలో గుణాత్మకమైన మార్పు సాధ్యమైందని చెప్పారు. గ్రామీణ, పట్టణ, అగ్రకులాలు, అణగారిన వర్గాలు అనే ఎలాంటి భేదం లేకుండా సమ్మిళిత అభివృద్ధి జరుగుతున్నదన్నారు. పరిపాలన సంస్కరణలు దేశంలో ఎక్కడా లేనంతగా ముందుకెళ్తున్నాయని తెలిపారు.

"తెలంగాణ అచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది..' అన్నది ఈ రోజు నినాదంగా మారింది. ప్రతిపక్షాలకు పని లేకుండా పోయింది. ఈ రోజు తెలంగాణకు ప్రాబ్లమ్ అఫ్ ప్లెంటీ మొదలైంది. ఒకప్పుడు పంటలు పండని చోట నేడు ధాన్యం ఎక్కువైన పరిస్థితి నెలకొంది. దశాబ్దం పూర్తయిన సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా .... చేతిలో ఉన్న రూపాయిని పారేసి చిల్లర ఏరుకోవద్దు. తెలంగాణ కాదని చిల్లర రాజకీయాలు చేసే నాయకులను ప్రజలు పట్టించుకోరన్న విశ్వాసం ఉన్నది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పాలన తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పరిపాలనను బేరీజు వేసుకోండి. ఎలాంటి పరిమితులు లేకుండా పండించిన పూర్తి ధాన్యాన్ని కొంటున్న రాష్ట్రం దేశంలో ఇంకొకటి ఎక్కడైనా ఉన్నదా? దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ కన్నా ఉత్తమ పరిపాలన తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అందిస్తున్నామని చెప్పాలి. తెలంగాణ కన్నా మంచి మాడల్ చూపించాలి. ఈ రెండు పార్టీలు 75 సంవత్సరాలు చేయని పనిని, కేవలం 9 సంవత్సరాల్లో చేసి చూపిస్తున్నాం. ఆ రెండు పార్టీల పరిపాలన కొత్త సీసాలో పాత సారా మాదిరి ఉంటుంది... " అని కేటీఆర్ విమర్శించారు.

కేంద్రమంత్రులు టాయిలెట్స్, రైల్వే స్టేషన్లలోని లిఫ్ట్‌లు ఓపెన్ చేస్తున్నారు. మేము ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టులు కడుతున్నాం. ఎంఐఎం యంపీ అసదుద్దీన్ తెలంగాణ రాష్ట్రం మైనార్టీలకు చేసిన కార్యక్రమాల గురించి ఇతర రాష్ట్రాల్లో గొప్పగా చెప్పిన విషయం మర్చిపోవద్దు ఇక్కడ మాట్లాడింది నిజమా? అక్కడ మాట్లాడింది నిజమా ? అయన తేల్చుకోవాలి. ఎన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది అ పార్టీ ఇష్టం. ప్రజలు మత ప్రాతిపదికనే ఓట్లు వేస్తారని నేను నమ్మను. ఎంఐఎం, కాంగ్రెస్ మాత్రమే మైనార్టీలు ఓట్లు వేస్తారన్నది కాకుండా ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎంచుకుంటారని నమ్ముతున్నాను. రాష్ట్రంలో బీజేపీలేనే లేదు. సోషల్ మీడియాలో మాత్రమే అప్పుడప్పుడు హంగామా చేస్తున్నారు ఆ పార్టీ నాయకులు. సౌత్ ఇండియా వర్సెస్ నార్త్ ఇండియా అనేది నా వాదన కాదు. జనాభా నియంత్రణ చేపట్టిన రాష్ట్రాలు నష్టపోకూడదన్నదే నా వాదన. ప్రజాస్వామ్యంలో అన్ని రాష్ట్రాలకు సమానమైన అవకాశాలు ఉండాలి ఒక్క ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రంలో పెరిగే సీట్లు మొత్తం దక్షిణాది రాష్ట్రాల సీట్ల కన్నా ఎక్కువగా ఉండనున్నాయి. దేశ ప్రగతికి మద్దతు ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకూడదు. అలాంటి పరిస్థితి వస్తే ఎవరూ సహించరు. ఇప్పటినుంచే లోక్‌సభ స్థానాలు పెంపుపైన ఆరోగ్యవంతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉన్నదని"....కేటీఆర్ తెలిపారు.

'ఉచితాలు అనుచితమంటూ, మేం పన్నుల చెల్లిస్తున్నామంటూ మాట్లాడుతున్న కొంతమంది, దేశంలో ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పన్నులు చెల్లిస్తున్నారని గుర్తుంచుకోవాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాతో పోటీ పడే పరిస్థితి లేదు. మీ దగ్గరలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ కన్నా మంచి పరిపాలన ఉంటే చూపించాలి. అధికారంలోకి వస్తామంటు కాంగ్రెస్ పార్టీ భ్రమల్లో ఉంటే అది వారి ఇష్టం. రాష్ట్రంలో షర్మిల, కేఏ పాల్ లాంటి వాళ్ళు కూడా అధికారంలోకి వస్తామని చెప్తున్నారు.భారత రాష్ట్ర సమితి తిరిగి అధికారంలోకి వస్తుంది. 90 నుంచి 100 స్థానాల్లో సులభంగా గెలుస్తుంది. మరోసారి మా నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేవలం ఒక పార్టీని అధికారంలోకి దించాలన్న ఆలోచన విధానానికి బీఆర్ఎస్ వ్యతిరేకం. దానికి బదులు రాష్ట్రంలో జరుగుతున్న మంచి విధానాలను ఇతర రాష్ట్రాలలో అమలు చేయాలన్నదే మా లక్ష్యం... ' అని మంత్రి స్పష్టం చేశారు.

"దేశంలో కేవలం కాంగ్రెస్, బీజేపీ మాత్రమే ఉన్నాయన్న ప్రచారం, ఆలోచన సరికాదు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల వల్లనే బీజేపీ అధికారంలోకి వచ్చింది. రాహుల్ గాంధీ ఒక పార్టీ కాకుండా ఎన్జీవో లేదా దుకాణాన్ని నడపాలి. గుజరాత్‌లో ఎన్నికలు జరిగితే పారిపోయిన రాహుల్ గాంధీ గురించి అందరికీ తెలుసు. దేశంలో అత్యుత్తమ ప్రధాన మంత్రుల్లో పీవీ నరసింహారావు ఉంటారు. అయితే ఆయనకు ఢిల్లీలో సమాధి కట్టకుండా అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. కర్నాటక, మహారాష్ట్రలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పోటీ చేసే హక్కు మా పార్టీకుంది. ఆ దిశగా ఆలోచిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోనూ మా పార్టీ పని ప్రారంభించింది. రాష్ట్ర పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించుకున్నాం... " అని కేటీఆర్ తెలిపారు.

'మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. ధరల పెరుగుదల నుంచి మొదలుకొని అన్ని రంగాల్లో విఫలమైన మోడీ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉన్నది. దమ్ముంటే బీజేపీ దేశానికి చేసిన మంచి పనుల గురించి ప్రజల్లో చర్చ పెట్టండి. మంచి ప్రదర్శన ఉన్న ఎమ్మెల్యేలు అందరికీ ఎమ్మెల్యే సీట్లు దక్కుతాయి. వెనుకబడిన ఎమ్మెల్యేలు తమ ప్రదర్శన మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఇంకా ఆరు నెలల సమయం ఉంది. కాబట్టి ఇప్పుడే ఈ విషయంలో ఏం చెప్పలేం. రాష్ట్రంలో ప్రతిపక్షాలు లేని నిరుద్యోగం గురించి ఇక్కడా మార్చులు చేస్తుంటే తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాల కోసం విదేశీ పర్యటనలు చేసి ఉద్యోగాలు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాము. తాజా పర్యటనలో 42 వేల ఉద్యోగ ఉపాధి అవకాశాలు తెలంగాణకు తీసుకురాగలిగాము. సచివాలయ నిర్మాణం, వ్యాక్సిన్ల తయారీ లాంటి అంశాల నుంచి మొదలుకొని అన్నింట్లో లేని కోట్ల కుంభకోణం అంటూ ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారింది. ఔటర్ రింగ్ రోడ్ టెండర్ ప్రక్రియ, జాతీయ రహదారుల టెండర్ ప్రక్రియ మాదిరే జరిగింది. ఇప్పటికే మున్సిపల్ శాఖ ఎలాంటి విచారణకైనా సిద్ధం అని ప్రకటించింది. లీగల్ నోటీసులకు సమాధానం చెప్పండి. ఈ విషయంలో ప్రతిపక్షాల వద్ద రుజువులు ఉంటే కోర్టుకి సమర్పించండి, ప్రజల ముందు పెట్టండి. చిల్లర మాటలు చిల్లర ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలు ఇప్పటికైనా మానుకోవాలి. నోట్లు రద్దుతో ఏం సాధించారు? ఇప్పటిదాకా మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పలేదు. ఇప్పుడు 2000 నోట్ల మార్పిడితో సాధించేది ఏంటో కూడా ప్రజలకు చెప్పడం లేదు.... " అని మంత్రి కేటీఆర్ విమర్శించారు.

మళ్లీ పెరిగిన ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రెండు రోజులుగా చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కింది. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటాయి. ఈ వారంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో అత్యధికంగా 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశముంది.

జీవో 111 పరిరక్షణకు ఉద్యమిద్దాం

- ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడాలి: ఎంపీ ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి

నవ తెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 111 పరిరక్షణకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడి న్యాయపోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లోని విద్యానగర్ బీసీ భవన్‌లో 111 జీవో పరిరక్షణకోసం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సాయిబాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 111 జీవో పరిరక్షణ ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నోరువిప్పటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. జీవో 111 పై బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతిపై ప్రధానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రూ. 2 లక్షల కోట్ల అవినీతి జరిగే అవకాశం ఉందనీ, సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెరువులను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి మాట్లాడుతూ. జీవో111 ద్వారా హైదరాబాద్ సురక్షితంగా ఉందని గుర్తుచేశారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు కేసీఆర్ ప్రభుత్వం జీవో ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకోవటం దుర్మార్గమని విమర్శించారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమేంటని ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయలు దోపిడి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వాధినేతలు, మంత్రులు ఐటీఐ పరిధిలో సొంత ఇండ్లు, ఫాం హౌస్‌లు కట్టుకొని వరదలు వస్తే అధికారులను బెదిరించి తూములు వదులుతున్నారని గుర్తుచేశారు. ఈ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఒరిగిందేమీ?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షను విడనాడాలి
- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి : సీఎం కేసీఆర్‌కు ఎస్‌సీకేఎస్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ వేతనాలను కోల్పోయి మరీ తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న 25 వేల మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వంగానీ, సింగరేణి యాజమాన్యంగానీ చేసిందేమీ లేదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు పేర్కొన్నారు. జేబీసీసీఐలో చేసిన నిర్ణయాలను సింగరేణిలో అమలు చేయించడంలో కేంద్ర ప్రభుత్వం, బొగ్గుమంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

సింగరేణికి లాభాలు గడించిపెట్టడంలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష తగదన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పర్మినెంట్ కార్మికులకు స్వీట్లు పంచుతున్న సింగరేణి యాజమాన్యానికి కాంట్రాక్టు కార్మికులు పట్టరా? అని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా సీఎం కేసీఆర్ కాంట్రాక్టు కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై జోక్యం చేసుకోవాలనీ, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు బి.మధు బహిరంగ లేఖ రాశారు. అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా వేతనాలు చెల్లించడం ద్వారా సింగరేణికి నెలకు రూ.50 లక్షలు ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోల్ఇండియా నిర్ణయించిన వేతనాన్నయినా, జీవో 22ని అయినా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో చెల్లించిన విధంగా రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సింగరేణిలో లాభాల వాటా లేదా చట్ట ప్రకారం 20 శాతం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 26-09-2022న సింగరేణి యాజమాన్యం చేసిన ఒప్పందంలోని అన్ని అంశాలను అమలు చేయాలని కోరారు. సింగరేణి హాస్పిటల్స్‌లో కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలనీ, లేదంటే ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఖాళీ క్వార్టర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని కోరారు. కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు.

హామీల అమలు కోసం కేంద్ర సర్కారుపై ఐక్య పోరాటాలు

- ఏఐకేఎస్ కేంద్ర కమిటీ నిర్ణయం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు కోసం ఐక్య పోరాటాలు నిర్వహించాలని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) నిర్ణయించింది. ఈమేరకు గురువారం తమిళనాడు (కాంచీపురం)లో గురువారం ప్రారంభమైన ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సమావేశం తీర్మానించింది. కనీస మద్దతు ధరల చట్టం చేస్తాననీ, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరిస్తామనీ, రైతులపై అక్రమంగా మోపిన కేసులను ఎత్తివేస్తామనీ, పంటల బీమా పథకాన్ని సవరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తు చేసింది. హామీలను పక్కన పెట్టి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. పంటల కొనుగోలు బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకుంటున్నదని విమర్శించింది. కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయడానికి సిద్ధంగా లేదని ఈ సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. ప్రజాపోరాటాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నదని విమర్శించారు. రెజ్లర్ల డిమాండ్ పరిష్కరించకపోగా ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లపై దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. కేంద్ర కమిటీ సమావేశానికి హన్నన్ మొల్ల అధ్యక్షత వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ భవిష్యత్తు కార్యాచరణను ప్రవేశపెట్టారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర కమిటీ సభ్యులు వి. కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు


రూ.1.55 లక్షల కోట్ల వ్యయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

'ప్రేమాభిమానాలు లేకుండా వేలాది మంది బతకొచ్చు..కానీ నీళ్ల లేకుండా వించలేరు".. డబ్ల్యూ.హెచ్.అడెన్, తత్వవేత్త. మానవ జీవితంలో నీటి ప్రాధాన్యతకు అద్దంపట్టే వ్యాఖ్య ఇది.

నీటిది, మనిషి జీవితానిది అవినాభావ సంబంధమనేది అందరికి తెలిసిందే. అది సాగునీరు కావచ్చు. తాగునీరూ కావచ్చు. రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ సర్కారు సాగునీటి రంగంలో చేసిన కృషి ఎలావుంది? కుదేలైన సాగునీటి రంగ అభివద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు ఫలిస్తున్నాయా? తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మాట నిలబెట్టుకున్నారా? నేటి దశాబ్ది ఉత్సవాల సందర్భంలో పరిశీలిద్దాం. సాగు నీటి ప్రాజెక్టుల రూపకల్పన, వాటిని నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేయడంలో కొన్ని భిన్నాభిప్రాయాలున్నా సాధించిన ప్రగతిని తక్కువ చేయలేం. నేడు నిర్మాణాలన్నీ దాదాపు పూర్తయి ప్రాజెక్టులన్నీ నేడు సరికొత్త రూపును సంతరించుకున్నాయి. దీనికితోడు పాత ప్రాజెక్టులనూ ఆధునీకరించటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. తెలంగాణ ఇప్పుడు కోటిన్నర ఎకరాల మాగాణంగా అవతరించిందని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. రాష్ట్రానికి ప్రధాన నీటివనరులు గోదావరి, కృష్ణా నదులు. ఈ రెండింటా కలిపి రాష్ట్రానికి 1266.44 టీఎంసీల జలాలు అందుబాటులో ఉంటాయి. కృష్ణానదిలో 299 టీఎంసీలు, గోదావరిలో 967.94 టీఎంసీలు. అదనంగా కృష్ణాలో మరో 500 టీఎంసీలు మిగులు జలాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీటి కేటాయింపులు సరిగ్గా వినియోగించకపోవడంతో తెలంగాణ ప్రాంత రైతులు తీరని కష్టాలుపడ్డారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత, నీటి వాటా వినియోగించుకుని 125 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా కృషి సాగిందని ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ ఆయకట్టు 119 శాతం పెరిగిందని

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.



ఆరు అంచెల వ్యూహం

నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆరు అంచెల వ్యూహాన్ని అనుసరించి అమలుచేసింది.

- ఏండ్ల తరబడి నిర్లక్ష్యానికి గురై కొనసాగుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయడం 2. నాగార్జునసాగర్, నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయడం
- మిషన్ కాకతీయ కింద రాష్ట్రంలోని అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, వాటర్‌షెడ్ల పునరుద్ధరణ
- ప్రాజెక్టు కమాండ్ ఏరియా గుండా ప్రవహించే వాగులు, నదుల పునరుజ్జీవనం కోసం తూములు, చెక్‌డ్యామ్‌ల ద్వారా ట్యాంకులను ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టులతో అనుసంధానం చేయడం
- ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న పాలమూరు-రంగారెడ్డి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టడం
- మెరుగైన నీటి వినియోగ సామర్థ్యం, పంట ఉత్పాదకతను సాధించడానికి నీటిపారుదల వ్యవస్థల సమర్థవంతమైన అపరేషన్, నిర్వహణ.

నాడు.. నేడు

ప్రభుత్వ నివేదిక ప్రకారం తెలంగాణ వచ్చిన తర్వాత రూ.1,55,210.88 కోట్లు వ్యయంతో నీటిపారుదల విస్తీర్ణం 5.71 లక్షల ఎకరాల నుంచి 17.23 లక్షల ఎకరాలకు పెరి గింది. గతంలో ఉన్న చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు రాష్ట్రం సాగునీటి రంగం అవసరాలు తీర్చేలా లేకపోవడంతో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పెద్దపెద్ద జలాశయాలను సైతం పునరుద్ధరించారు. ఆమేరకు భూగర్భనీటి వనరులూ అధికమయ్యాయి. తాజా బడ్జెట్‌లోనూ సాగునీటి ప్రాజెక్టులకు రూ.9381.34 కోట్లు కేటాయించడం గమనార్హం.

కేంద్రం వివక్ష

కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణ పట్ల పూర్తిగా వివక్షను ప్రదర్శిస్తున్నది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. పైగా ప్రాజెక్టులపై కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ పేరుతో పెత్తనం చేస్తున్నది. అంతేగాక నిర్వహణ కోసం రెండు తెలుగు రాష్ట్రాలు రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని షరతు పెట్టింది. అపెక్స్ కౌన్సిల్ నిర్వహించకుండా సాగునీటి సమస్యలను పెండింగ్‌లో పెట్టింది.

కాళేశ్వరం ప్రాజెక్టు

ప్రపంచంలోనే ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో అతి పెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం. దీనిని తెలంగాణ ప్రభుత్వం రికార్డు సమయంలో నిర్మించింది. కాళేశ్వరం కింద 19.63 లక్షల ఎకరాల ఆయకట్టును సృష్టించి, 18.83 లక్షల ఎకరాలను స్థిరీకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. 13 జిల్లాలు, 31 నియోజకవర్గాలు, 121 మండలాలు, 1698 గ్రామాలకు కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరించి ఉంది. దిని కింద మూడు ఆనకట్టలు, 22 లిఫ్టులు, 21 భారీ పంపుహౌజులు, 15 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల సొరంగమార్గాలు, 1531 కిలోమీటర్ల పొడవున కాలువలు నిర్మించారు. ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రఖ్యాతి పొందిందని సర్కారు చెబుతున్నది. దీని ద్వారా సముద్ర మట్టం నుంచి 618 మీటర్ల ఎత్తుకు గోదావరి జలాలు ఎత్తిపోయడం జరుగుతున్నది.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని శ్రీశైలం రిజర్వాయర్ ముంగిట నుంచి పంపింగ్ ద్వారా ఐదు దశల్లో నీటిని ఎత్తిపోసే ప్రయత్నమిది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలలో 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించడానికి ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది. ఇది పూర్తయితే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు ప్రాంతాల కల నెరవేరుతుంది.

దేవాదుల తుపాకుల గూడెం సమ్మక్క-సారక్క ప్రాజెక్టు

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ మూడు జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించేందుకు గోదావరి నది నీటిని మళ్లించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. డిండి, శ్రీరాంసాగర్ పునరుజ్జీవనం, ఆర్డీఎస్, తుమ్మిళ్ల, ఎత్తిపోతలు, గట్టు, పాల మూరు-రంగారెడ్డి, సీతా రామ, డిండి, గట్టు ఎత్తిపోతల, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర), కడెం, చనాకా-కొరాట తదితర ప్రాజెక్టుల పనులూ వేగంగా జరుగు తున్నాయి.

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు:

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నది.

నిండుగోళాలుగా చెరువులు

నీటి వనరులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో గొలుసుకట్టు చెరువులను పునరుద్ధించడం, పూడికలు తీయడం ద్వారా చెరువులనే ఆధారంగా చేసుకునే చాలా భూములు సాగులోకి వచ్చాయి. అంతేకాకుండా భూగర్భజలాల సామర్థ్యం పెరిగి బావులు, బోర్లల్లో నీరు లభిస్తున్నది. దాదాపు 15 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం 46,531 చెరువుల్లో పూడిక తొలగించి, తూములు, కట్ట లను పటిష్టంగా నిర్మించడం కోసం ప్రభుత్వం రూ. 5,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. మిషన్ కాకతీయ ద్వారా పునరు ద్ధరించబడిన చెరువులకు భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా నీటిని తరలించి ఎండాకాలంలో సైతం చెరువులు నిండుగోళాలుగా తయారయ్యేలా చర్యలు చేపట్టింది.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, దేవాదుల, భక్త రామదాసు తదితర పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసింది. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ తదితర పాత ప్రాజెక్టుల కాల్వలను ఆధునీకరించింది. నదులు, వాగులు, వంకల పునరుజ్జీవం కోసం రూ, 3,825 కోట్ల వ్యయంతో 1200 చెక్ డ్యామ్‌ల నిర్మాణం జరుగుతున్నది.

యాలకులతో...



సుగంధ ద్రవ్యాల్లో యాలకులు కూడా ఒకటి. వీటిని వంటల్లో మంచి సువాసన కోసం మాత్రమే కాదు... ఆరోగ్యపరంగానూ ఉపయోగిస్తుంటారు. ఈ యాలకులు ఆరోగ్యానికి ఎలాంటి మేలు చేస్తాయో కొన్నింటిని చూద్దాం...

- పిల్లలలో జలుబుకి యాలకులు మంచి ఔషధంగా చెప్పవచ్చు. నాలుగు లేదా ఐదు యాలకులు నిప్పులపై వేసి ఆ పొగను పీల్చినట్లయితే ముక్కు కారటం తగ్గుతుంది.
- కడుపు ఉబ్బరంతో బాధపడుతున్నపుడు యాలకులు పొడి చేసి, అర టీస్పూన్ పౌడర్‌ను తీసుకొని చిన్న గ్లాసులో సగం నీళ్ళు తీసుకుని ఉడికించి, చల్లార్చి తాగితే కడుపు ఉబ్బరం తగ్గిపోతుంది.
- డిప్రెషన్ ఉన్నవారు 'యాలకుల టీ' తాగితే సాధారణ స్థితికి వస్తారు. తక్కువ టీ పౌడర్, ఎక్కువ యాలకులు టీని కలిపి తీసుకుంటే మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. అయితే ఏలకులు ఎక్కువగా నమలడం లేదంటే నోటిలో చాలా సమయం అలాగే ఉంచడం మంచిది కాదు.

ఏ కాలంలోనైనా...



ఆల్మండ్ ఆయిల్, కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, నువ్వుల నూనెలకు ఏ కాలంలోనైనా చర్మాన్ని రక్షించగలిగే శక్తి వుంది. ఈ నూనెలు అప్లై చేస్తే చర్మం కాంతివంతంగా మారుతుంది. వీటితో పాటు మరికొన్ని ప్రయోజనాలు తెలుసుకుందాం...

కొబ్బరి నూనె : కొబ్బరి నూనెలో లవణాలు అధికం. కాబట్టి కొబ్బరి నూనె శరీరానికి రాసుకుంటే ముడతలు రాకుండా కాపాడుకోవచ్చు. చర్మం ఎలాంటిదైనా కొబ్బరినూనె వాడొచ్చు.

ఆలివ్ ఆయిల్ : చర్మ సౌందర్యానికి చక్కని సాధనం. దీనిలోని విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల చర్మం వయసుతో వచ్చే మార్పులకు గురికానివ్వదు. ఆలివ్ నూనె మర్దనతో చర్మం ఎంతో సౌందర్యంగా, ఆకర్షణీయంగా తయారవుతుంది.

ఆల్మండ్ ఆయిల్ : చర్మాన్ని ఎండిపోనివ్వదు. ఈ నూనె రాసుకుంటే చర్మం తేమను గ్రహిస్తుంది. దురద, మంట వంటి చర్మ సమస్యలకు ఆల్మండ్ నిరోధిస్తుంది.

నువ్వుల నూనె : నువ్వుల నూనెలోని విటమిన్ బి, ఇ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దీనిలోని కాల్షియం, మెగ్నీషియంల వల్ల చర్మం ఆరోగ్యవంతంగా వుంటుంది.



"పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాల సమగ్ర అభివృద్ధికి నిష్పక్షపాతంగా రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోంది. ఆదివాసీ గిరిజనులకు ముఖ్యమంత్రి భారీ స్థాయిలో నిధులు కేటాయిం చారు. ఎన్నో దశాబ్దాల అణచివేతకు, ఆర్థికంగా వెనుకబాటు కు గురైన ఆదివాసీలు, బంజారాలు ఇతర సామాజిక వర్గాలతో సమానంగా ఎదిగేందుకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోటాను పెంచారు. వారి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసి తగిన నిధులు ప్రభుత్వం కేటాయించింది. గిరిజన గూడేలను, తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని దశాబ్దాలుగా చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం

మెరుస్తున్న గిరిజన ఆవాసాలు

సానుకూలంగా స్పందించి. రాష్ట్రంలోని 3,146 తండాలు, గూడేలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించాము. ఆ పంచాయతీల్లో రూ.1,897.08 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాము. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు ఎమ్ఎస్‌డీఎఫ్ కింద ప్రత్యేక నిధులను ఈ ఏడాది కేటాయించాము" అంటూ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి **సత్యవతి రాథోడ్** నవతెలంగాణ ప్రతినిధితో ప్రత్యేక ఇంటర్వ్యూ.... ఈ వివరాలు మానవి పాఠకుల కోసం...

గిరిజన అభివృద్ధికి అవిరాళ కృషి

3,146 తండాలు, గూడేలు పంచాయతీలుగా మార్పు

గురుకులాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

దశాబ్ది ఉత్సవాల ప్రత్యేకత ఏంటి?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పదేండ్లు నిండిన సందర్భంగా ప్రభుత్వం ఈ కాలంలో ప్రవేశపెట్టిన పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా మరో సారి ప్రజలకు వివరిస్తాం. ఉత్సవాలను పండుగలా నిర్వహిస్తాం. పదేండ్ల ప్రగతిని చాటుతాం. అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహిస్తాం. గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు జూన్ 2 నుంచి 22 వరకు ఏరోజున ఏ కార్యక్రమం చేపట్టాలో ప్రణాళిక రూపొందించాం. గిరిజన విద్యాలయాల్లో సంబురాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. గిరిజనుల సాంస్కృతిక ఉత్సవాలు, ఆర్ట్ ఫ్రేమ్‌ల ప్రదర్శన, గిరిజనుల ఉత్పత్తుల వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం.

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు ఏంటి?

ఆదివాసీ గిరిజనుల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు చేపట్టింది. పల్లెప్రగతిలో భాగంగా అన్ని గిరిజన గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్లను సమకూర్చింది. పల్లె ప్రకృతివనాలు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామాలతో సహా అధునాతన వసతులను కల్పించింది. రాష్ట్రంలోని 1,082 గిరిజన ఆవాసాలలో రూ.1,270 కోట్లతో బీటీ రోడ్లు వేసింది. ఈ ఏడాది 2000 గిరిజన పల్లెల్లో రోడ్ల అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు కేటాయించింది. అత్యంత వెనకబడిన ఆదివాసీ తెగలు నివసిస్తున్న గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల నిర్మాణానికి ప్రత్యేక నిధుల కింద రూ. 133 కోట్లు కేటాయించింది. గిరిజన ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా రక్షితతాగు నీటిని అందిస్తున్నది. ఏజెన్సీ ఏరియాల్లో విషజ్వర మరణాలు అరికట్టడంలో సఫలీకృతమైంది. ఎస్టీ మహిళలు 2,28,089 మంది రూ.151 కోట్ల విలువైన కేసీఆర్ కిట్లు పొందారు. గిరిజనుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేకంగా గిరిపోషణ పథకాన్ని అమలుచేస్తున్నది. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా 821 ఆవాసాలలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నది.

విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషి?

గిరిజన విద్యార్థుల కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా 92 గురుకుల విద్యాలయాలను నెలకొల్పింది. వీటిలో రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, ఫైన్ ఆర్ట్స్, లా కాలేజీలు, సైనిక్ స్కూల్, కాలేజ్ ఆఫ్ ఎక్సైన్స్ సహా పలు విద్యా సంస్థలను నెలకొల్పింది. గురుకుల భవనాల నిర్మాణానికి రూ. 292 కోట్లు కేటాయించింది. గురుకులాల్లో శిక్షణ పొందిన వందలాది మంది ఎస్టీ విద్యార్థినీ విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రూ.33.49 కోట్లు అందజేసింది.

పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామంటున్నారు ఎలా సాధ్యం?

ఆదివాసీ గిరిజనులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం సీఎంఎస్టీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నొవేషన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ)లో ఈ పథకం కోసం ఎంపికైన అర్హులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 162 మందికి లబ్ధి చేకూరింది. అలాగే డ్రైవర్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం రూరల్ ట్రాన్స్‌ఫోర్ట్ పథకం కింద సుమారు రూ.101.50 కోట్లు వెచ్చించి 1,424 మంది గిరిజన యువకులకు వాహనాలను సమకూర్చి ఉపాధి కల్పించింది.



సంక్షేమ పథకాలు సక్రమంగా అందటం లేదన్న విమర్శ ఉంది?

ఇందులో వాస్తవం లేదు. అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగానే అందుతున్నాయి. రైతుబంధు పథకంలో భాగంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 8.21,780 మంది రైతులకు రూ.7,354 కోట్ల పంట పెట్టుబడిని అందించింది. రైతు బీమా పథకం ద్వారా 4,93,720 మంది ఎస్టీ రైతులకు ప్రభుత్వమే రూ.6.11 కోట్ల ప్రీమియం చెల్లించి ఉచిత బీమా సదుపాయం కల్పించింది. ఆసరా పథకం ద్వారా 3,75,816 మంది గిరిజనులకు రూ.4.286 కోట్ల పింఛన్ మొత్తాన్ని అందించింది. కల్యాణలక్ష్మి పథకం ద్వారా 1,38,730 మంది గిరిజన ఆడబిడ్డల పెండ్లిళ్ల కోసం రూ.1,126.61 కోట్లను అందించింది. ఎస్టీల నివాస గృహాలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నది. మారు మూల ప్రాంతాల్లో ఉండే ఆదివాసీ గిరిజనుల వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా కోసం రూ.221 కోట్లు ఖర్చుచేసింది..



రైతు బీమా పథకం ద్వారా 4,93,720 మంది ఎస్టీ రైతులకు ప్రభుత్వమే రూ.6.11 కోట్ల ప్రీమియం చెల్లించి ఉచిత బీమా సదుపాయం కల్పించింది.ఆసరా పథకం ద్వారా 3,75,816 మంది గిరిజనులకు రూ.4.286 కోట్ల పింఛన్ మొత్తాన్ని అందించింది. కల్యాణలక్ష్మి పథకం ద్వారా 1,38,730 మంది గిరిజన ఆడబిడ్డల పెండ్లిళ్ల కోసం రూ.1,126.61 కోట్లను అందించింది. ఎస్టీల నివాస గృహాలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నది. మారుమూల ప్రాంతాల్లో ఉండే ఆదివాసీ గిరిజనుల వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా కోసం రూ.221 కోట్లు ఖర్చుచేసింది..

సంబరాలు సరే ఆకాంక్షల మాటేమిటీ?

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లు అవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది సంబరాలను జరుపుతున్నదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాలు సరే కానీ రాష్ట్రం కోసం పోరాడిన ప్రజల ఆశలు, ఆకాంక్షల మాటేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీళ్ల, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసమే ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. ఆ ఆశలు నిరాశలుగా మిగిలాయని పేర్కొన్నారు. త్యాగాలు ఒకరివిగా, భోగాలు మరొకరివిగా పరిస్థితి మారిందని తెలిపారు. ఖాళీ పోస్టులను నింపలేదని, నోటిఫికేషన్లు అవినీతి, అక్రమాలకు నిలయమయ్యాయని విమర్శించారు. విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు నిధుల్లేక కొడిగట్టి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల కాలంలో ఒక్కరికీ ఇండ్ల జాగా ఇవ్వలేదని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం పడకేసిందని తెలిపారు. పోడు భూములన్నింటికీ పట్టాలిచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు.

గ్రూప్ 1 పరీక్షలను ఆపండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సిట్ దర్యాప్తు కొలిక్కి వచ్చే వరకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 11న గ్రూప్ వన్ పరీక్షలను నిర్వహించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ రిట్లను జస్టిస్ కె.శరత్ విచారించి కమిషన్‌కు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. విచారణను ఈ నెల 5కి వాయిదా వేశారు. కమిషన్‌లో పనిచేసే వాళ్ల నిజాయితీ తేలాలంటే సిట్ దర్యాప్తు పూర్తికావాలని పిటిషనర్ల వాదన. ఈ పరిస్థితుల్లో ఈ నెల 11న పరీక్షల నిర్వహణకు కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ అమలును నిలిపివేయాలని ఆదేశించారు.

లుక్‌ఔట్ నోటీసు రద్దు చేయండి : మార్గదర్శి శైలజ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమరావతి పీఎస్‌లో నమోదైన కేసుల్లో కఠిన చర్యలు తీసుకోరాదన్న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏపీ సీఐడీ లుక్‌ఔట్ నోటీసు జారీ చేసిందని మార్గదర్శి ఎండీ శైలజ చెరుకూరి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ శరత్ విచారించారు. ఏపీ సీఐడీ ఇమిగ్రేషన్ అధికారులకు ఇచ్చిన లుక్‌ఔట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలనీ, అమెరికాలో ఉన్న శైలజ జూన్ 3న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని ఆమె లాయర్ వాదించారు. సీఐడీ విచారణకు శైలజ సహకరిస్తున్నప్పటికీ లుక్‌ఔట్ నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు. ఏప్రిల్ 23న సీఐడీ విచారణకు హాజరయ్యారనీ, తర్వాత విచారణ మే 13కి వాయిదా పడిందని, అయితే శైలజ ఏప్రిల్27 నుంచి మే 22 వరకు అందుబాటులో ఉండరని తెలిపారని వివరించారు. జూన్ 6న ఉదయం పది గంటలకు ఇంటి వద్ద విచారణ చేస్తామని సీఐడీ నోటీసు ఇవ్వగా అందుకు సమ్మతిని తెలియజేశారనీ, ఈ పరిస్థితుల్లో సీఐడీ అధికారులు లుక్‌ఔట్ చర్యలకు ఉపక్రమించారని తప్పుపట్టారు. లుక్‌ఔట్ నోటీసుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

యాదాద్రి ఆలయం పూర్తి రూపాంతరం చెందింది

- అఖిలభారత బ్రాహ్మణ సమాఖ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యాదాద్రి లక్ష్మినర్సింహాస్వామి ఆలయం పూర్తిగా రూపాంతరం చెందిందని అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ ప్రదీప్‌జియోతి తెలిపారు. గురువారం ఆలయాన్ని సమాఖ్య నేతలు సందర్శించారు. సీఎం కేసీఆర్ బ్రాహ్మణ సమాజం కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.దేశం నలుమూలలనుంచి యాత్రికులు ఇక్కడికి రావటం విశేషమని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ పండిట్ పదం ప్రకాష్ పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో...తెలంగాణ అభివృద్ధి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సహించాలి. వృత్తులకు ప్రోత్సాహం లభించాలి. తెలంగాణలో ఎస్టీలు కూడా ఎక్కువున్నారు. లంబాడాలు, అటవీ ప్రాంతాల్లో కోయలున్నారు. అటవీ సంపదను ప్రాసెస్ చేసి ఆ పరిశ్రమల వైపు యువతను ప్రోత్సహించాలి. భద్రాచలంలో ఎదురుబొంగు పరిశ్రమను నెలకొల్పవచ్చు. ఖనిజాలను ప్రయివేటు సంస్థలకు తాకట్టు పెట్టకుండా స్థానిక యువతను ప్రోత్సహించాలి. తాండూరులో నాపరాయి పరిశ్రమను అభివృద్ధి చేయాలి. వివిధ ప్రాంతాల్లోని సహజ వనరులను ప్రాసెస్ చేసేందుకు పరిశ్రమలను అభివృద్ధి చేయాలి.

తెలంగాణలో సాంస్కృతిక అభివృద్ధి జరిగిందంటారా?

సాంస్కృతికంగా అభివృద్ధి చేసేందుకు చేపడుతున్న చర్యలు చాలవు. తెలంగాణ భాషను సినిమాల్లో తక్కువ చేసి చూపించేవారు. ఇప్పుడు తెలంగాణ యాసతో సినిమాలు రావడాన్ని అభినందించాలి. ప్రభుత్వం వాటిని ప్రోత్సహించాలి. భాషా సాంస్కృతికాభివృద్ధికి నిపుణులతో కమిటీ వేయాలి. వర్సిటీల్లో పరిశోధనలు చేయాలి. గిరిజన సంస్కృతి గొప్పదనాన్ని, భాషను పరిరక్షించాలి. వారి వాడుక వస్తువులను, కళాఖండాలను సేకరించి వాటిని ప్రదర్శనగా పెట్టాలి. ప్రభుత్వం అందుకు స్థలం కేటాయించి పదిల పర్చడానికి భవనం నిర్మించాలి. అప్పుడే భావితరాలకు వాటిని అందించడానికి వీలవుతుంది. కొన్ని చారిత్రక కట్టడాలను పదిల పరుస్తూనే యాదాద్రి ఆలయం, సచివాలయం వంటి ప్రముఖ కట్టడాలకు రూపకల్పన జరిగింది. మొదట అపోహలు, విమ్మలు వచ్చినా అవి మన సంస్కృతికి ప్రతీకలుగా నిలిచాయి. ప్రాచీన చిహ్నాలున్నాయి. వాటిని పరిరక్షించే కృషి జరగాలి. తెలంగాణ అభివృద్ధి అనేది భాషా సాహిత్యాలు, కళలు వంటి అనేక సాంస్కృతిక విషయాల్లోనూ జరగాలి. ఈ కృషిలో ప్రభుత్వంతోపాటు పౌరసమాజం కూడా భాగస్వామ్యం కావాలి.

భాగస్వామ్యం చేయడంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అనేక పాజిటివ్ అంశాలు ఉన్నా కేసీఆర్ ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణి వాటిని మసకబారుస్తున్నది. వివిధ విషయాల్లో ప్రజలతో, వివిధ రంగాల పెద్దలు, ప్రతిపక్షాలతో, రాజకీయ పార్టీలతో చర్చించడం ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన చర్య. వారి మాట పాటించడం, పాటించకపోవడం వేరు. ఆలకించడం ముఖ్యమైన విషయం. అది చేయకపోవడం ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నది. ఈ సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే లౌకిక సిద్ధాంతం పట్ల నిబద్ధతతో వ్యవహరించాలి. బీజేపీ పట్ల ఇప్పుడున్నంత కరుకుగానే భవిష్యత్తులోనూ కొనసాగాలి. మళ్లీ బీజేపీతో సఖ్యత ప్రదర్శిస్తే అవకాశవాదంతో వ్యవహరిస్తే అది ప్రజలకు ప్రమాదం. అదే జరిగితే ఈ ప్రభుత్వం విశ్వసనీయత కూడా దెబ్బతింటుంది. ఈ జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగాలి.

మునుగోడు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు, కమ్యూనిస్టులకు మధ్య కొంత గ్యాప్ వచ్చినట్టుగా కనిపిస్తున్నది ఇది నిజమేనా?

గ్యాప్ అని అనుకోవడం లేదు. అప్రజాస్వామిక ధోరణిలో భాగంగా ప్రతి విషయంలో అందరినీ సంప్రదించి ముందుకెళ్లే లక్షణం ఈ ప్రభుత్వానికి లేదు. కమ్యూనిస్టులతో కూడా చర్చించడం తక్కువగా ఉన్నది. దాన్ని సరిచేసుకోవాలి. లెఫ్ట్‌తో కలిసుండడం, వదిలిపెట్టడం సెంటిమెంట్ మాత్రమే కాదు. నేటి అవసరం కూడా. కొన్ని జిల్లాల్లో లెఫ్ట్ లేకుండా ముందుకెళ్లడం అసాధ్యం. సీపీఐ, సీపీఐ(ఎం)తో కలిసే ఉంటారని భావిస్తున్నాం.

తొమ్మిదేండ్ల కాలంలో సీపీఐ(ఎం) పోరాడి సాధించిన విజయాలు ఎలా ఉన్నాయి?

ప్రతి ప్రజా సమస్యపై సీపీఐ(ఎం) పోరాటాలు సాగిస్తున్నది. తెలంగాణ సాధించిన సంతృప్తి ప్రజల్లో ఉన్నది. అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నారు. కొంత జరిగింది కూడా. ఆ మేరకు ప్రజల కదలికలోనే తేడా ఉన్నది. కొన్ని సెక్షన్ల ప్రజలు కదలికలోకి వస్తున్నారు. కార్మికులు, భూ నిర్వాసితులు, పోడు భూముల గిరిజనులు, స్కీం వర్కర్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాల్లేని ప్రజలను కదిలించి పోరాడుతున్న పార్టీ సీపీఐ(ఎం). మిగతా పార్టీలు కేవలం కేసీఆర్‌ను విమర్శిస్తున్నాయి. కానీ పునాది వర్గాల్లో పోరాటాలన్నీ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి.

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మీ సందేశమేంటి?

తెలంగాణ మరింత అభివృద్ధి కావాలి. మతోన్మాదం, కార్పొరేట్ విధానం అభివృద్ధికి ఆటంకం. దాన్ని తెలంగాణలో ప్రవేశించనీయొద్దు. దాన్ని తేవడానికి బీజేపీ సర్వశక్తులూ ఒడ్డి కృషి చేస్తున్నది. రాష్ట్రంలో ఆ పార్టీ పెరిగే పరిస్థితి లేదు. కానీ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. మతోన్మాదం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బండి సంజయ్ హిందూ ఏక్తా యాత్ర చేశారు. కానీ ప్రజాసమస్యలపై ముఖ్యంగా డబుల్ బెడ్రూం ఇండ్లు, భూపంపిణీ, రైతులకు గిట్టుబాటు ధర, పంట నష్టపరిహారం కోసం యాత్ర చేయడం లేదు. రాష్ట్రంలో నాలుగు కోట్ల మందిలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులున్నారు. మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్ల కోసం వారు పాకులాడుతున్నారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింల మధ్య చిచ్చు పెట్టే పని చేస్తున్నారు. ఈ వలలో పడొద్దు. తెలంగాణ అభివృద్ధిని కోరుకోవాలి. ప్రజలు, కుటుంబాలు, పిల్లల అభివృద్ధి కావాలి. విద్యావైద్యం, సాంస్కృతిక అభివృద్ధిని కోరుకోవాలి తప్ప మత ఘర్షణల అభివృద్ధి కోరుకోవద్దు. ఈ అప్రమత్తత ప్రజల్లో ఉన్నంత కాలం మతోన్మాదం ఏమీ చేయలేదు. ఆ రకంగా ముందుకు సాగాలి.

ఆర్టీసీ కార్మికులకు తీపికబురు

- జూన్ వేతనంతో కలిపి డీఏ అందజేత
- ప్రకటించిన ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్‌డీ సజ్జనార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా ఆర్టీసీ కార్మికులకు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీపి కబురు చెప్పింది. జూలై 2022లో ఇవ్వాల్సిన 4.9 శాతం డీఏను ఇస్తున్నట్టు ప్రకటించింది. జూన్ నెల వేతనంతో కలిపి డీఏను చెల్లిస్తామని తెలిపింది. ఈ మేరకు గురువారం టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణ ఉద్యమంలో టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారు. 2011లో దాదాపు 29 రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాల కానుకగా పెండింగ్‌లో ఉన్న ఏడో డీఏను ఉద్యోగులకు మంజూరు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇప్పటి వరకూ ఏడు డీఏలను సంస్థ మంజూరు చేసింది. మిగిలిన ఒక్క డీఏను కూడా త్వరలోనే ఉద్యోగులకు ప్రకటిస్తుంది' అని వారు తెలిపారు.

నేటి నుంచి మూడు వారాలపాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


తెలంగాణ ఆవిర్భావానికి తొమ్మిదేండ్లు పూర్తయి.. పదో వసంతంలోకి అడుగు పెడుతున్న వేళ... దశాబ్ది ఉత్సవాలకు రాష్ట్రం సిద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు వారాల(ఈనెల 22 వరకు)పాటు నిర్వహించబోయే ఈ ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్దగల అమరవీరుల స్థూపానికి సీఎం కేసీఆర్ ఉదయం 8 గంటలకు నివాళులర్పిస్తారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించటం ద్వారా ఆయన దశాబ్ది ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. నూతన సచివాలయ ప్రారంభం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అక్కడ నిర్వహించబోయే మొట్టమొదటి అధికారిక కార్యక్రమం ఇదే. సంబంధిత ఏర్పాట్లను సీఎస్ శాంతికుమారి, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్వహించే వేడుకల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎస్‌కేఎం నేతల డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం హైదరాబాద్ సుందరయ్య పార్క్ వద్ద 'కేంద్రప్రభుత్వ' దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, మూడ్ శోభన్, జక్కుల వెంకటయ్య, సిహెచ్ రామచందర్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చిపెడుతున్న ఒలింపిక్ పతక విజేతలతోసహా మన అగ్రశేణి క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న మల్లయోధులను రోడ్లపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లారనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు 'బేటీ బచావో బేటీ పడావో' అంటూ సంబరాలు చేసుకుంటూనే, మరోవైపు ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బీజేపీ ఎంపీని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్ పద్మ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.హన్మేశ్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, పీవోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు డి. స్వరూప, నాయకులు కిరణ్, లింగం గౌడ్, రవీందర్, రవి కుమార్, వరలక్ష్మి, దేవమని, పుష్ప, నాగమ్మ, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



టెన్త్ పుస్తకం నుంచి ప్రజాస్వామ్యం మాయం

న్యూఢిల్లీ : పాఠ్యపుస్తకాల నుండి తొలగింపుల ప్రక్రియను ఎన్సీఈఆర్టీ కొనసాగిస్తోంది. తాజాగా పదో తరగతి పుస్తకాల నుండి ప్రజాస్వామ్యం, ఆవర్తన పట్టిక, ఇంధన వనరులు అనే చాప్టర్లను తొలగించింది. విద్యార్థులపై భారం తగ్గించేందుకు ప్రారంభించిన హేతుబద్ధ చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామంటూ మరోసారి అరిగిపోయిన రికార్డును వినిపించింది. పదో తరగతి పాఠ్యపుస్తకాల నుంచి ఈ సంవత్సరం ప్రారంభంలోనే పరిణామ సిద్ధాంతాన్ని తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ 1800 మంది శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు బహిరంగ లేఖ రాశారు. ఎన్సీఈఆర్టీ తాజాగా విడుదల చేసిన పాఠ్యపుస్తకాల నుండి కూడా మరికొన్ని చాప్టర్లు అదృశ్యమయ్యాయి. ఇందులో ఆవర్తన పట్టిక కూడా ఉంది. పర్యావరణం, ఇంధన వనరులు వంటి చాప్టర్లు కూడా తొలగింపుల జాబితాలో ఉన్నాయి. తాజా రివిజన్ అనంతరం ప్రజాస్వామ్యం-రాజకీయ పార్టీలకు సవాళ్లు అనే చాప్టర్లను పూర్తిగా తొలగించారు. కరోనా నేపథ్యంలో విద్యార్థులపై భారం తగ్గించడం అనివార్యమైందని ఎన్సీఈఆర్టీ వివరణ ఇచ్చింది. పైగా ఈ చాప్టర్లు కష్టంగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితులలో వాటి అవసరం లేదని సాకులు చెప్పింది. అయితే 11, 12 తరగతులలో ఈ పాఠ్యాంశాలను అభ్యసిస్తామని విద్యార్థులు ఆప్షన్ ఇస్తే 10వ తరగతిలో వాటిని నేర్చుకోవచ్చునని తెలిపింది. పదో తరగతిలో గత సంవత్సరం సైన్స్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా నిర్ణయించారు. యూనివర్సిటీ చదువుకు ముందు రెండు సంవత్సరాల పాటు రసాయన శాస్త్రాన్ని చదివేందుకు ఆప్షన్ ఇచ్చే విద్యార్థులు మాత్రం ఆవర్తన పట్టిక గురించి తెలుసుకుంటారు.

స్పీడు పెంచిన సారు..

అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సీఎం కార్యాచరణ...

- ప్రతి రోజూ సచివాలయానికి
- సమీక్షల మీద సమీక్షలు
- క్రమబద్ధీకరణలు..పలువురికి పదవులు
- పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలంటూ ఆదేశాలు
- ఎలక్షన్లే టార్గెట్‌గా 21 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు



ముఖ్యమంత్రి కేసీఆర్ కారు స్పీడు పెంచారు. వచ్చే డిసెంబరులో నిర్వహించబోయే శాసనసభ ఎన్నికలే లక్ష్యంగా ఆయన బరిలోకి దిగారు. ఏప్రిల్ 30 దాకా తన నివాసమైన ప్రగతి భవన్ నుంచే పరిపాలన సాగించిన సీఎం కేసీఆర్... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట నిర్మించిన నూతన సచివాలయాన్ని ప్రారంభించిన నేపథ్యంలో అక్కడి నుంచే పాలన కొనసాగిస్తున్నారు. తద్వారా గతంలో 'సీఎం సచివాలయానికి రారు...' అనే ముద్రను ఆయన చెరిపేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు కొత్త సెక్రటేరియల్‌లో అనునిత్యం వివిధ శాఖలు, రంగాల పురోగతిపై సమీక్షల మీద సమీక్షలు నిర్వహిస్తూ బిజీగా గడుపుతున్నారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఇప్పటికే ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. దీంతోపాటు, ఈ నెలాఖరులో తెలుగుతల్లి ఫ్లైఓవర్ పక్కన ఏర్పాటుచేసిన అమరవీరుల స్మారక కేంద్రాన్ని సీఎం ప్రారంభించనున్నారు. నూతన సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత పేరును పెట్టటంద్వారా దేశం దృష్టిని ఆయన ఆకర్షించారు. ఇవన్నీ రాజకీయంగా కేసీఆర్ ముందుచూపునకు నిదర్శనాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఇటీవల పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ శాఖలు, విభాగాల్లో ఏండ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ దస్త్రంపై సంతకం చేశారు. ఫలితంగా మొత్తం 11,103 మంది ఉద్యోగులు, సిబ్బంది పర్మినెంట్ అయ్యారు. వీరిలో 5,544 మంది విద్యాశాఖకు చెందిన వారే ఉన్నారు. వీరిలో కూడా 3,897 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. ఇక తమ డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం కొద్ది రోజుల క్రితం వరకు ఆందోళనలు నిర్వహించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు, వీఆర్ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్యుత్ సంస్థల్లో పని చేసే ఆర్టిజన్లకు పలు హామీలను ఇవ్వటం ద్వారా సీఎం వారి ఆందోళనలను విరమింపజేశారు. మరోవైపు శుక్రవారం నుంచి హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా మూడు వారాలపాటు నిర్వహించబోయే తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ద్వారా ఆయన స్పీడు మరింతగా పెంచనున్నారని తెలిసింది. 21 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఒకవైపు బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రచారంలో పెడుతూనే మరోవైపు గత పాలకుల వైఫల్యాలను ఎండగట్టేందుకు వీలుగా ఆయన వ్యూహం రచించారు. తద్వారా కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు గుప్పించనున్నారు. మోడీ హయాంలో మతోన్మాదం ఎలా పెచ్చరిల్లిందనే విషయాన్ని ఆయన ప్రజలముందు పెట్టనున్నారు. దాంతోపాటు బీజేపీ చేపట్టిన ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ దుష్ఫలితాలను కూడా ప్రజలకు విడమరిచి చెప్పనున్నారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో యువతకు అటు ప్రభుత్వపరంగా, ఇటు పార్టీ పరంగా పలు కీలక పదవులను కట్టబెట్టటం ద్వారా వారిని ఎలక్షన్లలో వినియోగించుకునేందుకు సీఎం మార్గం సుగమం చేసుకుంటున్నారు. మంత్రి కేటీఆర్ పెట్టుబడుల కోసమంటూ ఇటీవల లండన్, అమెరికాల్లో పర్యటించారు. అక్కడి ప్రవాస తెలంగాణవాసులను కలిసి...రానున్న ఎన్నికల్లో సహాయ సహకారాలను అందించాలంటూ కోరారు. వివిధ పరిశ్రమాధిపతులు, వ్యాపార, వాణిజ్యవేత్తలు, ప్రతినిధులతో ఆయన సమావేశాలు నిర్వహించి, కొంతమేర పెట్టుబడులను ఆకర్షించినప్పటికీ ఆ పర్యటన అంతిమ లక్ష్యం...'వచ్చే ఎన్నికలే'నని వినికిడి. మరో మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాలంటూ జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆయన సభలు ఇప్పటికే 'ఎన్నికల మీటింగుల'ను తలపిస్తున్నాయి. వారిద్దరినీ ఇప్పటికే రంగంలోకి దించటం ద్వారా కేసీఆర్... రాష్ట్రంలో 'ఎలక్షన్ మూడ్'ను తెప్పించారు. కాలికి గాయం కారణంతో నిన్న మొన్నటి వరకూ విశ్రాంతి తీసుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైతం బుధవారం నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించటం విశేషం. తద్వారా ఆమె కూడా రంగంలోకి దిగినట్టయింది. ఇక దశాబ్ది ఉత్సవ వేదికల ద్వారా రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలను జనానికి వివరించాలంటూ కేసీఆర్ ఇప్పటికే మంత్రులు, తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. అందుకనుగుణంగా నియోజకవర్గాల్లోనే ఉండాలి తప్ప హైదరాబాద్‌లో ఎవరూ కనబడకూడదంటూ ఆయన సూచించారు. ఎన్నికలయ్యేంత వరకూ జనంతోనే ఉండాలని ఆదేశించారు. ఈ రకంగా రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా గులాబీ దళపతి అన్ని వైపుల నుంచి శరవేగంగా పావులు కదుపుతుండటం గమనార్హం.

ప్రజలకు రాష్ట్రావతరణ దినోత్సవ శుభాకాంక్షలు

సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్వయం పాలన తొమ్మిదేండ్లు పూర్తి చేసుకుని పదవ వసంతంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో, తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, పదవ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ కోసం వివిధ దశల్లో సాగిన పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. రాష్ట్ర ఏర్పాటు దిశగా భావజాలాన్ని వ్యాప్తిచేస్తూ ప్రజలను మమేకం చేస్తూ మలిదశ ఉద్యమాన్ని పార్లమెంటరీ పంథాలో ప్రజాస్వామ్య పోరాటం దిశగా మలిపిన తీరును సీఎం గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన పోరాట క్రమంలో తాను ఎదుర్కొన్న కష్టాలను, అవమానాలను, అధిగమించిన అడ్డంకులను యాది చేసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, వేలాది సభల ను నిర్వహిస్తూ, సబ్బండ వృత్తులను సకల జనులను సమీకరిస్తూ, సమన్వయ పరుస్తూ, అందరి భాగస్వామ్యం సహకారంతో, శాంతియుత పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించి, కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించిన మొత్తం ప్రక్రియను, ఈ క్రమంలో సహకరించిన వారినందరినీ సీఎం గుర్తు చేసుకున్నారు. విజయతీరాలకు చేరుకున్న ఈ మొత్తం ఉద్యమ ప్రస్థానంలో ఇమిడివున్న.. నిర్దిష్ట పరిస్థితులకు అనుసరించిన నిర్దిష్ట కార్యాచరణను,'బోధించు సమీకరించు పోరాడు' అనే పంథా ద్వారా సాధించిన విజయాన్ని సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్మరించుకున్నారు.

తొమ్మిదేండ్ల క్రితం 2014 జూన్ 2 నాడు భారత దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ,. అనుమానాలను పటాపంచలు చేస్తూ, బాలారిష్టాలను దాటుకుంటూ, ప్రత్యర్థులు కుయుక్తు లను తిప్పికొడుతూ నిలదొక్కుకోవడం అత్యద్భుత మని సీఎం అభివర్ణించారు. గతంలో వెనకబాటుకు గురయిన తెలంగాణ నేడు సమస్త రంగాలలో దేశాన్ని ముందుకు తీసుకుపోతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి, ప్రజలందరి భాగస్వామ్యంతో, ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణ సాధించిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శవంతంగా నిలవడం పట్ల సీఎం కేసీఆర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మున్నెన్నడూ ఎరుగని రీతిలో 'తెలంగాణ మోడల్' పాలన దేశ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలంగాణ వంటి పాలన కావాలనీ, అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారనీ, ఈ దిశగా దేశ ప్రజలందరి ఆదరాభి మానాలను చూరగొనడం తెలంగాణ ప్రజలు సాధించిన ఘన విజయమని సీఎం పేర్కొన్నారు. ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ గర్వించాల్సిన గొప్ప సందర్భమిదని సీఎం కేసీఆర్ అన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, సంక్షేమం, ఆర్థిక రంగం సహా సమస్త రంగాలలో గుణాత్మక అభివృద్ధి సాధిస్తూ, మహోజ్వల స్థితికి చేరుకుంటున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని మూడు వారాల పాటు అంగరంగ వైభవంగా, పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఫలాలను ఆస్వాదిస్తున్న ఆనందకరకర సమయంలో తమ సంతోషాలను పంచుకుంటూ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములై రాష్ట్ర ప్రజలందరూ వాడ వాడలా సంబురాలను ఘనంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.



అమరుల ఆకాంక్షలు నెరవేరేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

- రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు

టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సకల జనుల అలుపెరుగని పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని అభిప్రాయపడ్డారు. ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం విషయంలో ప్రతిపక్షా లకూ పెద్దపీట దక్కకపోవడం అన్యాయమని చెప్పారు. పోరాడి సాధిం చుకున్న రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పతనం కాకుండా కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం స్ఫూర్తితో సబ్బండ వర్ణాలు మమేకమవుతూ అమరవీరుల ఆకాంక్షలు ఫలించేలా దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాసాని జ్ఞానేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోల్కొండ కోటలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సాంస్కృతిక శాఖ తరుపున శుక్రవారం గోల్కొండ కోటలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించ నున్నట్టు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం గోల్కొండ కోటలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గోల్కొండ కోటపై త్రివర్ణపతాకాన్ని ఎగురవేయడం తోపాటు.. సాయుధ బలగాల పరేడ్ జరగనుందని తెలిపారు. అనంతరం శంకర్ మహదేవన్, డాక్టర్ ఆనంద శంకర్ బృందం, మంజులా రామస్వామి బృందంతో ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. తెలంగాణ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు.

మంగ్లీ, మధుప్రియలు తెలంగాణ సాంప్రదాయాన్ని, ఉద్యమాన్ని ప్రతిబింబించే పాటలు పాడతారని తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోసం 'ఖిలా ఔర్ కహానీ' థీమ్ తో 'పెయింటింగ్, ఫొటో' పోటీలు నిర్వహిం చామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారందరూ హాజరవుతారని చెప్పారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ పాత్ర మరువేనిదని చెప్పారు.



ఒంటి కాలుపై నిలబడి కార్మికుల నిరసన

- జీవో 60ను అమలు చేయాలని డిమాండ్
- నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఘటన

నవతెలంగాణ- కందనూలు

కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో నెం.60 అమలు చేయాలని కోరుతూ నాగర్ కర్నూలు జిల్లా జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఆందోళన చేశారు. గురువారం జనరల్ ఆస్పత్రి వద్ద వంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలిపిన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ.. దాదాపుగా 35 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నా వేతనాల పెంపు విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కనీస వేతనాల జీవో 60ను అమలు చేయాలని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. సిబ్బందిని కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగస్టులో జీవో అమలు చేసి వేతనాలు పెంచాలంటే.. ఇద్దరు కాంట్రాక్టర్ల గొడవతో కార్మికులు పది మాసాల వేతనం రూ.16,500 కోల్పోయారని తెలిపారు. కేవలం 32 మంది సిబ్బంది 330 పడకల ఆస్పత్రిని ఏ విధంగా శుభ్రం చేస్తారని ప్రశ్నించారు. టెండర్ ప్రక్రియ తొందరగా ముగిసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కార్మికులకు రావాల్సిన 16,500 వేతనం వెంటనే ఇవ్వా లని, అదనపు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు బాల కృష్ణమ్మ, రాధ, శాంతమ్మ, బాలమణి, అలివేల, నిరంజన్, గిరి, వెంకటేష్, శేఖర్ బాలకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.



బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



పౌష్టికాహారం తరచు బాలింతలు, చిన్నపిల్లలకు పంపిణీ చేయాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని మహాభారత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకం కింద మన్న ట్రస్ట్ ద్వారా బాలింతలు, చిన్నపిల్లలకు ఆహార పదార్థాలు అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్డు ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో అక్కడే వండి పెట్టాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు కార్పొరేటర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో వండి పెట్టిన ఆహార పదార్థాలను స్వయంగా పిల్లలు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శీలావతి, అంగన్వాడీ టీచర్ పద్మావతి, స్థానిక బస్తీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ రైతు బజార్ పనుల పరిశీలన

నవతెలంగాణ-అంబర్‌పేట



మోడ్రన్ రైతు బజార్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలనీ, అందుకు అధికారులు సంబంధించిన కాంట్రాక్టర్‌తో సమన్వయంతో కలిసి పని చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. గురువారం కాచిగూడ డివిజన్ పరిధిలోని నారాయణగూడలో నూతనంగా నిర్మిస్తున్న మోడ్రన్ రైతుబజార్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న లీకేజీ పనుల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పారు.

111 జీవో పరిరక్షణకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడి న్యాయ పోరాటం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి

నవతెలంగాణ-అడిక్‌మెట్



111 జీవో పరిరక్షణకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడి న్యాయ పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి కోరారు. గురువారం విద్యానగర్ బీసీ భవన్‌లో 111 జీవో పరిరక్షణకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో ఆర్.కృష్ణయ్య, కోదండ రెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 111 జీవో పరిరక్షణ ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మరింత ధీటుగా పోరాడాలన్నారు. ఆ పార్టీలు సుప్రీంకోర్టు వరకు వెళ్లకపోతే తామే వెళ్లి ఈ జీవోలను రక్షిస్తామనీ, ప్రభుత్వ అవినీతిపై ప్రధానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 111 జీఓ పై బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 111 జీఓ పై కాంగ్రెస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలన్నారు. రూ.2 లక్షల కోట్ల అవినీతి జరిగే అవకాశం ఉందనీ, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు చెరువులను కబ్జాలు చేస్తున్నారని తెలిపారు. 1995 ప్రాంతంలో జంట జలాశయాలు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే నిర్మాణాలకు ఉపక్రమిస్తున్న తరుణంలో సుప్రీంకోర్టులో వచ్చిన వ్యాజ్యం నేపథ్యంలో నాటి ప్రభుత్వంకు వచ్చిన ఆదేశాల క్రమంలో పర్యావరణ, నీటిపారుదల నిపుణులు హైదరాబాద్ పరిరక్షణ కోణంలో నివేదిక అమలు ద్వారా 111 జీవో వచ్చిందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఐదుగురు ముఖ్యమంత్రులు మారినప్పటికీ రూ.లక్ష కోట్ల ఆదాయం ఊరిస్తున్నా ఈ దుస్సాహసానికి ఒడిగట్టలేదని గుర్తు చేశారు. 7 మండలాలు, 84 గ్రామాలు ప్రత్యక్షంగా మరో 36 గ్రామాలు పరోక్షకంగా 1,30,000 ఎకరాల భూమి పరిధిని నిర్దేశించిన ఈ జీవో ద్వారా 400 ఏండ్ల హైదరాబాదు వైభవాన్ని సురక్షితంతో సుఫలమైందని తెలిపారు. అలాంటి 111 జీవోను పరిరక్షించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి మాట్లాడుతూ ఈ జీవో ద్వారా హైదరాబాద్ పరిరక్షించబడ్డ వైనం తెలియజేస్తూ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఈ ప్రభుత్వం ఈ ఎత్తివేత నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం కేవలం అవినీతి కోసం రూ.లక్షల కోట్ల దోపిడీకి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వాధినేతలు, మంత్రులు ఐటీఐ పరిధిలో సొంత ఇండ్లు, ఫాం హౌస్ లు కట్టుకుని వరదలు వస్తే అధికారులను బెదిరించి తూములు వదులుతున్నారని తెలిపారు. ఈ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ, మల్లేష్, అంజి, సుధాకర్ ముదిరాజ్, అనంతయ్య, సతీష్, సత్తయ్య, హేమంత్, నాగ నగేష్, మోడీ రాందేవ్, భాస్కర్ ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందనీ, ఒక వైపు ప్రొఫెసర్ల రిక్రూట్మెంట్ లేదనీ, మరో వైపు విద్యార్థులను అన్యాయంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని ఓయూ పీహెచ్డీ విద్యార్థులు అన్నారు. ఇది ప్రభుత్వ విశ్వవిద్యాలయమా లేక ప్రైవేట్ విశ్వ విద్యాలయమా అని ప్రశ్నిస్తున్న విద్యార్థులను పోలీసు బలగాలతో అక్రమ అరెస్ట్ చేస్తున్నారనీ, విద్యార్థుల సమస్యలను వినకుండా అణచివేయడం కోసమే నవీన్ మిట్టల్‌ను ఈసీ మెంబెర్‌గా నియమించారన్నారు. ఇప్పటికీ అడ్మిషన్ పొంది 3 నెలలు అవుతున్నా హాస్టల్, మెస్ సౌకర్యం లేదన్నారు. వీసీ మొత్తంగా ప్రభుత్వ తొత్తుగా మారి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా అణచివేత చర్యలకు దిగుతున్నారన్నారు. ఈ అసమర్థ వీసీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌ను కేసీఆర్ ప్రగతి భవన్ లా మార్చారనీ, తక్షణమే తమ సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థుల సత్తా చూపిస్తామన్నారు. మొత్తం విద్యార్థి లోకాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసి అన్ని యూనివర్సిటీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తాం అన్నారు. పోలీసులు చర్యలకు కొంత మంది పరిశోధక విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఇన్ని రోజుల నుంచి విద్యార్థులు పోరాటం చేస్తున్నా స్పందించకుండా మౌనం వహిస్తూ వైస్ ఛాన్సలర్ చర్యలను సమర్థిస్తున్న యూనివర్శిటీ ప్రొఫెసర్లందరూ ఈ విషయం పైన స్పందించాలనీ, పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పరిశోధక విద్యార్థులు నెల్లి సత్య, అజాద్,అఖిల్, కిరణ్, మధు, ఉదయ్, ఆంజనేయులు, ప్రవీణ్, మహేష్, కురుమయ్య, మధు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఎలాంటి లోపాలు లేకుండా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గం నుంచి జరగబోయే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం ఫిల్మ్ నగర్ కల్చరల్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజలందరినీ భాగస్వామ్యం చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విస్తతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు తెలియజేయాలని కార్పొరేటర్లకు, డివిజన్ అధ్యక్షులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ అన్ని శాఖల అధికారులు డీఎంసీలు, పోలీస్‌శాఖ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, జలమండలి జీఎం, డీజీఎం, అధికారులు, విద్యుత్ ఏడీఈ, అధికారులు పాల్గొన్నారు.

4న సూర్యాపేటలో టీజేఎస్ మూడో ప్లీనరీ



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 4వ తేదీన సూర్యాపేటలో జరిగే తెలంగాణ జన సమితి మూడో ప్లీనరీని విజయవంతం చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థుల ఆత్మ బలిదానాలు, పోరాటాల వల్ల సాధించుకున్న తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనపై విసుగెత్తి నేడు తెలంగాణ ప్రజలు తెలంగాణను కేసీఆర్ నిరంకుశ, కుటుంబ పాలన నుంచి విముక్తి చేయాలనే భావనలో ఉన్నారని తెలిపారు. కేసీఆర్ కుటుంబ పాలన నుంచి విముక్తి కోసం మరో పోరాటం చేద్దామన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను మనమే కాపాడుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ఏర్పడిన టీజేఎస్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వీజేఎస్ నాయకులు నాగేష్, నరేందర్, కృష్ణ, రాము, బాలు, సతీష్, కిరణ్, అక్షయ్, ప్రవీణ, రేణుక, అనిత, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్ వైద్యుడికి రాష్ట్రీయ చికిత్సా రతన్ అవార్డు

నవతెలంగాణ-బంజారాహిల్స్



బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి ఆర్థో రొబోటిక్ సర్జన్ డాక్టర్ మనోజ్ కుమార్ గుడ్లూరు అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు. నేషనల్ అచీవర్స్ రికగ్నేజేషన్ ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన ఇండివిడ్యువల్ అచీవ్‌మెంట్స్, ఇంటలెక్చువల్ ఎక్సలెన్స్, నేషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మనోజ్ తెలంగాణ తరపున రాష్ట్రీయ చికిత్సా రతన్ అవార్డును విధాన సభ స్పీకర్ శ్రీరామ్ నివాస్ గోయెల్, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి రాజ్‌కుమార్ ఆనంద్, ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబేరాయ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 24 విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి ఈ పురస్కారాలు ప్రధానం చేశారని తెలిపారు. తాను 8 వేలకుపైగా శస్త్రచికిత్సలు చేయడంతో పాటు 600లకు పైగా క్లిష్టమైన శస్త్ర చికిత్సలను చేశానని తెలిపారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యను పెంచిందనీ, మరింత మందికి సేవలు అందించేందుకు ప్రోత్సహించిందని తెలిపారు.

'హిమాయత్‌నగర్‌లో అల్లరి మూకల బెడద'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హిమాయత్‌నగర్ డివిజన్‌లో సాయంత్రం, రాత్రి వేళల్లో అల్లరి మూకల బెడద ఎక్కువైందని డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ అన్నారు. గురువారం నారాయణగూడ సీఐ జి.శ్రీనివాసుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డివిజన్‌లో ఎక్కువగా విద్యా సంస్థలు, ఇనిస్టిట్యూట్స్, గర్ల్స్ హాస్టల్స్ ఉన్నందున, ముత్యాల బాగ్, రాజమహల్లా, మేల్కోటే పార్క్, స్ట్రీట్ నెంబర్. 4, 7 తదితర ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ఆమె పోలీసులను కోరారు. డివిజన్‌లో కొందరు అల్లరి మూకలు విద్యార్థినులు, అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తూ, వేధిస్తున్నారని చెప్పారు. అలాంటి వారిని పోలీసులు వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, నేతలు శారద, పద్మజ, పూజ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఎగ్జామ్స్ రద్దు చేయాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఆశా వర్కర్లకు ఎగ్జామ్ వెంటనే రద్దు చేయాలనీ, పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలనీ, ఆశా వర్కర్ల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రీన్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ గోషామహాల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోషామహల్ సీఐటీయూ జోన్ కన్వీనర్ కె జంగయ్య మాట్లాడుతూ రాష్టంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 32 ఏండ్లుగా, మైదాన ప్రాంతంలో 18 ఏండ్లుగా పని చేస్తున్నారని చెప్పారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందినారు, రిజిష్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులు ప్రజలకు అందజేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవ చేస్తున్నారు. ఇంత కష్టపడి పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జి.అండాలు, పి.చంద్రకళ, ఎండి పర్వీన, ఎస్.నాగమణి, ఎం.రజిని, ఈ.రేణుక, డి.పద్మ పాల్గొన్నారు.

నెరేళ్ల పద్మకు ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



నేరెళ్ల పద్మకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ వచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచీన భారతీయ చరిత్ర సంస్కృతి. పురావస్తు విభాగంలోని ప్రొఫసర్ ఎస్.ఆర్.గిరిధర్ పర్యవేక్షణలో నేరెళ్ల పద్మ " స్టడీ ఆఫ్ టెంపుల్స్ ఇన్ నిజామాబాద్ డిస్ట్రిక్ ఇన్ తెలంగాణ "అనే అంశంపై పరిశోధనా పత్రమును (పీహెచ్డీ), సమర్పించినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచీన భారతీయ చరిత్ర సంస్కృతి, పురావస్తు శాస్త్రం విభాగం నేరెళ్ల పద్మకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా నేరెళ్ల పద్మ మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎస్.ఆర్.గిరిధర్ రీసెర్చ్ గైడ్, సలహాలు సూచనలు మేరకు పరిశోధన సాగించినట్లు తెలిపారు. తనకి డాక్టరేట్ లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రొఫెసర్ ఎస్ ఆర్ గిరిధర్, స్నేహితులు, సీనియర్లు, యూనివర్శిటీ ప్రొఫెసర్స్‌కి ధన్యవాదాలు తెలిపారు. నెరెళ్ల పద్మను ప్రొఫెసర్లు, స్నేహితులు, స్వగ్రామం వారు అభినందించారు. అతి పేద కుటుంబంలో పుట్టిన పద్మ ఓయూలో డాక్టరేట్ పూర్తి చేయడం విశేషం.

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్‌గా పులిమామిడి నారాయణ



- పదవి స్వీకారానికి హాజరైన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-అడిక్‌మెట్

కార్మికశాఖ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా పులిమామిడి నారాయణ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పులిమామిడి నారాయణ హరి బాధ్యతలు స్వీకరించారు. హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఇతర రాష్ట్రాల కార్మికులు మన రాష్ట్రానికి వచ్చి పనులు చేసుకుంటున్నారని చెప్పారు. పనుల కోసం మన కార్మికులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం తప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి శ్యాంసుందర్ జాజు, కార్మిక శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖరం, జంట నగరాల జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మా డబ్బులు మాకిప్పించి.. న్యాయం చేయండి



- నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌కు క్యూ నెట్ బాధితుల జేఏసీ వినతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మోసపూరిత హామీలిచ్చి రూ.కోట్లు దోచుకున్న క్యూ నెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంపై నమోదు చేసిన కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని క్యూ నెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో క్యూ నెట్ బాధితులు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను గురువారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆర్థిక నేరాల సెల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని క్యూ నెట్ నిందితులను అరెస్ట్ చేయడం, రూ.54 కోట్ల బ్యాంకు ఖాతాలు స్తంభింప చేయడంపై కమిషనర్ సీవీ.ఆనంద్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. బాధితులు కన్నీరు మున్నీరై ఉద్యోగాల కోసం దాదాపు 300 మంది నిరుద్యోగులు అప్పులు చేసి క్యూ నెట్ సంస్థలో డిపాజిట్ చేశామనీ, తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలనీ కోరారు. కమిషనర్ సీవీ.ఆనంద్ స్పందించి దర్యాప్తును మరింత వేగవంతం చేసి, న్యాయం జరిగేలా చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, నేతలు జావేద్ షరీఫ్, టి.రాకేష్ సింగ్, బాధితులు దీపిక, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకులు చేరుతున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. అంబర్ పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బాగ్ అంబర్ పేట డివిజన్ సీఈ కాలనీకి చెందిన బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, సతీష్, శ్రీకర్‌తో పాటు 100 మంది వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధికి ప్రతి ఇంటికీ చేరుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో కూడా దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, పులిజాల గెల్వయ్య, కనివేట నర్సింగ్ రావు, రమేష్ నాయక్, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి ఏరియా హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు

- నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్
- వైద్యులకు ఎమ్మెల్యే అభినందనలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహరాజ్ అన్నారు. గురువారం నాంపల్లి ఏరియా హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్‌లోని వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌లో రోగులకు వైద్యులు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నారని చెప్పారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిహిల్స్ కార్పొరేటర్ ఆరిఫ్ రిజ్వాన్. నాంపల్లి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గిరిధర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ జుబైర్ హుస్సేయన్, డాక్టర్ అబ్దుల్ రావుఫ్, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్స్ డాక్టర్ అరుణ పద్మావతి, డాక్టర్ శ్రీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ స్నేహలత, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి ఎం.సదానంద్, వై.శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దక్షిణ భారతదేశం దగా

నవతెలంగాణ-ఓయూ

బీజేపీ పాలనలో అడుగడుగునా దగా పడుతున్న దక్షిణాదిపై కేటీఆర్ స్పందనను స్వాగతిస్తున్నానని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2026లో డీలిమిటేషన్ సందర్భంగా దక్షిణాదిలో పార్లమెంటు సీట్లు తగ్గుతాయన్న కేటీఆర్ ప్రకటన వాస్తవం అనీ, దేశ జనాభాలో సుమారు 25శాతం ఉన్న దక్షిణాది ప్రజలు 35శాతం దేశాభివృద్ధిలో తమ వాటా చెల్లిస్తుంటే 80 శాతం జనాభా గల ఉత్తరాది రాష్ట్రాలు కేవలం 40 శాతం కూడా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం లేదన్నారు. ఉత్తరాది రాజధాని ఢిల్లీకి కేటాయిస్తున్న నిధులు మొత్తం దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకు కేటాయిస్తున్న నిధులతో సమానమని తెలిపారు. హైదరాబాద్ దేశ రెండో రాజధానైతే ఢిల్లీతో సమానంగా దక్షిణాదికి నిధులు వస్తాయన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-మెహిదీపట్నం

గుడిమల్కాపూర్ బుడిగె జంగం బస్తీలో కొత్తగా ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేష్, బస్తీవాసులు శివటి సిద్దయ్య కడమంచి రామచందర్, కె.లక్ష్మణ్, వి.కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాలనీ రోడ్డులో మురుగు దుర్గంధం



నవతెలంగాణ - సంతోష్ నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ, సైదాబాద్ రోడ్ తిరుమల మొబైల్స్ వద్ద ప్రధాన రహదారిలో మురుగు రోడ్డు పక్కన మురుగు దుర్గంధం వెదజల్లోందని స్థానికులు వాపోతున్నారు. రెండేళ్లక్రితం ఏర్పాటు చేసిన రోడ్డు సమాంతరం లేక సామర్థ్యం సరిపోకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. మురుగు కారణంగా వాహనదారులు, పాదచారులు, బ్యాంకుకు వచ్చే లబ్దదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు గిరిజన బంధు ఇవ్వాలి



నవతెలంగాణ - చైతన్యపురి

అర్హులైన గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది. గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. గోపినాయక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మ నాయక్, ప్రదేశ్ ఎరుకుల సంఘం బి. రఘు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి, బంజారా భవనం ఓపెనింగ్ రోజు మీడియా ముందు సీఎం కేసీఆర్ గిరిజనులకు గిరిజన బంధు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పేదలు, గిరిజనులకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. బాలు నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆర్. రామవత్ పాండు నాయక్, వి.జగన్, కే.సువలి బాయి, ఎం. జానకి, కే బుజ్జి బాయి పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో శ్రేయస్సు హాస్పిటల్ ప్రారంభం



నవతెలంగాణ -వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్‌లోని హై కోర్ట్ కాలనీలో గురువారం శ్రేయస్సు హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులకు అతి చెరువులో హాస్పిటల్ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని హాస్పిటల్ ఫీజు పరిమితిలో ఉండే విధంగా, ప్రతి పేదవానికి కూడా ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం అందేలా చూడాలని హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, పాండాల శ్రీధర్, బీజేపీ నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర గిరిజన విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు కే.బహుగుణ నాయక్ హెచ్చరించారు. బీఎస్పీ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ మేయర్‌కు అవకాశ వాద రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేసిన సమయంలో డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ దాడిని ఖండించిన విషయాన్ని మర్చిపోయారని గుర్తు చేశారు. ఒక పార్టీలో విజయం సాధించి అధికారం కోసం పార్టీ మారితే అది అవకాశ వాద రాజకీయాలు అవుతాయని చెప్పారు. గతంలో మా నాయకుడి సహకారంతోనే ఎంఐఎంతో కలిసి రాజకీయ పదవులు పొందిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రోటోకాల్ విషయంలో సమస్యను పరిష్కారం చేయటానికి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సహకారంతో అణగారిన వర్గాల ప్రజలకు న్యాయం చేయడం, అభివృద్ధి కోసం ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీని ఎందుకు విమర్శించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు లోపాయకారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీలోకి రాని సమయంలోనే డిప్యూటీ మేయర్ పదవిలో ఉన్నారన్నారు. ఒక దళితుడు డిప్యూటీ మేయర్ పదవిలో ఉంటే ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీ.హెచ్. నర్సింహా, బాబురావు, సంజీవ, కర్రే.పవన్, రజినీకాంత్, చిర్ర సాయి, ఇబ్రాం యాదయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

'అన్యాయంపై ప్రశ్నిస్తే ఆరోపణలా..'



నవతెలంగాణ-హయత్ నగర్

ఎమ్మెల్యే అండతో చెరువు స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారా లేదా అని మన్సూరాబాద్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ ప్రశ్నించారు. డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కబ్జాలు, అవినీతిపై బీఆర్ఎస్ నేతలను ప్రశ్నిస్తే తిరిగి మన్సూరాబాద్ కార్పొరేటర్ పై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తులు వ్యక్తిగత ఆరోపణలు చేయడమేంటని మండిపడ్డారు. చిన్న చెరువు కబ్జా వైనం గురించి అధికారుల దృష్టికి తీసుకుపోగా దానిని రీ సర్వే చేయమని రిపోర్ట్ చేశారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను రానివ్వట్లేదనే విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. స్థాయి మరచి చిన్న, పెద్ద లేకుండా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే కబడ్దార్ అని హెచ్చరించారు. మేము కూడా వ్యక్తిగత దూషణలు చేస్తే మోహం ఎక్కడ పెట్టుకుంటారని మండి పడ్డారు. ఎమ్మెల్యే బస్తీ నిద్రలో భాగంగా సమస్యలుంటే పరిష్కరిస్తానని తిరగడమేంటని, ఇప్పుడు అవి గుర్తుకు వస్తున్నాయా..ప్రజల బాధలు, పక్కనే హత్తిగూడ చెరువు కబ్జా అవుతుంటే వెళ్లి ఎందుకు ఆ స్థలాన్ని పరిశీలించలేదని ప్రశ్నించారు. స్థానిక కార్పొరేటర్లపై దుష్ప్రచారం చేస్తున్న విషయం నిజం కాదా? కార్పొరేటర్ల వెంట అధికారులు తిరిగితే ఎన్ని రకాలుగా మానసికంగా ఎమ్మెల్యే వేధిస్తున్నాడో వారు చెప్పడం లేదా అని గుర్తు చేశారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు కేవలం జీహెచ్ఎంసీ నిధులు మాత్రమేనని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి కొండల్ రెడ్డి, యంజాల జగన్, పాతూరి శ్రీధర్ గౌడ్, పోరెడ్డి కవిత, కడారి యాదగిరి, కోటయ్య, చింటు, పారంద సాయి, రమేష్ చారీ, చిన్న రామస్వామి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ, బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్ లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో చేపడుతున్న సీసీ నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ గౌర రమాదేవి శ్రీనివాస్, డీఈఈ అశోక్‌తో కలిసి మేయర్ పరిశీలించి మాట్లాడారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణతో ప్రజలకు నిరంతరం భరోసా

- నగర సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక ప్రణాళికతో నగరం ప్రశాంతం
- సిటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎన్.శంకర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపుతో ప్రజలకు నిరంతరం భరోసా కల్పిస్తున్న పోలీస్‌శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సిటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్. శంకర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. 'పోలీస్ ఉద్యోగం అంటేనే రిస్క్‌తో కూడుకుంది. బందోబస్తులు, శాంతి భద్ర తల పర్యవేక్షణలో ఎప్పుడు ఎక్కడ విధులు నిర్వహిస్తారో తెలియదు. ఇక హైదరాబాద్ నగరంలో విధులు నిర్వహించాలంటే కత్తిమీద సాములాంటిది. నగరంలో నిత్యం వీవీఐపీల మూమెంట్, ధర్నాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు అధికం. దీనికితోడు పండుగలు, శోభయాత్రలతోపాటు ఇతర ఈవెంట్స్‌కు భద్రతా చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. అన్ని అంశాల్లో జాగ్రత్తగా ఉంటూ ప్రశాంతవాతావరణంలో అన్నిటిని పూర్తి చేసేందుకు ఎంతో కృషి అవసరం. అది మా సార్ సీవీ ఆనంద్ గారికి ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటుచేసుకోకుండా సీపీ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటారు. నగరంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నారు. అయితే నేరస్తులతో ఫ్రెండ్లీ కాదు, ఫిర్యాదు దారులు, బాధితులు, నగర వాసులతో ఫ్రెండ్లీగా ఉండాలని సీపీ క్షేత్రస్థాయిలో ఆదేశాలించారు. విధుల్లో ప్రతిభకనబరుస్తున్న పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డులు, ప్రోత్సాహ కాలు అందిస్తున్నారు. సిబ్బందిని ఆరోగ్యంగా ఉంచేందుకు 'ఫిట్ క్యాప్'ను ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి ఆహార అలవాట్లలో మార్పుతోపాటు ఫిజికల్ యాక్టివిటీ ఉండాలని ప్రతి పోలీస్‌స్టేషన్లలో ఫిజికల్ యాక్టివిటీని మెరుగు పర్చారు. ఒక్కసారీ ఫిట్ క్యాప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే అదే మానిటరింగ్ చేస్తుంది.

'దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం'



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం అని బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లో ఆయన మీడియాతో గురువారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాటమే కాదు సాధించిన తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. నేడు దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ అభివృద్ధి పటాన్ని భారత దేశ చిత్ర పటంలో నిలిపిన అభివృద్ధి ప్రదాత కేసీఆర్ అన్నారు. నేడు దేశం లోని మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని అభివృద్ధి కేవలం తెలంగాణలో మాత్రమే సాధ్యమైంది అంటే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్ కు ఉన్న చిత్తశుద్ధి ఎంటో అర్థం చేసుకోవాలని అన్నారు. మన రాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం కావొస్తోన్న సంద ర్భంగా సీఎం పిలుపు మేరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పో రేషన్ పరిధిలోని 28 డివిజన్లలో జూన్ 2 నుండి 22 వర కు అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు అట్టహాసంగా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ప్రజలంతా భాగస్వామ్యం అయ్యేలా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.

సీఎం కేసీఆర్ తెలంగాణ వైతాళికుడు

- నాడు ఏడు గంటలే.. నేడు 24 గంటలూ విద్యుత్
- అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ
- ఆరున్నర దశాబ్దాల అనచివేతకు... తొమ్మిదేండ్ల పరిపాలనే సమాధానం
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో... సహేతుకమని చాటిచెప్పేలా దశాబ్ది ఉత్సవాలు
- మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

(ఎల్లయ్య కల్మూరి)
నవతెలంగాణ-బోడుప్పల్

సీఎం కేసీఆర్ తెలంగాణ వైతాళికుడని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాలలో ఉమ్మడి పాలకుల దోపిడీపై యావత్తు తెలంగాణను మేల్కొలిపిన పోరాట ఫలితమే నేటి బంగారు తెలంగాణ అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో దశాబ్దన్నర పాటు పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అభివృద్ధిలో దేశానికే ఓ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతున్నారని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ 2023 జూన్ 2వ తేదీతో తొమ్మిదేండ్ల స్వపరిపాలనను పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన దశాబ్ధి ఉత్సవాల నిర్వహణపై నవ తెలంగాణతో మాట్లాడిన పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే...

స్వరాష్ట్ర కాంక్షకు ఊపిరిపోశారు...

ప్రత్యేక తెలంగాణ కోసం గతంలో అనేక పోరాటాలు జరిగినా అవి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు కొనసాగలేదు. తత్ఫలితంగా తెలంగాణ ఆరున్నర దశాబ్దాలపాటు అనచివేతకు గురైంది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో అప్రటికత విద్యుత్ కోతలతో వ్యవసాయం కునారిల్లింది. నీళ్లు, నిధులు, నియామకాలలో వివక్ష చూపారు. వెరసి తెలంగాణ వ్యాప్తంగా కరువు వ్యాపించింది. పొట్టపోసుకునేందుకు అనేక మంది తెలంగాణ యువత సౌది వంటి దేశాలకు, ముంబాయి లాంటి పట్టణాలకు వలస పోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే 2001 ఏప్రిల్ 27వ తేదీన తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షకు మళ్లీ ఊపిరిపోశారు. సుమారు దశాబ్దన్నర కాలం పాటు కేసీఆర్ సారథ్యంలో నిర్విరామంగా సాగిన పోరాట ఫలితం కారణంగా 2014, జూన్ 2న భారతదేశ 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది.



ఉద్యమ సారథికే ప్రజల పట్టాభిషేకం...

తెలంగాణ ఉద్యమాన్ని గాంధేయ మార్గంలో నడిపించిన ఉద్యమ సారథినే పరిపాలకుడిగా తెలంగాణ ప్రజలు పట్టాభిషేకం చేశారు. ప్రజల మద్దతును సమీకరించి మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. నాటి నుంచి నేటి వరకు అంటే సుమారు 9 యేండ్లుగా తెలంగాణ పునర్నిర్మాణంలో బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్నారు. కేసీఆర్ పాలనలో సమ్మిళిత అభివృద్ధి, సకల సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పారిశ్రామికావృద్ధిలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పెట్టుబడులు, ఆర్థిక అవకాశాలకు గమ్య స్థానంగా తెలంగాణ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్నది. ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టడంతో తెలంగాణ నలు దిక్కులా అభివృద్ధి విస్తరించింది.

పసిడి పంటలకు నెలవుగా...

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కరువు నేలగా ముద్రపడింది. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పసిడి పంటలు పండుతున్నాయి. తెలంగాణ నేడు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా మారింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ప్రాముఖ్యాన్ని గుర్తించిన కేసీఆర్ వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు. రైతు కేంద్రీకృతంగా దేశంలో మరెక్కడా లేని విధంగా రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు వంటి పథకాలను అమలుచేసి వ్యవసాయరంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారు. అలాగే జల వనరుల నిర్వహణ, నీటిపారుదల ప్రాజెక్టులు, రైతు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రం మెరుగైన వ్యవసాయ ఉత్పాదకతను సాధించింది. ఇది గ్రామీణ జీవనోపాధిని ఎంతగానో మెరుగుపరిచింది. మిషన్ కాకతీయ కార్యక్రమం, నీటి సంరక్షణ, భూగర్భ జలాల సమృద్ధికి సహాయ పడింది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ తో పాటు అనేక భారీ ప్రాజెక్టులు చేపట్టడంతో వ్యవసాయ ఉత్పత్తుల్లో తెలంగాణలో గణనీయమైన మార్పు వచ్చింది. కాకతీయుల నాటి గొలుసుకట్టు నీటి వనరులైన నీటి కుంటలు, చెరువులు పూర్వవైభవాన్ని సంతరించుకున్నాయి. కాళేశ్వరానికి గానీ, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గానీ కేంద్ర ప్రభుత్వం జాతీయ హెూదాను ఇవ్వలేదు. అలాగే ప్రతి పౌరుడికి రక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో మిషన్ భగీరథ పథకంలో భాగంగా తెలంగాణలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన గోదావరి, కృష్ణ జలాలను అందిస్తుంది.

విద్యకు ప్రాధాన్యత...

తెలంగాణలో 100శాతం అక్షరాస్యత నమోదు చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో భాగంగా వందల సంఖ్యలో గురుకుల విద్యాలయాలను స్థాపించారు. 'మన ఊరు-మన బడి' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఉన్నత విద్య కోసం అనేక కొత్త కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వృత్తి శిక్షణ కోర్సులను రూపక ల్పన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 75 ఏండ్లలో 3 వైద్య కళాశాలలు ఏర్పాటైతే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేవలం 7 ఏండ్ల వ్యవధిలోనే ఏకంగా 33 వైద్యకళాశాలలు ఏర్పాటు చేస్తున్న ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానిది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా, తెలంగాణలో జిల్లాకు ఒకటి చొప్పున 33 ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రాబోతున్నాయి.

సింగిల్ విండో క్లియరెన్స్...

పారిశ్రామిక అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిం పారిశ్రామిక వృద్ధికి నాంది పలికారు. అలాగే పెట్టుబడులకు అనువైన వసతులను కల్పిస్తుండటం వలన నేడు విదేశీ బహులజాతీ పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులను పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. 2013-14లో అంటే రాష్ట్రం ఏర్పడటానికి ముందు రూ.5.05లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థూల ఉత్పత్తి ప్రస్తుతం 13.27 లక్షల కోట్లకు చేరింది. అలాగే తెలంగాణ జీఎస్‌డీపీ సగటు వార్షిక వృద్ధిరేటు 8.6శాతం ఉంది. 2014లో రాష్ట్ర తలసరి ఆదాయం 1,24,104 ఉండగా, నేడు 3,08,732తో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఈ లెక్కలన్నీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు కావు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలే.



ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ...

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ భారతదేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా అభివర్ణించారు. కానీ ప్రధాని నరేంద్రమోదీ తీరు పార్లమెం టరీ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్నారు. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాలను తమ భవిష్యత్‌ను తాము నిర్ణయించుకునేలా ప్రోత్సహించాలి. కానీ నేడు దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై కర్ర పెత్తానం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుంది.

తెలంగాణ గర్వించేలా...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని చాటిచెప్తూ యావత్తు తెలంగాణ గర్వించేలా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నం. అలాగే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ సహేతుకం అని ఇప్పటికే అనేక రంగాల్లో నిరూపితమైంది. అందుక్కారణం...కేసీఆర్ రాజకీయ చతురత, సుస్థిర పరిపాలనా విధానం, ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయి. అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల గోసను దశాబ్దకాలంలో తీర్చిన కేసీఆర్ చిత్తశుద్ధి, ధృడసంకల్పం స్వర్ణ తెలంగాణ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 21 రోజుల పాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ ఉత్సవాలలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేస్తారని ఆకాంక్షిస్తున్నా...


అర్హులకు 'గిరిజన బంధు' ఇవ్వాలి



నవతెలంగాణ- సంతోష్ నగర్

అర్హులైన గిరిజనులకు 'గిరిజన బంధు' ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సంఘం, ప్రదేశ్ ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఖాజాబాగ్ కాలనీలో గురువారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి రాష్ట్ర ఎం. బాలు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ధర్మానాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘులు మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజన భవన్‌ను ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రంలో గిరిజనులకు కూడా 'గిరిజన బంధు' ఇస్తానని ప్రకటించి ఏడాది అవుతున్నా ఇప్పటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలో ఉన్న గిరిజనులకు సొంత ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైదాబాద్ డివిజన్ ఖాజాబాగ్ గిరిజన కాలనీలో వారానికి ఒకసారి నల్లానీళ్లు వస్తున్నాయని.. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు రామావత్ పాండునాయక్, రాజు, బిచ్య, రమేష్, రాష్ట్ర గిరిజన మీడియా ఇంచార్జ్ జర్నలిస్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-హయత్ నగర్

బావిలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం 24 గంటల తర్వాత లభ్యమైంది. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్‌నగర్ ఎన్‌టీఆర్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న అబ్దుల్ రజాక్(30) హయత్ నగర్‌లోని పెద్ద మసీదు వెనుక ఉన్న సీతారాం బావిలో బుధవారం ఈతకెళ్లిన విషయం తెలిసిందే..ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు, హయత్ నగర్ పోలీసులు కలిసి ఆ యువకుడి మృతదేహాన్ని వెతికారు. 24 గంటల తర్వాత ఆ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

'పౌష్టికాహారంతో రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు'



నవతెలంగాణ - సంతోష్ నగర్

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చునని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని మూడు గుళ్ళ, కురుమ బస్తీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంగన్ వాడీ సెంటర్లో అందించే పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బియ్యం, పప్పులు, తల్లులకు అందజేసినట్లు తెలిపారు. క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్య రుగ్మతలు నుండి బయటపడవచ్చు అని సూచించారు. అనంతరం కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ ఆయా ఎల్లమ్మ మంజులతా రెడ్డి, లావణ్య దశరథ లక్ష్మి, పావని సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహిద్దాం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లెలగూడలోని ఓ కన్వెన్షన్ హాల్లో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ముఖ్య నాయకులు చొరవ తీసుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రభుత్వం సూచించిన క్యాలెండర్ ప్రకారం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పండుగ వాతావరణంలో ఈ ఉత్సవాలను 20 రోజుల పాటు ఊరూరా పండుగలాగా నిర్వహించాలని కోరారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని..ఒక్కో రంగంలో సాధించిన ప్రగతిని గ్రామ గ్రామన ప్రజలకు వివరించి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ నాయకత్వంలో 9 ఏళ్లలోనే ఎన్నో అద్భుతాలు సృష్టించిందని పేర్కొన్నారు. జూన్ 2న అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ నివాళులు అర్పిస్తూ ప్రారంభం అయ్యే ఉత్సవాలు జూన్ 22 అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం అవిష్కరణతో ముగిస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరొక్కసారి గుర్తు చేసూ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మన ఊరు మన బడి కింద పాఠశాలల్లో వచ్చిన మార్పును నాడు-నేడు ఫొటోలతో ప్రదర్శించాలని, వివిధ చోట్ల వచ్చిన ప్రభుత్వ డిగ్రీ, ఇతర కళాశాలలు, గురుకుల, సంక్షేమ ఇతర పాఠశాలల వివరాలు తెలియజేయాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్ధంగా ఉన్న మన ఊరు మన బడి పాఠశాలల ప్రారంభోత్సవాలు, రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల గ్రంథాలయాలు, 1600 డిజిటల్ క్లాస్ రూములను ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జూన్ 20న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డ్రెస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరనాథ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మీర్ పేట్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్‌లో సత్తా చాటిన చెరుకూరి కీర్తి ఆనంద్




నవతెలంగాణ- చైతన్యపురి

సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన జిమ్నా స్టిక్ టేబుల్ వాల్ట్, అనివెన్ బార్ మహిళా విభాగంలో కీర్తి ఆనంద్ ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించింది. వీటితో పాటు రూ. 30 వేల నగదును కూడా అందుకుంది. ఈ సందర్భంగా కీర్తి ఆనంద్ మాట్లాడుతూ కోచ్ స్వర్ణలత సహకారం, శ్రీ చైతన్య కళాశాల ప్రోత్సాహంతో ఈ పోటీల్లో రాణించినట్లు సంతోషం వ్యక్తం చేశారు.

రాంగ్ కాల్‌తో కనెక్ట్ అయ్యారు

- ఇద్దరూ ప్రాణాలు పోగొట్టుకున్నారు
- రాచకొండ కమిషనర్



నవతెలంగాణ-హయత్ నగర్

ఓ రాంగ్ కాల్‌తో 45ఏండ్ల మహిళ, 25 ఏండ్ల యువకుడు గాఢంగా ప్రేమించుకున్నారు. మహిళ ఇంట్లో ప్రేమ విషయం తెలియడంతో ఒకరు ఆత్మహత్యకు యత్నించగా.. మరో 2 రోజుల తర్వాత యువకుడి మృత దేహం లభ్యం కావడంతో హయత్ నగర్‌లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహన్ కేస్ వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లాకు చెందిన రాజేష్(25) బీటెక్ పూర్తి చేసి నగరంలో స్నేహితుడి గదిలో ఉంటున్నాడు. అతనికి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ కాలనీ రోడ్ నెంబర్ 5 లో నివాసం ఉంటున్న సుజాత వృత్తి రీత్యా ప్రభుత్వ టీచర్. ఓ రోజు అనుకోకుండా రాజేష్ ఫోన్‌కు రాంగ్ కాల్ రావడంతో వారిద్దరి మధ్య కొంత కాలంగా ప్రేమ వ్యవహారం సాగింది. గత 24న పురుగుల మందు తాగిన సుజాతను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలియక ఆమె ఇంటి చుట్టూ రోజు తిరుగుతున్నాడు. తన తల్లి ఫోన్ చూసి మరుసటి రోజు రాజేష్‌ను సుజాత కొడుకు జయ చంద్ర, అతని స్నేహితులు దండించారని, ఆ మరుసటి రోజు నుండి రాజేష్ కనిపించక పోవడంతో గత నెల 29న కుంట్లూర్ సమీపంలోని డాక్టర్స్ కాలనీలో శవమై కనిపించాడు. తర్వాత అతని మృతదేహం పోస్ట్ మార్టంకు సహకరించక పోవడంతో అతని విసర ను ఫోరెన్సిక్ రిపోర్ట్ కు పంపాక పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడిస్తామని సీపీ తెలిపారు. ఆయన వెంట ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ వనస్థలి పురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

- కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

డివిజన్ ప్రజల భాగస్వామ్యంతోనే ప్రతి ప్రాంతంలో అభివృద్ధి సాధ్య పడుతుందని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం గాజుల రామారం సర్కిల్, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్ పూరి కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు రూ .17 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను స్థానిక బస్తీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం సంజయ్ పూరి కాలనీలో నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ వారు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూడల పాపయ్య గౌడ్, చుండూరు దాసు, నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎన్ .కృష్ణ, కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రాము, అరుణ్ రెడ్డి, కిరణ్ ,షౌకత్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ఈనెల 4 న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పట్టణ ప్రాంతంలో జరగబోయే సీపీఐ ప్రజా గర్జనను విజయవంతం చేయాలని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు ఉజ్జిని హరినాధరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయ ఆవరణలో సీపీఐ కార్యకర్తలతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఉండగడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో భాగంగా ఇంటింటికి సీపీఐ మహాసభలని తలపెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వంగాల శ్రీనివాస్, నాయకులు మహేందర్ ,జార్జ్ ,హరీష్ రెడ్డి, వీరన్న, రాజిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శాంతి భద్రతలు భేష్

- దేశానికే తెలంగాణ పోలీస్ నెంబర్ వన్

అత్యంత వేగంగా కాస్మోపాలిటన్ నగరంగా పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధన్యాతనిచ్చింది. పెరుగుతున్న జనాభా, నేరాలు, సైబర్ క్రైమ్ వంటి సాంకేతికతో ముడిపడి ఉన్న నేరాల వంటి సవాళ్ళను ఎదుర్కునేందుకు తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధమై ఉంది. ఏ మూలన ఏం జరిగినా డేగ కళ్ళతో పర్యవేక్షించే వ్యవస్థ నేడు మన సొంతం. నేరస్తులు ఏ మూలన దాగినా సకాలంలో వాళ్ళను పట్టుకోవడంలో తెలంగాణ రాష్ట్ర పోలీసుల దేశవ్యాప్తంగా ఖ్యాతిని గడించారు.

ఒకే గొడుకు కింద సేవలు.... కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్

దేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడుకున్న మొదటి పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను హైదరాబాద్‌లో నిర్మించింది. అన్ని సేవలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేందుకు బంజారాహిల్స్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పోలీస్ ట్విన్‌టవర్స్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ 2022 ఆగష్టు4 ప్రారంభించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో లక్ష కెమెరాల ఫుటేజీని ఒక్క నిమిషంలోనే పరిశీలించే ఆధునిక పరికరాలు, పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీటీవీ కెమెరా దశ్యాలైనా సరే హైదరాబాద్‌లో ఉన్న ఈ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించవచ్చు. అత్యవసర సేవలు, సమావేశాల దష్ట్యా అన్నిశాఖల సమన్వయం చేసుకోవడం కోసం కూడా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

పోలీస్ రిక్రూట్ మెంట్

గత ఏడు సంవత్సరాల్లో 28,277 మంది పోలీస్ సిబ్బందిని ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో పాటు అదనంగా 17,516 పోలీస్ సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్లను ప్రభుత్వం జారీ చేసింది.

మహిళలకు అండగా షీ టీమ్స్

పోకిరీలు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేస్తూ మహిళలకు అండగా షీ టీమ్స్ నిలుస్తున్నాయి. 2014 అక్టోబర్ 24న షీ టీములను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మహిళలు, యువతులు, విద్యార్థినులను రక్షించడం, వారి భద్రతకు ఈ బందాలను ఏర్పాటుచేసింది. షీ టీమ్స్ మహిళల గౌరవాన్ని, హక్కులను కాపాడుతున్నాయి. షీ టీమ్స్ సభ్యులైన పోలీసులు కాలేజీల్లోనూ, బస్టాండ్‌ల్లోనూ, రద్దీ ఉన్న ప్రదేశాలలో మఫ్టీలో సంచరిస్తారు. నగర కమిషనరేట్ పరిధిలో ప్రవేశపెట్టిన షీ టీం



ప్రయోగం సక్సెస్ కావడంతో తెలంగాణవ్యాప్తంగా ప్రభుత్వం షీ టీంలను రంగంలోకి తీసుకువచ్చింది. తెలంగాణను ఆదర్శంగా తీసుకొని చాలా రాష్ట్రాలు 'షీ టీమ్స్' ప్రవేశపెడుతున్నాయి. వేధింపులకు గురవుతున్న మహిళలు డయల్ 100కు ఫోన్ చేసి కానీ, ఈ మెయిల్, ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సాప్, హాక్ ఐ మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందిస్తున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే షీ టీమ్స్ స్పందిస్తున్నాయి.

భరోసా కేంద్రాలు

వేధింపులకు గురైన మహిళలు, పిల్లల సమస్యల్ని పరిష్కరించి, వారికి భద్రత కల్పించడానికి ప్రభుత్వం భరోసా కేంద్రాన్ని నగరంలో 2016, మేలో ప్రారంభించింది. ఈ సెంటర్ బాధితులకు న్యాయం చేకూర్చడంతో పాటు, వారికి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే, న్యాయం కోసం బాధితులు వివిధ ఏజెన్సీల చుట్టూ తిరుగకుండా ఒకే వేదికపైకి తెచ్చి సత్వర న్యాయం అందిస్తున్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. బాధితులను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సైకాలజిస్టులు, లీగల్ కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

గ్యాంబ్లింగ్ సెంటర్లు, పేకాట క్లబ్బుల మూసివేత

ఉమ్మడి పాలనలో పేకాట క్లబ్బులకు బానిసలుగా మారిన అనేక నిరుపేదల కుటుంబాల జీవితాలు దుర్భరంగా వుండేవి. ఈ విషయాన్ని సీరియస్ గా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం పేకాట క్లబ్బులను మూసివేసింది. అయితే ఆన్‌లైన్‌లో గేమింగ్, గ్యాంబ్లింగ్ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో రమ్మీ, పేకాట ఆడటాన్ని నిషేధించాలని 2017 జూన్17న కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు గ్యాంబ్లింగ్, గేమింగ్ చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొ చ్చారు. అప్పటినుంచి తెలంగాణలో ఆన్‌లైన్ పేకాట ఆడటం సైతం రద్దయ్యింది.

సీసీ కెమెరాల ఏర్పాటు

తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల్లో శాంతి భద్రతలను పటిష్ఠ పరిచేందుకు సీసీ కెమెరాలను మే 2023 నాటికి రాష్ట్రంలో మొత్తం 10 లక్షల 66 వేల 792 సీసీ కెమెరాలను వినియోగిస్తున్నారు. ప్రతీ వెయ్యి మంది పౌరులకు 30 క్లోజ్డ్ సర్క్యూట్ టీవీ (సీసీటీవీ) సర్వైలెన్స్ అందుబాటులోకి తేవడం ద్వారా దేశంలోనే తెలంగాణ రాజధాని టాప్ ప్లేస్‌లో నిలిచింది, ప్రపంచంలో 16వ స్థానం పొందింది.

1) బాక్స్

తెలంగాణలోని హైదరాబాదు నగరంలో స్థానిక చట్టాన్ని అమలుచేసే ఓ ప్రత్యేక సంస్థ ఉండేది. ఇది నగర పోలీసు కమిషనర్ లేదా కొత్వాల్ నేతత్వంలో ఉంటుంది. 1847, మార్చి 28న హైదరాబాద్ రాష్ట్రంలో ఈ సంస్థ స్థాపించబడింది. హైదరాబాదు నిజాం రాజు హైదరాబాద్ సివిల్ సర్వీస్ అధికార హోదాలో ఉన్న పోలీసు కమిషనర్లను నియమించేవాడు. పరిపాలన విషయాలకు సంబంధించినంత వరకు పోలీసు కమిషనర్ హోంశాఖ పరిధిలో ఉండేవాడు. హైదరాబాదు నగరంలో జరిగే వివిధ విషయాలపై నేరుగా ఈ పోలీసు అధికారులు నిజాంకు వివరించేవారు. పోలీసు కమిషనర్‌ను "కొత్వాల్" అని పిలుస్తారు. శాంతిభద్రతల నిర్వహణ, నేరాలను గుర్తించడం, అరికట్టడం మొదలైన వాటికి బాధ్యత వహించేవారు. అయితే జనాభా వేగంగా పెరుగుతుండడంతో నేరాలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. దాన్ని దష్టిలో ఉంచుకొని 1981లో నగర పోలీసు వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేశారు.

2)బాక్స్

తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు బహుముఖ వ్యూహాలను అమలు చేస్తున్నారు. 8 ఏండ్లలో ఎంతో అభివృద్ధి చేశారు. హైదరాబాద్ నగరం మౌలిక వసతుల కల్పన, శాంతి భద్రతల పరిరక్షణ, సుస్థిర పాలనతో ముందుకు దూసుకెళుతున్నది. మెరుగైన ప్రజా రవాణా కోసం హైదరాబాద్‌లో ఎన్నో అద్భుత ప్రాజెక్టులు చేపట్టి నిర్మాణాత్మకమైన అభివద్ధి సాధించింది. ఇపుడు తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నది.



బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బస్తీల్లో మెరుగైన సౌకర్యాలు



- ఎమ్మెల్యే వివేకానంద
- జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీ హిల్స్ ఏ, బీలలో పాదయాత్ర
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజల సహాయ సహకారాలతో బస్తీల్లో మెరుగైన సౌకర్యాలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని షిర్డీ హిల్స్-ఏ, బి ,లలో ప్రగతి యాత్ర'లో భాగంగా గురువారం 74వ రోజు ఎమ్మెల్యే బస్తీ వాసులు, నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ, పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మిగిలి ఉన్న పనులు తెలుసుకొని అక్కడే ఉన్న అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటిపై చర్యలు తీసుకొని వేగంగా శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. అదే విధంగా షిర్డీ హిల్స్-బిలో ఎస్.డి.ఎఫ్ నిధులతో నూతనంగా చేపడుతున్న కమిటీ హాల్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. బుద్ధ భవన్ కంపౌండ్ వాల్ పనులకు, సంజయ్ పురి కాలనీలో భూగర్భడ్రైనేజీ పనులకు ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో గుర్తించని అనేక బస్తీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్తీల రూపు రేఖలు మారాయన్నారు. ప్రజల సౌకర్యాల కల్పనకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, ఓరుగంటి కృష్ణ గౌడ్, నల్ల గోపుల బాబు గౌడ్, వేణు యాదవ్, గుజ్జుల పాపిరెడ్డి, బండ మహేందర్, చుండూరుదాసు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తూ, పనులు వేగవంతం చేయాలి

- ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలోని న్యూ హెచ్ఐజి మార్కెట్ రోడ్డు లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. ఈ సంధ్బంగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ హెచ్ఐజి మార్కెట్ రోడ్డు నిర్మాణం నిమిత్తం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని కోరగా రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో కోట్ల రూపాయల వ్యయంతో ఫతేనగర్ డివిజన్ లో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని డివిజన్ కార్పొరేటర్ స్థానికులకు తెలియజేశారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానిక నాయకులతో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నాలా రిటైనింగ్ వాల్, కమ్యూనిటీ హాల్ పునరు ద్ధరణ పనులును కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా దీనిపై స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఎమ్మెల్యేతో చర్చించి పనులు త్వరితగతిన ప్రారంభమ య్యేలా చూస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయుడు, సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కిరణ్ రంబద్రి, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు కృషి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఇందిరానగర్ పారిశ్రామిక వాడలో ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలసి అవుల రవీందర్ రెడ్డి పాదయాత్ర చేశారు. ప్రజలు త్రాగు నీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. నెల గడువులోనే పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇందిరానగర్ ప్రాంతంలో నిరుపేదలు నివాస ముంటున్నారు. కానీ ఇంతవరకు వారిని పట్టించుకున్న నాధుడే లేడన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ వారి సమస్యలను గుర్తించి అడిగిన వెంటనే ఈ ప్రాంతానికి రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిని పూర్తి చేసేందుకు, పాదయాత్ర నిర్వహించామని తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకుందాం

- కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్

నవతెలంగాణ-బాలానగర్



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను డివిజన్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, సంబందిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయ వంతంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్పొరేటర్ బీఆర్ఎస్ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు వివరించు కోవాల్సిన తీరు తెన్నులను ఆయన వివరించారు. నేటి నుండి 22వ తేదీ వరకు రోజు వారీగా చేసుకోవాల్సిన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ప్రతి సంక్షేమ పథకం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధిని చూసి దేశ విదేశాల నాయకులు ప్రశంసలతో ముంచెత్తు తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శి ఇర్ఫాన్, ఉత్సవాల వివరాలను కార్యకర్తలకు కార్పొరేటర్ నర్సింహ యాదవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఖాదీర్, జహంగీర్, మట్టి శ్రీను, రాజుగౌడ్, పోచయ్య లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిలుక రాందాస్

నవతెలంగాణ-బాలానగర్



బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (హెచ్ఏఎల్ టీ) అధ్యక్షుడిగా చిలుక రాందాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల మాజీ అధ్యక్షుడు అజయ్ కుమార్ ముదిరాజ్ అధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత కార్యవర్గాన్ని రద్దు చేసి, కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిలుక రాందాస్ పేరును అజయ్ కుమార్ ముదిరాజ్ ప్రతిపాదించగా, తాజా మాజీ ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ బలపర్చగా, మిగతా కార్యవర్గ సభ్యులు ఆమోదం తెలపడంతో అధ్యక్షుడిగా ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. అనంతరం ప్రధాన కార్యదర్శిగా క్రాంతి కుమార్, కోశాధికారిగా సంతోష్ కుమార్ సైతం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. హెచ్ఏఎల్‌టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన చిలుక రాందాస్ మాట్లాడుతూ గత పద్నాలుగు సంవత్సరాల క్రితం తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా, తెలంగాణ ఉద్యమ శిఖరం కేసీఆర్ కు మద్దతుగా తెలంగాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా హెచ్ఏఎల్ తెలంగాణ ఎంప్లాంయస్ అసోసియేషన్‌ను స్థాపించామని తెలిపారు. ఇందుకు నాటి తెలంగాణ ఉద్యమ నాయకుడు, ప్రస్తుత బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నివిధాలా సహకరించి ముందుండి నడిపించారని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో దశాబ్ద కాలం తర్వాత తిరిగి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. హెచ్ఏఎల్ టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేసి, పూర్వవైభవాన్ని తీసుకువస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్ కుమార్ ముదిరాజ్, మహేష్ గౌడ్, నాయకులు అనిల్ కుమార్, లక్ష్మణ్, సతీష్ పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టదలచిన దశాబ్ది ఉత్సవాలో భాగంగా తేదీ 03 రోజున రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి. గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము లిమిటెడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బౌరంపేట్‌లో రైతులు, సొసైటీ అధ్యక్షులు ఎం. బాల్ రెడ్డి దూలపల్లీ సొసైటీ అధ్యక్షులు జి. నరేందర్ , రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు ఎం.గోపాల్ రెడ్డి , దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు, ఎ.గోపాల్ రెడ్డి రైతు వేదిక సభ్యులందరు బౌరంపేట్ సొసైటీ ఉపాధ్యక్షులు నల్లురి కృష్ణ, దులపల్లి ఉపాధ్యక్షులు ఏ రవీందర్ రెడ్డి, సంఘ డైరెక్టర్లు సంఘ కార్యాలయం బౌరంపెట్ లో సమావేశమై రైతు దినోత్సవం సందర్భంగా చేయవలసిన విధి విధానాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగినది. కావున రైతులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని బౌరంపేట్ సొసైటీ అధ్యక్షులు ఏం.బాల్ రెడ్డి తెలిపారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఉచిత టైలరింగ్, బ్యూటిషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకా నంద అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, భూదేవి హిల్స్ ప్రాంతలలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం కూకట్ పల్లి, హైదరాబాద్ వారిచే కిశోర బాలికల కోసం ఉచితంగా అందిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతులు, బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలకు టైలరింగ్, బ్యూటిషియన్ శిక్షణను ఉచితంగా అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ మేనేజర్ లక్ష్మీ కుమారి, స్థానిక డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, ఓరుగంటి కృష్ణ గౌడ్, నల్ల గోపుల బాబు గౌడ్, వేణు యాదవ్, పాపిరెడ్డి, బండ మహేందర్, దాస్, శశిధర్, విఠల్, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజల చూపు

- రాచమల్ల శేఖర్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



నీళ్ళు, నిధులు, నియామ కాలు స్వరాష్ట్రం తోనే సాధ్యమని బీఆర్ఎస్ అధికారం చేజిక్కించు కుని, స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్ల గడి చినా నియా మకాలు జరగ'డంలేదని, తన ఆవేదన వ్యక్తం చేశారు. మూసాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, ముందుగా రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి తేనే మన బతుకులు మారుతాయని, విద్యార్థులు ,యువకులు, ఉద్యమ కారులు, రాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. వారి మరణాలు చూసి చలించి పోయిన, సోనియా గాంధీ ఇలాంటి బలి దానాలు మరిన్ని కుటుంబాల్లో జరగ కూడదని ఆకాంక్షిం చింది. తెలంగాణ బిడ్డల ఆత్మబలి దానాలు చూసిన సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే, పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం ఒకే కుటుంబం చేతిలో బందీగా ఉండిపోయిందని. ప్రజలు కోరుకున్న తెలంగాణ రాష్ట్రం మాత్రం ప్రజలు చూడలేకపోతున్నారని, నీళ్ల ,నిధులు ,నియామకాలు స్వరాష్ట్రంతోనే సాధ్యమని అధికారం చేజిక్కించుకుని, యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో అలసత్వం వహిస్తూ నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చలించకుండా ,మొద్దు నిద్రలో నేటి రాష్ట్ర ప్రభుత్వం ఉందంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేసి ,నేటి పాలన కొనసాగిస్తున్నారని ఈ పాలనలో ప్రజలు అసంతృప్తిలో ఉన్నారని, రానున్న రోజుల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, తెలంగాణ ప్రజల అభ్యున్నతికై పాటు పడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని మూసాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్ తెలిపారు.

పేదల పాలిట వరం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్ పల్లి



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కులు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒకప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ రావాలంటే ఏండ్ల తరబడి తిరిగే దుస్థితి ఉండేదని కానీ నేడు నిరుపేదలు, ఆపదలో ఉన్నాను అంటే ఆపన్న హస్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటున్నారని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధితో పాటు నిరుపేదలకు నేనున్నానని భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ అంటూ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని పలువురు వినతి పత్రాలు అందజేసి కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండగల్

కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ గామంలో విశ్వేశ్వర, శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ యంత్ర విగ్రహ



స్థిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని, దయర్ గూడలో, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో, దాదాపుగా



రూ.19 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ను చేపట్టడం జరిగిందని. స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఈ సందర్భంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తూ నాణ్యతలో రాజీ పడకుండా పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, కూకట్ పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు , దయర్ గూడ అధ్యక్షుడు శంకర్, సురేష్, నాగరాజు, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు

నగరానికే తలమానికం మెట్రో

- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో సేవలు
- ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రో కారిడార్‌తో ప్రపంచ ఖ్యాతి!
- తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర ప్రజా రవాణా వ్యవస్థలో నూతన శకానికి హైదరాబాద్ మెట్రో రైలు శ్రీకారం చుట్టింది. మెట్రో రైలు ప్రారంభంతో నగర ప్రజల జీవనశైలిలో గణనీయమైన మార్పు వచ్చింది. అలాగే మెట్రో నిర్మాణాలు నగరానికి కొత్త అందాలను తెచ్చాయి.మెట్రో స్టేషన్లు ఆధునిక విమానాశ్రయాలను తలపిస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలికవసతులు కల్పించారు. ఆధునిక మౌలికవసతుల కల్పనలో హైదరాబాద్ మెట్రో ప్రపంచ దేశాల్లోని ప్రముఖ నగరాల సరసన నిలిచింది. మెట్రో రైలు ఎందరికో ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరటనిచ్చింది. ప్రతి ఒక్కరూ తమ గమ్యాన్ని సరైన సమయానికి చేరుకుంటున్నారు. నగరంలో కాలుష్యం తగ్గడంతో పాటు వాహనాల ప్రమాదాలు తగ్గాయి. మెట్రోస్టేషన్లను అత్యంత సుందరంగా, స్థానికులు సేదతీరేలా అభివృద్ధి చేశారు. మెట్రో స్టేషన్ సమీపంలో విద్యుత్ కార్లు, చార్జింగ్ పాయింట్లు, బస్ బేలు, కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న అత్యాధునిక టెక్నాలజీ హైదరాబాద్ మెట్రోలో వినియోగించారు. హైదరాబాద్ మెట్రోరైలు ఢిల్లీ మెట్రో రైలు తర్వాత దేశంలోని రెండవ అతిపెద్ద మెట్రోగా గుర్తింపు పొందింది.

పీపీపీ విధానంలో..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రయివేటు-పబ్లిక్ భాగస్వామ్యంలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ. మొత్తం 69 కి.మీ పరిధిలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్ఓటీ) విధానంలో మెట్రో రైలుమార్గాన్ని నిర్మించారు. మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ.22వేల కోట్లు. మూడు కారిడార్లు కలిపి 57 మెట్రో స్టేషన్లు ఉండగా.. 3 ఇంటర్ ఛేంజ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్బీనగర్ 29 కి.మీ.. 27 స్టేషన్లు.. కారిడార్-2 జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు..11 కి.మీ 8 స్టేషన్లు(పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.) ఇక కారిడార్-3 నాగోలు నుంచి రాయదుర్గ్ వరకు 29 కి.మీ 22 స్టేషన్లు ఉన్నాయి. ఈ మూడు కారిడార్లలో మెట్రో రైల్ సేవలు 2017 నుంచి విడుతల వారిగా నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో స్టేషన్‌లలో ఉచిత వైఫై సౌకర్యం, మహిళలకు ప్రత్యేక సీట్లు కేటాయించారు. మెట్రోలో ప్రయాణిస్తున్న సీనియర్ సిటిజన్లు, మహిళలు, విద్యార్థులు, యువత, అధికారులు.. ఇతరులు ముక్తకంఠంతో తమ హర్షం వ్యక్తపరుస్తున్నారు.

మెట్రో నంబర్ వన్

మెట్రో స్టేషన్ల నిర్వాహణ, రైళ్ల సమయపాలనలో మూడేండ్ల క్రితం కియోలిస్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో హైదరాబాద్ మెట్రో లండన్, మెట్రర్స్ స్టాకరామ్, మాంచెస్టర్, బోస్టన్ వంటి 12 అంతర్జాతీయ నగరాలను అధిగమించి మొదటి స్థానంలో నిలిచింది. విశ్వనగరాలలో కంటే హైదరాబాద్ మెట్రో అత్యాధునిక, విశిష్ట, సేవలందిస్తోందని, ఇక్కడ ప్రయాణీకులు అత్యధిక శాతం మెట్రో సేవలతో సంతృప్తి చెందుతున్నారని కియోలిస్ ప్రకటించింది.

సమయం ఆదా..!

నగర ట్రాఫిక్‌లో ఏ వాహనాన్నైనా వేగంగా నడపటం అసాధ్యమైన విషయం. కానీ, మెట్రో ప్రయాణం సాఫీగా సాగిపోతుంది.. ఇలా.. ఎల్బీ నగర్ నుంచి మియాపూర్ మార్గంలో మెట్రో రైల్లో ప్రయాణిస్తే కేవలం 52 నిముషాల వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవచ్చు. నాగోల్ నుంచి రాయదుర్గ్(29కి.మీ) మార్గంలో మెట్రో రైల్లో ప్రయాణిస్తే కేవలం 50 నిముషాల వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవచ్చు.జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్(11 కి.మీ) మార్గంలో మెట్రోలో ప్రయాణిస్తే, కేవలం 16 నిముషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. మెట్రో ద్వారా ఈ రూట్లో ప్రయాణీకుల సమయం ఒక గంటకుపైగా ఆదా అవుతోంది. హైదరాబాద్ మెట్రో రైళ్లలో సగటున రోజుకి 4.5 లక్షలకు పైగా ప్రజలు ప్రయాణిస్తున్నారు.

వేగంగా ఎయిర్‌పోర్టు మెట్రో పనులు..



సీఎం కేసీఆర్ దార్శనిక నాయకత్వంలో రెండో దశలో ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా 31కి.మీ మెట్రో రైలు మార్గ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్-31 కి.మీ మెట్రో రైలు మార్గ నిర్మాణానికి 2022 డిసెంబర్ 9న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందుకు సంబంధించిన పనులు చకాచకా సాగిపో తున్నాయి. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు ఈపీసీ కాంట్రా క్టర్ ఎంపిక కోసం(ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం) హెచ్ఏఎంఎల్ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టు విలువ మొత్తం రూ.6,250 కోట్లు కాగా.. ఇందులో రూ.5,688 కోట్లు మెట్రో ఎక్స్‌ప్రెస్ ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం కోసం వినియోగించగా.. మిగిలిన రూ.562 కోట్లు భూగర్భ సామర్థ్య పరీక్షలు, పెగ్ మార్కింగ్ తదితర పనుల కోసం ఖర్చు చేయనున్నారు. ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో కలిపి మొత్తం 9 స్టేషన్లు ఉంటాయి. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా నగర శివార్లలో ఉండే మధ్య తరగతి వర్గాలవారి కోసం తక్కువ ఖర్చుతో నివాసయోగ్యాల అభివృద్ధిపరచి, అన్ని తరగతులవారు ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్ ద్వారా నగరంలోని వారి ఆఫీసు లకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన ఈపీసీ టెండర్ డాక్యుమెంట్లను తయారు చేసేందుకు జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సిస్ట్రా, రైట్స్ డీబీ ఇంజినీరింగ్ సంస్థల కన్సార్టియంను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. పలు విభాగాల్లో నిష్ణా తులైన 18మంది ఇంజినీరింగ్ నిపుణులు, క్షేత్రస్థాయిలో మరో 70మంది సీనియర్ ఇంజినీర్లు తదితర సిబ్బందిని కన్సార్టియం సమకూర్చుతుంది. ఇప్పటికే పనిని ప్రారంభించింది.

'ప్రజారవాణా'లో మెట్రో కీ రోల్ :

రాష్ట్రంలోనే మూడొంతుల జనాభా నగరం చుట్టుపక్కల నివస్తోంది. దానికి అనుగుణంగా ప్రజా రవాణా కల్పించడంలో మెట్రో రైల్ కీలక పాత్ర పోషిస్తుంది. త్వరలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 31 కి.మీ మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను నిర్మిస్తాం. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాం.

ఎన్వీఎస్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎంఆర్ఎల్



హైదరాబాద్.. తెలంగాణ గుండెకాయ. ఆర్థిక కల్పతరువు. భౌగోళికంగా అత్యంత నివాసయోగిత ప్రాంతం. చారిత్రక నగరం. ఎటుచూసిన పచ్చదనం...ఇలా చెప్పకుంటూ పోతే విశిష్టతలెన్నో. చెట్టును సరైన రీతిలో సాకితే అద్భుత ఫలాలను అందించినట్టుగానే...ప్రతి వ్యక్తీ తన ఆరోగ్యంపై దృష్టి పెడితే పదేండ్లు ఎక్కువ బతికినట్టుగానే...రాష్ట్ర సర్కారు హైదరాబాద్ అభివృద్ధికి చేస్తున్న కృషి ఇప్పుడు ఫలాల రూపంలో కనిపిస్తున్నది. భావితరాలకు పచ్చనైన, స్వచ్ఛమైన, అందమైన, ఆధునికమైన నగరాన్ని తీర్చిదిద్దాలనే సీఎం కేసీ ఆర్ దృఢ సంకల్పం నెరవేరే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఎటు చూసినా ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, చక్కటి రహదారులు, ఆహ్లాదకరమైన పార్కులు, ఆకట్టుకునేలా థీమ్ పార్కులు, మినీ ట్యాంక్ బండ్‌లుగా చెరువులు...దశాబ్దకాలంలో ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో భాగ్యనగరం కాస్తా విశ్వన గరంగా ఆవిష్కృతమైంది. కరెంటు కోతలు కానరాకుండా పోయాయి. విద్యుత్ వెలుగులు విరజిమ్ముతు న్నాయి. గల్లీ గల్లీకో బస్తీదవాఖానాలు పుట్టుకొచ్చాయి. పట్నం బిడ్డల సంజీవనిలా మారాయి. ఎండాకాల మొస్తే చాలు తాగునీళ్ల కోసం అల్లాడే స్థాయిని దాటేసి ప్రజల గొంతులకు కృష్ణమ్మ నీళ్లను అందించి దాహార్తిని తీర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కింది. అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంలా తయారైంది. కొత్త పరిశ్రమలకు పుట్టినిల్లు అయ్యింది. లక్షలాది మంది ప్రజలకు ఉపాధినిచ్చే నీడైంది. ట్రాఫిక్ సమస్యకు ఎస్ఆర్‌డీపీ పరిష్కారం చూపింది. అత్యాధునిక పోలీసు వ్యవస్థతో భద్రత మరింత పెరిగింది. ఐటీ పరిశ్రమకు అమృత నగరంగా మారింది. తెలంగాణ సర్కారు దృఢమైన సంకల్పంతో పట్నం కీర్తి ఎల్లలు దాటి విశ్వవ్యాప్తమైంది. విశ్వనగరంగా మారింది.

అరబిందో పరిశ్రమలో కెమికల్ లీక్.. పలువురికి అస్వస్థత

నవతెలంగాణ-దుండిగల్

బాచుపల్లి మండల పరిధిలో అరబిందో యూనిట్-3 రసాయన కంపెనీలో కెమికల్ లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న పలువురు కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం అరబిందో యూనిట్-3 లో ప్రాసెసింగ్ యూనిట్ -1 లో ముగ్గురు కార్మికులు రసాయన మిశ్రమం కలిపే క్రమంలో సాల్వెంట్ లీకై బయటకు రావడంతో ఒక్కసారిగా గ్యాస్ లీక్ కార్మికులు సృహ తప్పి ప్రాసెసింగ్ యూనిట్ లో పడిపోయారు. ఆ ఆ ముగ్గురిని రక్షించేందుకు మరో నలుగురు వెళ్లడం ఆ కార్మికులు సైతం రసాయన వాసనల కు గురై తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వెంటనే యాజమాన్యం బాచుపల్లిలోని ఎస్ ఎల్ జి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వారిలో కార్మికులు ప్రేమ్ కుమార్, గౌరీనాథ్, ప్రసాద్ రాజు, విమల, గౌరీ, యాసిన్ అలీ, శ్రీనివాసరావులు ఉన్నారు. వీరిలో కొందరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనలకరంగా ఉన్నట్టు సమాచారం ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ

నవచిత్రం

తెలుగులోనూ ఇన్ని కోట్ల కలెక్షన్స్ ఊహించలేదు

తెలుగునాట కూడా ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై, సెన్సేనల్ హిట్‌గా నిలిచి అద్భుతమైన కలెక్షన్‌లు సాధిస్తున్న సినిమా '2018'. మే 5న మలయాళంలో రిలీజై అక్కడ రూ.150 కోట్ల మార్క్ టచ్ చేసి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇక గతవారం తెలుగులో విడుదలై, ఇక్కడ కూడా భారీ



చందు మొండేటి, అల్లు అరవింద్, బన్నీ వాసు

కలెక్షన్‌లు సాధించి, సుమారు 6 కోట్ల మార్క్ టచ్ చేసింది. ఈ సినిమా ప్రస్తుతం లాభాల్లో ఉంది. 2018లో కేరళని ముంచెత్తిన భీకర వరదల్ని, ఆ వరదల్లో బాధితులు ప్రాణాల కోసం చేసిన పోరాటాల్నీ ఆధారంగా చేసుకుని ఈ సినిమాని దర్శకుడు జూడ్ ఆంథనీ జోసెఫ్ హృద్యంగా తెరకెక్కించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఏర్పాటు చేసిన థ్యాంక్స్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'నేను ఈ సినిమా చూస్తున్నంత సేపు ఒక తుఫాన్‌లో ఉన్నట్టు ఉంది. ఈ సినిమాలో ఫైట్లు లేవు. డాన్సులు లేవు. ఓన్లీ ఉద్వేగం ఉంది. సినిమా చూడాలి అనుకున్నా వారు థియేటర్లోనే చూడండి లేదంటే ఆ ఫీల్ మిస్ అవుతారు. మలయాళంలోనే కాదు తెలుగులో కూడా ఇన్ని కోట్ల కలెక్షన్లు సాధిస్తుందని ఊహించలేదు' అని అన్నారు.

దర్శకుడు చందూ మొండేటి మాట్లాడుతూ,'ఈ సినిమా చూశాక చాలా కాలం తర్వాత చప్పట్లు కొట్టా. అలాగే ఫస్ట్ టైం వర్షం మీద కోపం వచ్చింది. ఈ సినిమా అంతా ఒక ఉద్వేగంతో నడుస్తుంది. ఈ సినిమాని ఇంత పెద్ద హిట్ చేసి ఆడియన్స్‌కు థ్యాంక్స్' అని చెప్పారు. బన్నీ వాసు మాట్లాడుతూ,'నేను ఇలాంటి విభిన్నమైన సినిమాలు తీసుకురావడానికి కారణం అరవింద్. ఈ సినిమా రిలీజ్ అయ్యాక ఆయనపై ఎక్కడలేని గౌరవం పెరిగింది సినిమాని బ్లాక్ బస్టర్ చేసినందుకు తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని తెలిపారు.

ప్రేమ చరిత్ర కృష్ణ విజయం

సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయన నటించిన ఆఖరి సినిమా 'ప్రేమ చరిత్ర కృష్ణ విజయం' చిత్ర ట్రైలర్‌ను గురువారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆవిష్కరించారు. అంబ మూవీ పతాకంపై కన్నడ దర్శకుడు హెచ్ మధుసూదన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీపాద్ హంచాటే నిర్మాత. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమానికి కృష్ణ పర్సనల్ మేకప్ మేన్ మాధవరావు, టి.రామసత్య నారాయణ, లయన్ సాయి వెంకట్, సీనియర్ జర్నలిస్ట్ వినాయకరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.



ఈ సందర్భంగా దర్శకుడు హెచ్ మధుసూదన్ మాట్లాడుతూ, 'వంశంసినిమా దర్శకుడిగా నా తొలి సినిమా. ఆ చిత్రానికి ఎన్నో అవార్డ్స్ వచ్చాయి. ఈ క్రమంలో శ్రీపాద్ హంచాటే పిలిచి కృష్ణ గారితో సినిమా చేద్దామన్నారు. 2007లో సినిమా పూర్తయింది. విడుదల కోసం ఎంతో వెయిట్ చేశాను. అయినా రిలీజ్ కాలేదు. ఈలోపు నేను కన్నడలో చాలా పిక్చర్స్ డైరెక్ట్ చేశాను. అయితే కృష్ణ గారి సినిమా ఎలాగైనా రిలీజ్ చేయాలని, మా నిర్మాత దగ్గర నుంచి తీసుకొని సరికొత్త హంగులతో ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి తగ్గట్టుగా మార్చి నేనే ఈనెలలో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నా. కృష్ణ అభిమానులు, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని పెద్ద సక్సెస్ చేస్తారని కోరుకుంటున్నా' అని తెలిపారు. యశ్వంత్, సుహాసిని జంటగా నటించిన ఈ చిత్రంలో నాగబాబు, అలీ, ఎమ్మెస్ నారాయణ కీలక పాత్రలు పోషించారు.

భోళా మానియా మొదలైంది



చిరంజీవి ప్రస్తుతం మెహర్ రమేష్ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భోళా మానియా ఈనెల 4న విడుదలయ్యే మొదటి సింగిల్‌తో ప్రారంభమవుతుంది. చిరంజీవి అల్ట్రా-మోడ్రన్ అవతార్‌లో ఉన్న స్టైలిష్ పోస్టర్ ద్వారా మేకర్స్ అనౌన్స్ చేసినట్లు నేడు (శుక్రవారం) పాట ప్రోమోను విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. జూన్ నెలాఖరుకు సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది. సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సిస్టర్‌గా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మెహర్ రమేష్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.



భావోద్వేగ ప్రయాణం

బస్తీలో ఉండే తండ్రీ కొడుకులు.. పూట గడిస్తే చాలనుకునే చాలీ చాలని సంపాదన.. అలాంటి ఓ పేద కుటుంబంలోని ఉండే పిల్లాడుకి విమానం ఎక్కాలనే కోరిక పుడుతుంది. తండ్రి అవిటితనంతో బాధపడుతున్నప్పటికీ కొడుకు కోరికను తీర్చాలనుకుని రాత్రి పగలు కష్టపడుతుంటాడు. విమానం ఎక్కాలనుకునే కొడుకు కోరికను తీర్చటానికి ఏం చేయాలా? అని ఎప్పుడూ ఆలోచిస్తుంటాడు. ఇది తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్. సుమతీ అనే అమ్మాయిని ప్రేమించే కోటి.. లోకమంతా తనను కామంతోనే చూస్తుందని భావించే ఆమెకు తనను మనస్ఫూర్తిగా ప్రేమించే వాడున్నాడని తెలియగానే ఆమె హృదయంలో నుంచి వచ్చే ఆవేదన.. ఇది రెండు హృదయాల మధ్య ఉండే ఎమోషన్.. హృదయాన్ని తాకే ఇలాంటి భావోద్వేగాల



'విమానం'లో ఒక దృశ్యం

వ్యక్తుల ప్రయాణాన్ని తెలియజేసే చిత్రమే 'విమానం'. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను గురువారం హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. దర్శకుడు శివ ప్రసాద్ యానాల మాట్లాడుతూ, 'ప్రతీ ఒక్కరి జీవితాల్లో బలమైన భావోద్వేగాలుంటాయి. అలాంటి ఎమోషన్స్‌ను బేస్ చేసుకునే ఈ సినిమాను రూపొందించాం. జూన్ 9న ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ అవుతుంది. తప్పకుండా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుంది' అని తెలిపారు. నిర్మాతలు జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి మాట్లాడుతూ, 'ఇదొక ఎమోషనల్ కనెక్టింగ్ మూవీ ఇది. 'విమానం' చిత్రంలో వీరయ్య అనే అంగ వైకల్యం ఉన్న తండ్రి పాత్రలో సముద్ర ఖని, కొడుకు పాత్రలో మాస్టర్ ధ్రువన్ నటిస్తుండగా సుమతి పాత్రలో అనసూయ భరద్వాజ్, రాజేంద్రన్ పాత్రలో రాజేంద్రన్, డేనియల్ పాత్రలో ధన్‌రాజ్, కోటి పాత్రలో రాహుల్ రామకృష్ణ ఇతర కీలక పాత్రల్లో మెప్పించబోతున్నారు.

క్రీడలకు నవోత్సాహం

• సిఎం కప్ పోటీలతో జోష్ • జాతీయ క్రీడల తరహాలో నిర్వహణ

నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, ఇషా సింగ్, ఉప్పల ప్రణీత్, సిక్కిరెడ్డి, ఆకుల శ్రీజ.. అంతర్జాతీయ వేదికలపై అదరగొడుతున్న తెలంగాణ క్రీడాకారులు. కామెన్‌వెల్త్ క్రీడల్లోనూ పతకాలు సాధించిన జాబితాలో తెలంగాణ అథ్లెట్లు ఎక్కువగా ఉన్నారు!. మన అథ్లెట్లు బయట దుమ్మురేపుతున్నా.. ఇంట మాత్రం ఆ స్థాయి ఊపు లేదు. తొలిసారి సిఎం కప్ పోటీల నిర్వహణతో తెలంగాణలో క్రీడా వాతావరణమే మారింది. జాతీయ క్రీడల తరహాలో భారీ స్థాయిలో నిర్వహించిన సిఎం కప్‌తో క్రీడలకు సరికొత్త ఉత్సాహం సంతరించుకుంది.

నవతెలంగాణ క్రీడావిభాగం







కరోనా మహమ్మారి, అనంతరం పరిస్థితుల్లో క్రీడా రంగంలో ఆశించిన జోష్ కనిపించలేదు. సంబంధిత క్రీడాంశాల్లో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు జరిగినా.. ఎక్కడా స్పోర్ట్స్ ఫెస్టివల్ వాతావరణం కనిపించలేదు. ఇటీవల జాతీయ క్రీడలకు తెలంగాణ నుంచి జంబో జట్టు వెళ్లినా.. ముందస్తు శిక్షణ శిబిరాల లేమి, సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. సిఎం కప్ 2023 పోటీలతో రాష్ట్ర క్రీడా రంగ వాతావరణంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. 18 క్రీడాంశాల్లో పది రోజుల పాటు ఏకకాలంలో నిర్వహించిన పోటీలతో.. హైదరాబాద్‌లో జాతీయ క్రీడల వాతావరణం నెలకొందని చెప్పటం అతిశయోక్తి కాదు. రానున్న గోవా జాతీయ క్రీడల నేపథ్యంలో సిఎం కప్‌తో తెలంగాణలో క్రీడలకు ఆ ఊపు ముందే వచ్చినట్టు అయ్యింది!.

ఎందుకీ ప్రత్యేకత

ఒలింపిక్ క్రీడల్లో ప్రతి ఏడాది జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగటం సాధారణం. అయినా, సిఎం కప్‌కు ఓ ప్రత్యేకత ఉంది. సాధారణంగా క్రీడా సంఘాలు నిర్వహించే పోటీలకు పెద్దగా ప్రచారం ఉండదు. ఆ పోటీలకు ఎక్కువగా క్రీడా పాఠశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థులే హాజరవుతారు!. సిఎం కప్ పోటీల్లో ఓపెన్ కాంపిటిషన్ నిర్వహించారు. దీంతో క్రీడా, విద్యా రంగాలకు అతీతంగా క్రీడాకారులు పోటీపడ్డారు. ఓపెన్ కాంపిటీషన్‌తో వాస్తవిక సామర్థ్యం సైతం వెలుగులోకి వచ్చింది. 615 మండల కేంద్రాల్లో జరిగిన సిఎం కప్ పోటీల్లో సుమారు 2 లక్షల మంది క్రీడాకారులు పోటీపడ్డారు. 33 జిల్లా కేంద్రాల్లో జరిగిన సిఎం కప్ టోర్నీలో సుమారు 85 వేల మంది క్రీడాకారులు తలపడ్డారు. సిఎం కప్ రాష్ట్ర స్థాయిలో పోటీలకు సైతం 7500 క్రీడాకారులు హాజరయ్యారు. రెండు లక్షల మంది క్రీడాకారులు, 12769 గ్రామాలు, 615 మండలాలు, 33 జిల్లాలు క్రీడా పండుగ చేసుకోవటం రాష్ట్ర చరిత్రలోనే ఇది ప్రథమం.

మూడు లక్ష్యాలతో..

సిఎం కప్ 2023 పోటీలను ప్రధానంగా మూడు లక్ష్యాలతో మొదలెట్టారు. తెలంగాణ స్ఫూర్తి చాటుతూ యువతలో ఐక్యత, ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావటం. ఇక చివరగా.. రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మల్టీస్పోర్ట్స్ ఈవెంట్లను నిర్వహించేందుకు సన్నద్ధత. శాట్స్ యంత్రాంగం సిఎం కప్ టోర్నీ నిర్వహణతో మూడు లక్ష్యాలను సాధించింది!. 12768 గ్రామాలు, 615 మండలాలు, 33 జిల్లాల్లో పక్షం రోజుల పాటు యువత జాతర జరిగింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన అథ్లెట్లలో సగానికి పైగా గ్రామీణ క్రీడాకారులు ఉన్నారు. గతంలో క్రీడా సంఘాలు నిర్వహించిన ఏ పోటీలకు హాజరు కాని అథ్లెట్లు.. సిఎం కప్ పోటీలతో వెలుగులోకి వచ్చారు. మండల స్థాయి నుంచి క్రీడా పోటీలు నిర్వహించటంతో ఇది సాధ్యపడింది. ఇక ఏకకాలంలో 18 క్రీడాంశాల్లో 7500 మంది అథ్లెట్లకు పోటీలు నిర్వహించిన శాట్స్ యంత్రాంగం ఆ దిశగా విజయవంతమైంది. ఐదు స్టేడియాల్లో పోటీల నిర్వహణతో భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ మల్టీస్పోర్ట్స్ ఈవెంట్‌కు సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించగలమే దీమా తీసుకొచ్చారు.

భారీ ప్రైజ్‌మనీ

సిఎం కప్ పోటీల రాష్ట్ర స్థాయి చాంపియన్లకు భారీ ప్రైజ్‌మనీ అందించారు. సాధారణంగా రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లకు నగదు బహుమతి ప్రకటించటం అరుదు. సిఎం కప్‌లో 18 క్రీడాంశాల్లో జట్టు, వ్యక్తిగత విభాగాల్లో విజేతలకు నగదు బహుమానాలు ఇచ్చారు. జట్టు విభాగంలో విజేతకు రూ. 1 లక్ష, రన్నరప్‌కు రూ.75 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు ప్రదానం చేశారు. వ్యక్తిగత పోటీల విభాగంలో పసిడికి రూ.20 వేలు, సిల్వర్‌కు రూ.15 వేలు, కాంస్యానికి రూ.10 వేలు అందజేశారు. 18 క్రీడాంశాల్లో జట్టు, వ్యక్తిగత విభాగాల్లో పసిడి, రజత, కాంస్య పతక విజేతలకు కలిపి సుమారు రూ.1.20 కోట్ల నగదు బహుమతిగా అందించారు.

సిఎం కప్ సక్సెస్

సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులు, అధికారులు, కోచ్‌లతో కలిపి పది వేల మంది వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళా అథ్లెట్లు కొందరు తొలిసారి రాష్ట్ర రాజధానికి వచ్చారు. మహిళా అథ్లెట్లు వసతి భవనంలో, ప్రయాణించే బస్సులో, పోటీపడే స్టేడియంలో మహిళా పోలీసు కానిస్టేబుల్‌ను మొహరించారు. భోజనం విషయంలో శాట్స్ యంత్రాంగం ఎక్కడా రాజీ పడలేదు. క్రీడాకారులకు పోషక విలువలతో కూడిన భోజనం ఏర్పాటు చేశారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోటీలను ఉదయం, సాయంత్రం సెషన్లోనే నిర్వహించారు. క్రీడాకారులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పదికి పైగా విభాగాలతో సమన్వయం చేసుకున్న శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ సిఎం కప్ 2023 పోటీలను విజయవంతం చేశారు. 2024 సిఎం కప్ పోటీల్లో క్రీడాంశాలు 18 నుంచి 25 వరకు పెరిగే అవకాశం ఉంది. తెలంగాణ క్రీడా పండుగగా జరిగిన సిఎం కప్‌కు అపూర్వ స్పందన రావటంతో వచ్చే ఏడాది మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.







'సిఎం కప్ పోటీలు నిర్వహించటం బాగుంది. ఈ పోటీలు జరుగటం ఇది తొలిసారి. గతంలో హ్యాండ్‌బాల్ టోర్నీల్లో పాల్గొన్నాను. కానీ ఎప్పుడూ ఇటువంటి వాతావరణం కనిపించలేదు. రెగ్యులర్ చాంపియన్‌షిప్స్‌లలో వసతి, భోజనం విషయంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. సిఎం కప్ పోటీల్లో భోజనం, వసతి ఏర్పాట్లు చాలా బాగున్నాయి. సిఎం కప్ పోటీలను ఇలాగే ప్రతి ఏడాది నిర్వహించాలి'

- రిషిక, హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి (సిల్వర్ మెడలిస్ట్)



'సిఎం కప్ పోటీలు చాలా బాగున్నాయి. తొలిసారి బాక్సింగ్‌లో వయో పరిమితి లేకుండా పోటీలు జరిగాయి. ఇప్పటివరకు మా ఏజ్ గ్రూప్ బాక్సర్లతోనే పోటీపడ్డాను. సిఎం కప్‌లో సీనియర్ బాక్సర్లతో పోటీపడటం గొప్ప అనుభూతిని మిగిల్చింది. ఓపెన్ కాంపిటిషన్‌లో పోటీ అనుభవం బాగుంది. నేను సీనియర్లతో పోటీపడి కాంస్య పతకం సాధించాను. ఏర్పాట్లు బాగున్నాయి, పోటీలు సంబురంగా జరిగాయి'

- మాలిక్, బాక్సర్ (ఆదిలాబాద్)

'బాస్కెట్‌బాల్‌ను 33 జిల్లాల్లో మహిళలకు సైతం నిర్వహించాలని సూచించారు. తొలుత అన్ని జిల్లాల నుంచి జట్లు రావని అనుకున్నాం. మహిళల విభాగంలో ఐదు జట్లు వచ్చినా గొప్పే అనిపించింది. కానీ బాస్కెట్‌బాల్‌లో ఇన్నేండ్ల మా అనుభవం తలకిందులైంది. మహిళా అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల విభాగంలో పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గ్రామీణ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. ఈ స్థాయి ఆదరణ, స్పందన ఊహించలేదు. సిఎం కప్ పోటీలు రాష్ట్ర క్రీడా చరిత్రలో నిలిచిపోతాయి'

- బాస్కెట్‌బాల్ సంఘం అధికారి.

ఆటలు

స్పోర్ట్స్ పేజి

క్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్

• లక్ష్యసేన్ ముందంజ • థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్ : భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ సంచలన మోత మోగిస్తున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్స్ సిల్వర్ మెడలిస్ట్‌పై విజయంతో ప్రీ క్వార్టర్స్‌లో కాలుమోపిన కిరణ్ జార్జ్.. తాజాగా వెంగ్ హాంగ్ యాంగ్‌పై విజయంతో క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్‌పై 21-11, 21-19తో వరుస గేముల్లో కిరణ్ జార్జ్ గెలుపొందాడు. వరుసగా ఇద్దరు స్టార్ చైనా షట్లర్లపై విజయం సాధించిన కిరణ్ జార్జ్ నేడు సెమీస్ బెర్త్ కోసం ఫ్రాన్స్ ఆటగాడు తోమ జూనియర్‌తో పోటీపడనున్నాడు. మెన్స్ సింగిల్స్ యువ కెరటం లక్ష్యసేన్ సైతం ముందంజ వేశాడు. నాల్గో సీడ్, చైనా షట్లర్ లి షి ఫెంగ్‌పై లక్ష్యసేన్ మెరుపు విజయం సాధించాడు. 21-17, 21-15తో టైటిల్ ఫేవరేట్‌ను మట్టికరిపించిన లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ 11-21, 14-21తో మూడో సీడ్ హీ బింగ్జియావో (చైనా) చేతిలో ఓటమి చెందింది. అష్మిత చాలిహ 18-21, 13-21తో స్పెయిన్ స్టార్ కరొలినా మారిన్‌తో పోరాడి ఓడింది. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ అనూహ్య పరాజయం చవిచూసింది. 26-24, 11-21, 17-21తో ఇండోనేషియా జోడీ మహ్మద్ ఫిక్రి, మౌలానా బగాస్‌తో మూడు గేముల పోరులో నిష్క్రమించారు.

ధోనికి శస్త్రచికిత్స



ముంబయి : భారత క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్ ధోని మోకాలు గాయానికి శస్త్రచికిత్స చేశారు. ఎడమ కాలు మోకాలు నొప్పి వేధిస్తున్నప్పటికీ ఐపీఎల్16లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు సారథ్యం వహించిన ధోని.. ఆ జట్టు కు రికార్డు ఐదో టైటిల్ అందించాడు. సోమవారం అహ్మదాబాద్‌లో ఫైనల్ అనంతరం ధోని నేరుగా ముంబయికి చేరుకున్నాడు. ఆర్థో పెడిక్ సర్జన్ డాక్టర్ దిన్షా పర్దివాల సిఫారసు మేరకు ముంబయిలోకి కోకిలాబెన్ హాస్పిటల్‌లో ధోనికి గురువారం శస్త్రచికిత్స చేశారు. మోకాలు గాయానికి సర్జరీ విజయవంతమైందని సూపర్‌కింగ్స్ వర్గాలు తెలిపాయి.

త్రీ స్ట్రిప్స్ జెర్సీలు వచ్చేశాయ్

భారత క్రికెట్ జట్టు నూతన జెర్సీ భాగస్వామి ఆడిడాస్.. సరికొత్త మెన్ ఇన్ బ్లూ జెర్సీలను గురువారం ఆవిష్కరించింది. ఆడిడాస్ ప్రముఖ త్రీ స్ట్రిప్స్‌తో టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్ల జెర్సీలను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.









Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

విమానయాన ఇంధనం చౌక



న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజు రోజుకు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ధనవంతులు ప్రయాణించే విమానయాన ఇంధన ధరలను మాత్రం భారీగా తగ్గిస్తోంది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలకు 7 శాతం కోత పెడుతూ గురువారం చమురు మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కిలోలీటర్ ఎటిఎఫ్‌పై రూ.6,632.25 తగ్గించి రూ.89,303గా నిర్ణయించింది. దీంతో వరుసగా నాలుగు నెలల్లోనూ ఈ ఇంధనం ధర తగ్గించినట్లయ్యింది. ఇంతక్రితం మార్చిలో 4 శాతం, ఏప్రిల్‌లో 8.7 శాతం, మేలో 2.45 శాతం చొప్పున ఎటిఎఫ్ ధరలకు బిజెపి ప్రభుత్వం కోత పెట్టింది. ప్రతీ నెల ఒక్కటో తేదిన ఎటిఎఫ్ ధరలను కేంద్రం సమీక్షిస్తుంది. తాజాగా వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్‌పై రూ.83.5 తగ్గించింది. దీంతో ఢిల్లీలో ఆ సిలిండర్ ధర రూ.1,773గా ఉంది. మరోవైపు గృహాల కోసం ఉపయోగించే గ్యాస్ ధరను మాత్రం యథాతథంగా కొనసాగించడం గమనార్హం.

జిఎస్‌టి వసూళ్లలో 12% వృద్ధి

- మేలో రూ.1.57 లక్షల కోట్ల రాబడి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అంచనాలు మించి ప్రజల నుంచి పన్ను వసూళ్లను రాబడుతోంది. ప్రస్తుత ఏడాది మేలో రూ.1,57,090 కోట్ల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూలు చేసింది. గతేడాది ఇదే మాసంలో రూ.1,40,885 కోట్ల వసూళ్లతో పోల్చితే 12 శాతం పెరుగుదల చోటు చేసుకుందని గురువారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడిచిన నెల మొత్తం జిఎస్‌టిలో సిజిఎస్‌టి కింద రూ రూ.28,411 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.35,828 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.81,363 కోట్లు చొప్పున వసూళ్లయ్యాయని వెల్లడించింది. సెస్సుల రూపంలో మరో రూ.11,489 కోట్ల రాబడి చోటు చేసుకుంది. గడిచిన మే మాసంలో తెలుగు రాష్ట్రాల్లోనూ పన్ను వసూళ్లు పెరిగాయి. గతేడాది మేలో తెలంగాణ నుంచి రూ.3982 కోట్ల జిఎస్‌టి వసూలు కాగా.. గడిచిన మేలో 13 శాతం పెరిగి రూ.4507 కోట్లుగా నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 11 శాతం పెరిగి రూ.3373 కోట్ల మేర జిఎస్‌టి వసూళ్లయ్యింది. 2022 మేలో రూ.3047 కోట్ల పన్ను రాబడి చోటు చేసుకుంది. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో 2023 ఏప్రిల్‌లో దేశంలో రికార్డ్ స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు జరిగాయి.

ఫ్యూచర్ జెనరల్లీ నుంచి డిఐవై హెల్త్ పాలసీ

ముంబయి : ఫ్యూచర్ జెనరాలి ఇండియా కొత్తగా డిఐవై హెల్త్ పాలసీని ఆవిష్కరించింది. గురువారం ఆ సంస్థ ఎండి, సిఇఒ అనూప్ రావ్ వర్చువల్‌గా మీడియాతో మాట్లాడుతూ.. ఈ సరికొత్త పాలసీ ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా రూపొందించబడిందన్నారు. 20 మాడ్యులర్ ఫీచర్లతో దీన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ హెల్త్ పాలసీలో బీమా మొత్తానికి సమగ్ర కవరేజీ, రూ.5 లక్షలు అంతకంటే ఎక్కువ పొందడానికి వీలుందన్నారు. గరిష్ఠంగా 15 మంది కుటుంబ సభ్యులకు కవరేజీ పొంద వచ్చున్నారు. వినియోగదారులు వారి జీవిత అవసరాలకు అనుగుణంగా అత్యంత ఆవశ్యకమైన ఫీచర్‌లను ఎంచుకోవడానికి వీలుందన్నారు.

ఏసర్ గూగుల్ టివిల విడుదల

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఏసర్ ద్వారా కొత్త గూగుల్ టివిల శ్రేణీని భారత్‌లో విడుదల చేసినట్లు ఇండ్‌కల్ టెక్నాలజీస్ వెల్లడించింది. ఒఎల్‌ఇడి డిస్‌ప్లేతో కూడిన ఫ్లాగ్‌షిప్ ఓ సిరీస్, భారీ వూఫర్‌లు ఉన్న 60 వాట్ స్పీకర్ సిస్టమ్‌తో వీటిని ఆవిష్కరించినట్లు తెలిపింది. 55, 65 అంగుళాల వేరియంట్లు సహా 32, 43, 50 అంగుళాల పరిమాణంలోనూ లభిస్తాయని వెల్లడించింది. ఏసర్ నుంచి వచ్చిన ఈ శ్రేణీలో హెచ్‌డిఎంఐ 2.1 పోర్ట్‌లు, యుఎస్‌బి 3.0తో డ్యూయల్-బ్యాండ్ వైఫై, 2-వే బ్లూటూత్ 5.0, డాల్బీ అట్మాస్ తదితర ఫీచర్లున్నట్లు తెలిపింది.

ఏథర్ ఎనర్జీ నుంచి కొత్త 450ఎస్

న్యూఢిల్లీ : ద్విచక్ర విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఏథర్ కొత్తగా మార్కెట్లోకి 450ఎస్ మోడల్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే 450 శ్రేణీలో 450ఎక్స్, ప్రో వేరియంట్లను విక్రయిస్తోంది. తాజా మోడల్ ఏథర్ 450ఎస్ ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇది గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని ఆ సంస్థ వెల్లడించింది. అదే విధంగా ఒకసారి ఫుల్ ఛార్జ్‌తో 115 కిలోమీటర్లకు ప్రయాణించవచ్చని పేర్కొంది. అయితే ఇది ఎప్పటి నుంచి మార్కెట్‌లో లభ్యం అయ్యేది ఆ సంస్థ ప్రకటించలేదు.

నికాన్ 'జడ్8' ప్రదర్శన



హైదరాబాద్ : ఇమేజింగ్ టెక్నాలజీ అగ్రగామి సంస్థ నికాన్ ఇండియా తమ సరికొత్త మిర్రర్‌లెస్ ఇమేజింగ్ మాస్టర్ పీస్ నికాన్ జడ్8ను ప్రదర్శించింది. గురువారం హైదరాబాద్‌లో దీన్ని ఆ కంపెనీ ఎండి సజ్జన్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇమేజింగ్ ల్యాండ్‌స్కేప్‌ను ఒక మెట్టు పైకి తీసుకెళ్లేలా ఇది రూపొందించబడిందన్నారు. దీని ధరను రూ.3.44 లక్షలుగా నిర్ణయించామన్నారు. ఇది హై స్పీడ్ ఫ్రేమ్ క్యాప్చర్‌లో ప్రతిబింబిస్తుందన్నారు. 12 బిట్ అంతర్గత 8కె వీడియో రికార్డింగ్, 120ఎఫ్‌పిఎస్ వరకు బర్స్ట్ స్పీడ్, అత్యంత అధునాతన ఆటో ఫోకస్ సిస్టమ్ వంటి కీలక ఫీచర్లతో దీన్ని రూపొందించామన్నారు.

వ్యవసాయ డ్రోన్లలోకి మెజ్లానిక్ క్లౌడ్

హైదరాబాద్ : నగర కేంద్రంగా పని చేస్తోన్న మెజ్లానిక్ క్లౌడ్ కొత్తగా వ్యవసాయం, సరకు రవాణా సేవలకు ఉపయోగపడే డ్రోన్లను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. వ్యవసాయంలో క్రిమిసంహారకాలను పిచికారీ చేసేందుకు వీలుగా డ్రోన్లనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. సరకులను చేరవేసే డ్రోన్లు 2-100 కిలోల బరువును మోస్తాయని ఆ సంస్థ సిఇఒ సుధీర్ రెడ్డి తుమ్మ వెల్లడించారు. ఇవి 5-60 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయన్నారు.. తమ డ్రోన్ల ధరలు రూ.4-50 లక్షల శ్రేణిలో ఉంటాయన్నారు. 2022-23లో 37.23 శాతం వృద్ధితో రూ.387.50 కోట్ల రెవెన్యూ సాధించినట్లు తెలిపారు. ఇదే సమయంలో లాభాలు 151.61 శాతం పెరిగి రూ.74.10 కోట్లుగా నమోదయ్యాయన్నారు.

అమెరికా, కెనడా పర్యటన ముగించుకున్న సందీప్ మఖ్తల

హైదరాబాద్ : ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యుటిఐటిసి) చైర్మన్ సందీప్ మఖ్తల అమెరికా, కెనడా దేశాల పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలోనే తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ డబ్ల్యుటిఐటిసి స్కై సోరర్‌ను ఆవిష్కరించారు. దీంతోపాటుగా పలు యూనివర్సిటీలు, సంస్థలతో ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి తరపున చైర్మన్ సందీప్ మఖ్తల కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆగస్టు 5, 6 తేదీల్లో సింగపూర్‌లోని షాంగ్రి ఎక్స్‌పోలో జరగనున్న ప్రపంచ తెలుగు ఐటీ మహాసభలో చోటు చేసుకునే నెట్ వర్క్, లెర్న్, ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాల గురించి సైతం ఈ సందర్భంగా విపులంగా చర్చకు వచ్చింది. కెటిఆర్ పర్యటనలో సందీప్ ముఖ్తల ఐటీ పరిశ్రమకు చెందిన ఇన్వెస్టర్లు, స్టార్టప్‌ల ప్రతినిధులు, నిపుణులు, అమెరికా, కెనడా దేశాలకు చెందిన వివిధ ప్రభుత్వ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. మంత్రి కెటిఆర్ చే స్కై సోరర్ ఆవిష్కరణ, యూనివర్సిటీ ఆఫ్ సిలికానాంధ్రతో ఒప్పందం, సిలికాన్ వ్యాలీలో డబ్ల్యుటిఐటిసి కార్యాలయం, కెనడాలో తెలంగాణ ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో కలిసి పర్యటించారు.

ఆరోగ్య సంరక్షణపై భారతీయుల ఖర్చు



హర్యానాలో అధికం

- జాతీయ సగటు కంటే 2.4 రెట్లు ఎక్కువ
- అసోంలో అత్యల్పం
- మొత్తం వ్యయంలో పట్టణాల వాటా 42 శాతం
- గ్రామీణ ప్రాంతాల వాటా 57 శాతం
- సీఎంఐఈ-సీపీహెచ్‌ఎస్ సమాచారం

న్యూఢిల్లీ : దేశంలో ప్రజల ఆరోగ్య సంరక్షణపై మోడీ సర్కారు చిన్నచూపు చూస్తున్నది. ప్రజలకు అవసరమయ్యే వైద్యాన్నీ ప్రజలకు క్షేత్రస్థాయిలో ఉచితంగా అందించలేక పోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కారణంగా ప్రజలు తమ జేబుల నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు దేశంలో ఏర్పడ్డాయి. గతేడాది నవంబర్‌లో భారతీయ కుటుంబాలు ఆరోగ్య సంరక్షణ సంబంధిత వ్యయంపై రూ. 12 వేల కోట్లకు పైగా ఖర్చు చేశాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీకి చెందిన కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే (సీఎంఐఈ-సీపీహెచ్‌ఎస్) ఆధారంగా అంచనాలు ఈ సమాచారాన్ని వెల్లడిస్తున్నాయి.

ఈ కాలంలో (గతేడాది నంబంబర్) మొత్తం ఆరోగ్య సంరక్షణ సంబంధిత వ్యయంలో పట్టణం భారతదేశం 42.3 శాతం వాటాను కలిగి ఉన్నది. మిగిలిన 57.7 శాతం ఖర్చు గ్రామీణ భారతదేశం నుంచి ఉండటం గమనార్హం. సీఎంఐసీ-సీపీహెచ్‌ఎస్ 1,78,677 గృహాల నుంచి 8,75,000 మందిని సంప్రదించి సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో కుటుంబాలు మందులు, వైద్యులు, ఆస్పత్రిలో చేరటం, ఆరోగ్య బీమా, వైద్యపరీక్షలు, వైద్య సహాయాలపై చేసిన ఖర్చులు గురించి ఉంటాయి.

42 శాతం ఖర్చు మందులపై

ఈ సర్వే సమాచారం ప్రకారం.. ఫిట్‌నెస్ సేవలు, పరిశుభ్రత ఉత్పత్తులు, పార్లర్‌లు, స్పాలతో సహా ఆరోగ్య మెరుగుదల సేవలు.. ఆరోగ్య సంరక్షణ వ్యయంలో అత్యధికంగా 45.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలో మందులపై చేసిన ఖర్చు 42.3 శాతంగా ఉన్నది. భారత్‌లో 6.7 శాతం మంది సాధారణ మందులు తీసుకుంటున్నారు. వృద్ధులలో ఈ వాటా అధికం. వైద్యుల, ఫిజియోథెరపిస్టుల ఫీజులు 5.6 శాతం ఉండగా.. ఆరోగ్య బీమా ప్రీమియం మొత్తం ఆరోగ్య సంరక్షణ సంబంధిత వ్యయంలో రెండు శాతం ఉంటుంది.

సగటు కుటుంబం చేసిన ఖర్చు రూ.3638

2018 ఆర్థిక సంవత్సరంలో సగటు భారతీయ కుటుంబం ఆరోగ్య సంరక్షణపై రూ. 3,632 లు ఖర్చు చేసింది. 2022 నాటికి ఇది స్వల్పంగా పెరిగి రూ.3,638కి చేరింది. 2018, 2019 ఆర్థిక సంవత్సరాల మధ్య సగటు కుటుంబాలు ఆరోగ్యంపై ఖర్చు చేయటంలో 23.3 శాతం పెరుగుదలను నివేదించాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో 16.3 శాతం పెరుగుదల నమోదైంది. కోవిడ్-19 వ్యాధి వ్యాప్తి సమయంలో దేశంలో కఠినమైన లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పుడు 2020 ఏప్రిల్‌లో ఆరోగ్య సంరక్షణ కోసం గృహాలు చేసే మొత్తం ఖర్చు గణనీయంగా తగ్గింది. 2020 ఫిబ్రవరిలో ఆరోగ్య సంరక్షణ వ్యయం రూ. 94 బిలియన్లుగా ఉండగా.. అది అదే ఏడాది ఏప్రిల్‌లో రూ. 43.8 బిలియన్లకు పడిపోవటం గమనార్హం. అలాగే, అదే నెలలో మందులపై దాదాపు 19 శాతం, ఆరోగ్య మెరుగుదల సేవలపై 66.4 శాతం ఖర్చులు తగ్గాయి.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యత్యాసం

గ్రామీణ ప్రాంతాలలో.. రూ. 8 వేల లోపు నెలవారీ ఆదాయం కలిగిన కుటుంబాలు ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 304 వెచ్చించాయి. రూ.80 వేల కంటే ఎక్కువ నెలవారీ ఆదాయం కలిగిన కుటుంబాలు రూ.447 ఖర్చు చేశాయి. ఇక పట్టణ ప్రాంతాలలో ఇది వరుసగా రూ.344, రూ. 1275 గా ఉండటం గమనార్హం.

ఇక రాష్ట్రాలవారీగా చూసుకుంటే.. ఆరోగ్య సంరక్షణ వ్యయంలో వ్యత్యాసం గణనీయంగా ఉన్నది. గతేడాది నవంబర్‌లో హర్యానాలోని కుటుంబాలు సగటున రూ.873 లు ఖర్చు చేశాయి. ఇది జాతీయ సగటు కంటే 2.4 రెట్లు అధికం. అలాగే, ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)తో పోల్చుకున్నా ఇదే ఎక్కువ. ఈశాన్య రాష్ట్రం అసోంలో ఇది మిగత రాష్ట్రాలు, యూటీలతో పోల్చుకుంటే అతి తక్కువ రూ.223గా ఉన్నది. అయితే, ప్రపంచ ప్రమాణాలతో పోల్చుకుంటే మాత్రం భారత్‌లో ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం చేసే ఖర్చు తక్కువగానే ఉన్నట్టు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా దేశంలోని ప్రజలు తమ జేబుల నుంచి ఖర్చు చేయటం, ప్రయివేటు ఆస్పత్రులపై ఆధారపడటం వంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని నిపుణులు, విశ్లేషకులు వెల్లడించారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం

అప్రూవర్‌గా మారిన అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డి

- సిబిఐ స్పెషల్ కోర్టులో ఈడి పిటిషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ స్కాంలో సౌత్ గ్రూప్ నుంచి కీలక పాత్ర పోశించినట్లు ఆరోపలు ఎదుర్కొంటున్న ట్రిడెంట్ లైఫ్ సైన్సెస్, అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డి అప్రూవర్ గా మారారు. ఈ మేరకు గురువారం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడి) అధికారులు రౌస్ అవెన్యూలోని సిబిఐ స్పెషల్ కోర్టులో వెల్లడించారు. ఈ కేసులో ఎమ్మెల్సీ కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు సైతం ఇదివరకే అప్రూవర్ గా మారారు. దీంతో ఢిల్లీ మద్యం కుంభకోణంలో సౌత్ గ్రూప్ చుట్టూ ఎన్ ఈడి ఉచ్చు మరింత బిగిస్తోంది. హైదరాబాద్ లిక్కర్ వ్యాపారి అరుణ్ రామచంద్ర పిళ్లై ఇచ్చిన వాగ్మూలంతో ముఖ్యంగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీరుపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటి వరకు ఈ కేసులో కవితను సాక్షిగా పేర్కొన్న దర్యాప్తు సంస్థ... ఇటీవల దాఖలు చేసిన 4వ చార్జ్ షీట్ లో కవితతో నిందితులకు ఉన్న సంబంధాలను వెల్లడించింది. కాగా, లిక్కర్ కేసులో ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద గతేడాది నవంబర్ 11న శరత్ చంద్రా రెడ్డి ని ఈడి అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి శరత్ చంద్రా రెడ్డి తీహార్ జైళ్లో ఉన్నారు. ఇటీవల తన భార్య అనారోగ్యం కారణంగా షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ను మంజూరు చేసింది.

శరత్ చంద్రా రెడ్డియే కీలకం

సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో దారిమళ్లించిన రూ. 100 కోట్ల వెనక శరత్ చంద్రా రెడ్డి కీలక పాత్ర పోశించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడిలు ఆరోపిస్తున్నాయి. మొత్తం రూ.100 కోట్లలో రూ.64 కోట్లను శరత్ తన భార్య కనికా రెడ్డి సహాయంతో చార్టెడ్ ఫ్లయిట్ ద్వారా గోవా ఎన్నికలకు మళ్లించినట్లు ఈడీ పేర్కొంది. ముఖ్యంగా ఎల్ 1, పలు లిక్కర్ జోన్లను దక్కించుకునేందుకు శరత్ చంద్రా రెడ్డి కంపెనీల నుంచి నిధులు మళ్లించినట్లు ఆరోపిస్తోంది. మల్టీపుల్ బ్యాంక్ అకౌంట్లు, డబ్బుల ట్రాన్స్ క్షన్స్ కోసం కొన్ని కంపెనీలను ఎంగేజ్ చేసినట్లు గత చార్జ్ షీట్లలో ప్రస్తావించింది. అంతే కాకుండా కవితతో కలిసి శరత్ చంద్రా రెడ్డి ఢిల్లీ, హైదరాబాద్ హెూటల్స్ లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నట్లు పేర్కొంది. ఆప్ నేత విజయ్ నాయర్ తో పలు మార్లు ఈ చర్చలు జరిగిన తర్వాతే శరత్ చంద్రా రెడ్డి ట్రాన్స్ క్షన్స్ చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ స్కాం వివరాలను శరత్ చంద్రా రెడ్డి పాయింట్ టూ పాయింట్ దర్యాప్తు సంస్థలకు వివరిస్తే... ఎమ్మెల్సీ కవితకు కష్టాలు వచ్చే పరిస్థితి ఉంది. కేవలం తాము బినామీని మాత్రమే అని ఇటీవల పిళ్లై ఇచ్చిన స్టేట్మెంట్, కవిత తరపున సౌత్ గ్రూప్ కు ప్రతినిధిగా వ్యవహరించానని బుచ్చిబాబు, గ్రూప్ సభ్యుల ఆదేశాల మేరకే డబ్బుల ట్రాన్స్ క్షన్ చేసినట్లు శరత్ చంద్ర రెడ్డి లు స్టేట్మెంట్లు ఇచ్చారు. అయితే ప్రస్తుతం గోరంట బుచ్చిబాబు, శరత్ చంద్రా రెడ్డిలు అప్రూవర్లుగా మారిన నేపథ్యంలో... అసలు ఈ స్కాంలో సౌత్ గ్రూప్ నుంచి కీలక పాత్ర పోశించిన వారి పేరు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇందులో శరత్ చంద్రా రెడ్డి, బుచ్చిబాబు, పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, ఇతర నిందితుల పాత్ర తేలనుంది.

జడ్ ప్లస్ భద్రతను తిరస్కరించిన పంజాబ్ సీఎం

చండీగఢ్: కేంద్ర హోం శాఖ తనకు కేటాయించిన జడ్ ప్లస్ భద్రతను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తిరస్కరించారు. తనకు రాష్ట్ర పోలీసులపై నమ్మకం ఉందని వెల్లడించారు. పంజాబ్, ఢిల్లీలో వారు తనకు రక్షణగా ఉంటారని చెప్పారు. ఇటీవల ఖలిస్థానీ సానుభూతిపరుడు, 'వారిస్ పంజాబ్ దే' నాయకుడు అమత్‌పాల్ సింగ్ అరెస్టయ్యాడు. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో భగవంత్ మాన్‌కు జెడ్ ప్లస్ రక్షణ కల్పించాలని గతవారం కేంద్రం నిర్ణయించింది. ఈ భద్రతను తిరస్కరించిన ముఖ్యమంత్రి తనకు పంజాబ్ పోలీసులు అందించే రక్షణ సరి పోతుందన్నారు. అలాగే రెండు రకాల భద్రతా ఏర్పాట్లు ఉండటం వల్ల గందరగోళం ఏర్పడుతుందని కేంద్ర హోం శాఖకు రాసిన లేఖలో వెల్లడించారు. అయితే ఇతర రాష్ట్రాల్లో అందించవచ్చని చెప్పారు.

కాగా, పంజాబ్ ముఖ్యమంత్రికి జెడ్ ప్లస్ భద్రత ప్రకటించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ముఖ్యమంత్రులు ప్రకాశ్ సింగ్ బాదల్, కెప్టెన్ అమరీందర్ సింగ్, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి సుఖబీర్ సింగ్ బాదల్, మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మాజిథియాకు ఈ భద్రతను కల్పించారు. ఇందుకోసం రక్షణగా 55 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని కేటాయిస్తారు.

62 మంది వైద్యులకు బీహార్ నోటీసులు

పాట్నా: ఏళ్ల తరబడి విధులకు డుమ్మా కొడుతున్న 62 మంది వైద్యులకు బిహార్ ప్రభుత్వం తాజాగా నోటీసులు జారీ చేసింది. వీళ్లంతా కనీసం ఏడాదికి పైబడి విధులకు హాజరుకాని వాళ్లే. 15 రోజుల్లోగా తగిన వివరణ ఇవ్వాలని, లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొంది.నోటీసులు జారీ చేసిన వైద్యుల పేర్లు, వారు పని చేస్తున్న ఆరోగ్యకేంద్రాలు, ఆస్పత్రుల వివరాలను వైద్యశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. నిర్దేశించిన గడువులోగా సంబంధిత అధికారులకు సరైన వివరణ ఇవ్వకపోతే.. ప్రభుత్వ నోటీసులను ధిక్కరించినట్లుగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పైఅధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైనట్లయితే.. సర్వీసు నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. నోటీసులు జారీచేసిన వారిలో అత్యధికంగా 14 మంది రాజధాని పాట్నాలోనే విధులు నిర్వహిస్తున్నారు. కాగా, విధులకు గైర్హాజరయ్యారన్న కారణంతో గత జనవరిలో బిహార్ ప్రభుత్వం 64 మంది వైద్యులను విధుల నుంచి తొలగించింది. ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ అధ్యక్షత మంత్రుల కమిటీ సుదీర్ఘంగా చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసు కుంది. అంతకుముందు గైర్హాజరుకు గల కారణాలను వివరించాలంటూ ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించింది. అయితే, వైద్యుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ప్రభుత్వం వారందరినీ డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సూడాన్ సంక్షోభానికి పసికందుల బలి

ఆకలిలో అలమటించి 60 మంది చిన్నారుల మృతి

- ఖార్తూమ్‌లో హృదయవిదారక దృశ్యాలు



ఖార్తూమ్: సూడాన్‌లో సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు ప్రజలను కల్లోలంలోకి నెట్టేస్తోంది. రాజధాని నగరమైన ఖార్తూమ్‌లోని ఒక అనాథ శరణాలయానికి సంబంధించి వెలుగులోకి వచ్చిన దృశ్యాలు ఇప్పుడు విశ్వమానవాళిని కంటతడి పెట్టిస్తున్నాయి. పాలు తాగే వయసులో ఉన్న పసి మొగ్గలు పాలు, సరైన ఆహారం, కనీస వైద్యం అందక ఆకలితో అలమటించి అసువులు బాసారు. ఈ ఒక్క అనాథశరణాలయంలోనే ఆరు వారాల్లో దాదాపు 60 మంది పైగా పసిబిడ్డలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 26 మంది గత రెండు రోజుల్లోనే తనువు చాలించారు. తగిన ఆహారం లభించకపోవడం, జ్వరం చిన్నారుల మరణాలకు కారణంగా తెలుస్తోంది. కొన్ని దృశ్యాల్లో అయితే చంటి బిడ్డలను ఖననం చేసేందుకు తెల్లటి వస్త్రాల్లో చుట్టి ఉంచారు. ఒక గదిలో నేలపైనే పదుల సంఖ్యలో పసి పిల్లలు ఏడుస్తూ కనిపించారు. పాలుకు బదులుగా ఒక మహిళ రెండు జగ్గుల నీరు తీసుకెళ్లి పసి కందులకు తాగించడం హృదయాన్ని ద్రవింపచేస్తోంది. ఈ కథనాల నేపథ్యంలో సూడాన్ పరిస్థితులపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవు తుండటంతో యునిసెఫ్, రెడ్‌క్రాస్ సంస్థలు రంగంలోకి దిగాయి. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి అనాథ పిల్లలకు ఆహారం, మందులు, ఇతర అత్యవసరాలను సరఫరా చేస్తున్నాయి. 1.36 కోట్ల మంది చిన్నారులకు మానవతా సాయం అవసరమని యునిసెఫ్ ప్రకటించింది. సూడాన్ ప్రస్తుతం సైన్యం, పారామిలిటరీ బలగాల మధ్య ఆధిపత్య పోరుతో కల్లోలి తంగా మారింది. స్థానికంగా భారీ స్థాయిలో ఘర్షణలు, దాడులు నిత్యకృత్యంగా మారాయి. లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇతర ప్రాంతాలకు బతుకుజీవుడా అంటూ వలసలు పోతున్నారు. ఇప్పటివరకు 16.5 లక్షల మంది ప్రజలు స్వస్థలాలను వీడి వలసెళ్లారు. వేలాది మంది దేశాన్ని కూడా వీడి వెళ్లిపోతున్నారు. ఘర్షణ ల కారణంగా ఇప్పటి వరకు 900 మంది చనిపోయి వుంటారని సూడాన్ డాక్టర్స్ సిండికేట్ సంస్థ వెల్లడించింది. వీరిలో 200 మంది చిన్నారులే ఉన్నారు. వాస్తవానికి మృతుల సంఖ్య ఇంకా భారీగానే ఉంటుందని భావిస్తున్నారు.

రాజస్థాన్‌లో ఉచిత విద్యుత్ అమలు

జైపూర్: రాజస్థాన్‌లో ఉచిత విద్యుత్ పథకం గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం నెలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగానికి ఎలాంటి బిల్లు వసూలు చేయరు. ప్రజలందరికీ ఉపయోగపడే ఈ పథకం గురువారం నుంచి అమల్లోకి వచ్చిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నెలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే ఒక్క పైసా కూడా వసూలు చేయబోమని సీఎం అశోక్ గెహ్లాట్ వివరించారు. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గురువారం నుంచి ప్రజలకు ఉచిత విద్యుత్ ఇస్తామని సంచలన ప్రకటన చేశారు. ఈ ఏడాది డిసెంబరు నెలలో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలలు జరగనున్నాయి.

చొరబాటుదారుడు కాల్చివేత

శ్రీనగర్ : భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఒక పాకిస్థానీ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) హతమార్చింది. భద్రతా సిబ్బంది హెచ్చరించినప్పటికీ, ఆ వ్యక్తి దూసుకొస్తుండటంతో కాల్పులు జరిపారు. జమ్ముకాశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల్లో సాంబ సెక్టర్లో ఈ సంఘటన గురువారం జరిగింది.

బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం, అంతర్జాతీయ సరిహద్దుల్లోని బీఓపీ (బోర్డర్ ఔట్ పోస్ట్) మంగు చక్ వద్ద గురువారం తెల్లవారుజామున 2.50 గంటలకు పాకిస్థాన్ వైపు నుంచి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా దూసుకొస్తుండాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గమనించారు. ఆ వ్యక్తిని హెచ్చరించినప్పటికీ, ఆ వ్యక్తి సరిహద్దు కంచె వైపు దూసుకొచ్చాడు. దీంతో భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో సాంబ సెక్టర్‌లో బీఎస్ఎఫ్ సిబ్బంది సోదాలు నిర్వహించారు.

మణిపూర్ ఘర్షణలపై జ్యుడిషియల్ విచారణ

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- హింసాకాండ కేసులపై సిబిఐ దర్యాప్తు



ఇంఫాల్ / న్యూఢిల్లీ : మణిపూర్‌లో కొనసాగుతున్న ఘర్షణలపై హైకోర్టు రిటైర్డ్ ప్రధానన్యాయమూర్తి అధ్యక్షతన జ్యుడిషియల్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు ఇంఫాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇరు గ్రూపులు శాంతి, సంయమనం పాటించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వదంతులు వ్యాప్తి చెందే వీలుందని, ప్రజలు వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో జరిగిన హింసాకాండను 'ఆదివాసీ జాతుల మధ్య హింస'గా అమిత్ షా పేర్కొన్నారు. హింసాకాండకు దారితీసిన కారణాలు ఏమిటీ? దీనికి బాధ్యులు ఎవరు? అనేది విచారణ కమిషన్ కేంద్ర ప్రభుత్వం తరుపున నివేదిస్తుందని తెలిపారు.

ఆదివాసీ గ్రూపులకు బెదిరింపులు

అతివాద సంస్థల కార్యకలాపాలను రద్దు చేస్తూ కుదుర్చుకున్న సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (సూ) ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుకి సాయుధ గ్రూపులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెచ్చరించారు. 2008లో రెండు ఆదివాసీ కుకి గ్రూపులైన యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్ (యుపిఎఫ్), కుకి నేషనల్ ఆర్గనైజేషన్ (కెఎన్ఒ) మధ్య ఈ 'సూ' ఒప్పందం కుదిరింది. కెఎన్ఒ అనేది 24 సాయుధ గ్రూపుల ఐక్య వేదిక. ఈ రెండు గ్రూపుల్లో 2200 మంది సాయుధ కేడర్లు ఉన్నారు. 'సూ' ఒప్పందం ప్రకారం ఇరు గ్రూపులకు చెందిన సాయుధులు తమ ఆయుధాలను నిర్దేశిత శిబిరాల్లో అప్పగించాల్సి వుంటుంది. గత మే నెల 3న మొదలైన ఘర్షణల్లో మేయితేయా గ్రూప్స్‌పై కుకి గ్రూపులు ఈ ఆయుధాలను వినియోగించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అమిత్ షా హెచ్చరికలు జారీ చేశారు. 'సూ గ్రూపులను కఠినంగా హెచ్చరిస్తున్నాం. ఒప్పందానికి సంబంధించి ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఒప్పంద నిబంధనల అమలుపై నిశితంగా పర్యవేక్షిస్తాం' అని ఆయన చెప్పారు. ఆరాంబాయి తెంగ్గోల్, మేయితేయా లీపున్ వంటి మేయితేయా గ్రూపులు పోలీసు ఆయుధాగారాల నుంచి ఆయుధాలను లూటీ చేసి గిరిజన ప్రజలపై దాడులు చేస్తున్నట్లు కుకి గ్రూపులు ఆరోపిస్తున్నాయి. గత మే నెల 3 తర్వాత సుమారు 1429 ఆయుధాలను లూటీ చేసినట్లు ఆ గ్రూపులు పేర్కొన్నాయి. ఈ ఆయుధాలన్నిటిని పోలీసులకు అప్పగించాలని సాయుధ గ్రూపులను గురువారం నాడు అమిత్ షా కోరారు. ఆయుధాలను అప్పగించకపోతే ఈ నెల 2వ తేదీ శుక్రవారం నుంచే కూంబింగ్ ఆపరేషన్‌ను పోలీసులు చేపడుతారని తెలిపారు. ఆయుధాలున్నవారిపై కఠిన చర్యలు ఉంటాయని షా బెదిరించారు.

సిబిఐతో దర్యాప్తు

మణిపూర్‌లో హింసాకాండకు సంబంధించి ఇప్పటి వరకు నమోదైన కేసులన్నింటిలో నుంచి ఐదు కేసులను ఎంపిక చేసుకొని వాటిని ఒకే జనరల్ 'కుట్ర' కేసుగా నమోదు చేసి కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) దర్యాప్తు చేస్తుందని అమిత్ షా తెలిపారు. అలాగే మణిపూర్ గవర్నరు అనుసూయ ఉయికె నేతృత్వంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పౌర సమాజ గ్రూపులకు చెందిన వారితో ఒక శాంతి కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని షా చెప్పారు. వివిధ రక్షణ ఏజెన్సీలకు సంబంధించిన బలగాలు మణిపూర్‌లో శాంతిస్థాపనకు పనిచేస్తున్నాయని, వాటిని అన్నిటిని కలిపి కేంద్ర పోలీసు రిజర్వు బలగాలు (సిఆర్‌పిఎఫ్) రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ కులదీప్ సింగ్ నేతృత్వంలో నడిచేలా ఒకే కమాండ్ కిందకు తక్షణమే తీసుకొస్తామని తెలిపారు. మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి భద్రతా సలహాదారుగా కులదీప్ సింగ్ ఇదివరకే నియమితులయ్యారు.

కోర్టు తీర్పును తప్పుగా అర్థం చేసుకున్నందునే...

మణిపూర్‌లో గత ఆరేళ్లుగా అశాంతియుత వాతావరణమే నెలకొని ఉందని షా తెలిపారు. ఇటీవల కోర్టు ఇచ్చిన ఒక తీర్పును తప్పుగా అర్థం చేసుకోవడం, ఇతర అనుమానాల కారణంగా ప్రస్తుతం హింసకు దారితీసినట్లుగా ఆయన చెప్పారు. మేయితేయిలను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చేందుకు వీలుగా నాలుగు వారాల్లోగా ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మణిపూర్ హైకోర్టు ఈ ఏడాది మార్చి 27న ఆదేశించింది. ఇప్పటికే షెడూల్డ్ తెగలుగా ఉంటున్న 34 తెగలు హైకోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో 34 శాతంగా ఉన్న ఈ 34 తెగలు అత్యధికం కొండప్రాంత జిల్లాల్లోనే ఉంటున్నాయి. ఛురచందాపూర్‌లో మే 3న వీరికి సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక అప్పటి నుంచి మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనేవుంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ కర్ఫ్యూ కొనసాగుతోంది.

సరిహద్దులో 80 కిలోమీటర్ల వరకు కంచె

కాగా మణిపూర్ - మయన్మార్ సరిహద్దులో 10 కిలోమీటర్ల వరకు కంచె ఏర్పాటు చేశామని, దీనిని త్వరలోనే 80 కిలోమీటర్ల వరకు పొడిగిస్తామని అమిత్ షా చెప్పారు. మయన్మార్ నుంచి అక్రమ వలసల గురించి విలేకర్లు ప్రశ్నించగా..సరిహద్ద ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు బయోమెట్రిక్, ఐరిస్ స్కాన్, వేలుముద్రలు తీసుకొని నిశితంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. భారత్-మయన్మార్ మధ్య ఫ్రీ మూవ్‌మెంట్ (వీసాలు అవసరం లేకుండా) ఒప్పందం ఉంది. కొండ ప్రాంతాల్లో ఒక వ్యక్తికి రూ.2 వేలు ధరతో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభిస్తామని, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ప్రయాణించేందుకు, విమానాశ్రయాలకు వెళ్లేందుకు ఈ సర్వీసులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. అయితే కొండ ప్రాంతాల నుంచి ఇంఫాల్‌లో తమ ప్రాణాలకు రక్షణ ఉండదని, పొరుగునున్న ఐజ్వాల్, గౌహతికి హెలికాప్టర్ సర్వీసులు నడపాలని కొండ ప్రాంత ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. కాగా మణిపూర్ ప్రస్తుత డిజిపి పి డౌంజెల్‌ను తొలగించి ఆయన స్థానంలో సీనియర్ ఐపిఎస్ అధికారి రాజీవ్ సింగ్‌ను డిజిపిగా నియమించారు. డౌంజెల్‌ను ఓఎస్‌డి (హోం)కు బదిలీ చేశారు.